ఏప్రిల్ '71 19

మేధావులు - విప్లవం

ఝాఁ పాల్ సార్త్రెతో ఇంటర్వ్యూ

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

తాజా కలం

స్వాధీన్ బంగ్లాదేశ్.

నిర్వహణ: 'సాహితీ మిత్రులు' వెల: ఒకరూపాయి

19

ఏప్రిల్ 1971

సృజన

మాసపత్రిక

నిర్వహణ:
"సాహితీ మిత్రులు"

84 పేజీలు

వెల: ఒక రూపాయి

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

ఏప్రిల్ 1971 మాసపత్రిక 19

సవరణ: ప్రజలు-భావాలు వ్యాసం కొనసాగే 48 వ పేజీ తర్వాత 49,50,51,52 పేజీలు 45,46,47,48గా అచ్చయింది. ప్రజలు - భావాలు అనే శీర్షిక ఉండాల్సినచోట మోతుబరి అనే శీర్షిక వున్నది. ఇది సవరించి చదువుకోవలసిందిగా మనవి.

ఝంఝ

ఝంఝను పోలీసువాళ్ళు కూడ ఝమ్ఝుగా చదివి బెదిరిపోయి నిషేధించారు. హృదయాల్లోని విప్లవాగ్నిని మాటల జ్వాలల్తో దేశమంతా పంచుతున్న ఝంఝూమారుత జ్వాలాముఖుల భావాల్లోని చిత్తశుద్ధిని శోధించలేని దివాళాకోరు ప్రభుత్వం విప్లవకవుల ఇళ్ళు సోదాచేసింది— బాంబులే వుంటాయనుకున్నదో, బందూకులే దొరుకుతాయనుకున్నదో. రచయితలపై యీ ప్రభుత్వ దమననీతిని నిరసిస్తూ, నిజానికి, స్వేచ్ఛాప్రియ సాహిత్యలోకంలో ఝంఝూ ప్రభంజనమే వీచాల్సివున్నది.

ఈ సందర్భంలో విప్లవ కవులతో తనకున్న సిద్ధాంత విభేదాలను పక్కకుబెట్టి నిర్ద్వంద్వంగా యీ చర్యను నిరసించిన, కళాకేళి సంపాదకులు సోమసుందర్ గారికి

'ఒక రచయిత రాసేది - మంచిదా, చెడుదా, పనికివచ్చేదా, పనికిరానిదా అన్నది తేల్చవలసింది ప్రభుత్వం కాదు, ప్రజలే' అని తన సంపాదకీయంలో స్పష్టంచేస్తూ 'చౌకబారు సెక్స్ సాహిత్యం ప్రచురించి, అమ్ముకునేందుకు అనుమతించి, నమ్మిందాన్ని అగ్నిగోళం బద్దలైనట్లు చెప్పేవారిని కటకటాల సంకెళ్ళలో వత్తుతున్న 'యీ దేశంలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు ఎక్కడున్నా'యని ప్రశ్నిస్తూ 'స్వేచ్ఛా, భావ స్వాతంత్ర్యం రచయితకు యివ్వలేని దేశం— ఏ ప్రభుత్వం అని పేరుపెట్టుకున్నా అది ప్రజకు అనుగుణమైందికాదు. నిజాయితీతో తను నమ్మింది ఇతరులకు చెప్పేహక్కు రచయితకు ఉంది' అని 'వేకువ'లో యీ విషయాన్ని ప్రస్తావించిన సంపాదకులు కె. శివారెడ్డి గారికి తోటి సంపాదకునిగా నా అభివందనాలు అందచేస్తున్నాను.

ప్రజాతంత్రి రాజ్యాల్లో రచయితల స్వేచ్ఛగురించి, సోషలిజం కోరుతున్న రచయితలను, సోషలిజమే కోరుతున్న (?) ప్రభుత్వం హింసిస్తున్న పారడాక్స్ (!) గురించి శాస్త్రీయంగా చర్చించి, ఆలోచనాత్మకమయిన అంశాలను ప్రతిపాదించిన కుటుంబరావుగారి వ్యాసాన్ని, అందుకే, యీసారి సృజన గెస్ట్ ఎడిటోరియల్‌గా ప్రచురిస్తున్నది.

సోషలిజందాకా ఎందుకు, పౌర హక్కుల్ని, ప్రాథమిక హక్కుల్ని కాపాడుకోవడానికయినా, కనీసం, మన మేధావులు కలసివస్తారని, కదలివస్తారని ఆశిద్దాం.

—సంపాదకుడు

గెస్ట్ ఎడిటోరియల్:

సాహిత్యం మీద ప్రభుత్వం దాడి

ప్రజాతంత్రంలో భావప్రకటనా స్వాతంత్ర్యం విధిగా ఉంటుందని సిద్ధాంతం, కమ్యూనిస్టు దేశాలలో భావ స్వాతంత్ర్యం ఉండదనీ, అందుచేత కమ్యూనిజం కన్న ప్రజాతంత్రం గొప్పదనీ వాదం. ఈ సిద్ధాంతాన్నీ, వాదాన్నీ పదేపదే స్మరణచేసే వాళ్లు ఒకటి గమనించరు. అల్ప సంఖ్యాకవర్గం అధిక సంఖ్యాకులను పాలించేటప్పుడు భావప్రకటనా స్వాతంత్ర్యం లేకపోతే సాంఘికపరిణామం స్తంభించిపోతుంది. కమ్యూనిజం అవలంబించిన దేశాలలో ప్రజలే పాలకవర్గం అయినప్పుడు భావప్రకటనా స్వాతంత్ర్యం పేరిట అల్పసంఖ్యగల వాళ్ళు సమాజవికాసానికి అడ్డుపుల్లలు వేస్తారు

ఇంతకన్న ముఖ్యమైనదేమంటే అసమ సమాజంలో ప్రజాతంత్రం ఉండదు. అది బూటకపుమాట ప్రజాతంత్రం అమలు జరిగినట్టయితే మనదేశంలో ప్రజలు ఇంత అధోగతితో ఉండరు; వారిపైన పోలీసులు ఇంతగా విలయతాండవం చెయ్యరు; "మేము మీకు సోషలిజం తెచ్చి ఇస్తాము" అని ఎలెక్షన్ల సంరంభంలో పాలకవర్గీయులు ప్రజలకు చెప్పరు. సోషలిజం, విప్లవంలాగే, ఎక్కడినుంచో దిగుమతిచేసేదీ, ఒకరు ఇచ్చేదీకాదు: ప్రజలే దాన్ని పోరాడి తెచ్చుకుంటారు. ప్రజలలో చైతన్యాన్ని పెంపొందించేవారే సోషలిజంకు దోహదం చెయ్యగలరు. విప్లవం లేకుండా సోషలిస్టు వ్యవస్థ ఏర్పడదు. ఎక్కడా ఏర్పడలేదు— కొంతమంది కుత్సితపు బుర్రల్లోతప్ప. ప్రజల ప్రమేయం లేకుండానూ, శాంతియుతంగానూ సోషలిస్టు వ్యవస్థ ఏర్పరుస్తామని వాగ్దానాలు చెయ్యటంకన్న ప్రజాద్రోహం మరొకటిలేదు.

ఈ సంగతి సామాన్య ప్రజలకందరికీ తెలుసునా? తెలుసునని నాకు అనుకోవాలనే ఉంది. కాని అది ఆత్మవంచన అవుతుందని భయపడుతున్నాను. ఇందిరా కాంగ్రెసు అబద్ధాలాడిందని తెలిస్తే అంతభారీగా ఆ కాంగ్రెసుకు వోట్లుపడవు. అయినా ఎన్నికలలో వోటువెయ్యని సుమారు 46 శాతం వోటర్లకు రాజకీయ పరిజ్ఞానం ఉండవచ్చునని ఆశిస్తున్నాను.

విద్యార్థులలోనూ, యువకులలోనూ కూడా నాకు విశ్వాసం ఉన్నది. దానికి కారణం చెబుతాను. చాలాచోట్ల సాహిత్యసభలలో కవితాపఠనమూ, ఉపన్యాసాలూ జరిగినప్పుడు ప్రేక్షకశ్రోతలు విప్లవకవిత్వాన్నీ విప్లవభావాలనూ హర్షించినట్టుగా వెనక

పీకుడు కవిత్వాలను హర్షించలేదు. గాంధీతత్వం బోధించజూచిన కవులను "పాడ" నివ్వకుండా దింపెయ్యటం జరిగింది. ఇది ఒకచోటకాదు వందచోట్ల జరిగింది, జరుగుతున్నది.

ఇందుకేమిటి కారణం? ఈవిప్లవ సాహిత్యాన్నీ, విప్లవభావాలనూ హర్షించే లక్షలాది యువకులూ, యువకులు కానివాళ్ళూ, విద్యార్థులూ రాజకీయంగా మార్క్సిస్టు-లెనినిస్టులు కాకపోవచ్చు. కాని వాళ్లు మానసికంగా విప్లవసాహిత్యాన్నీ విప్లవభావాలనూ స్వీకరించి, వాటిద్వారా చైతన్యం పొందటానికి సిద్ధంగా ఉన్నారు. అంతేకాదు, వాళ్లకు పాండురోగపు సాహిత్యం అవసరంలేదు. వ్యష్టిగా వాళ్లు సెక్సుసాహిత్యమే చదివినా, సమిష్టిమీద వాళ్ళకు కావలసినది విప్లవసాహిత్యం. విప్లవసాహిత్యాన్ని ప్రతిఘటించేవాళ్లు అల్పసంఖ్యాకులు అత్యల్ప సంఖ్యాకులని కూడా చెప్పగలను. వారిలో పలాయనతత్వమో, స్వార్థమో, అసూయో, పచ్చిఅజ్ఞానమో ఉన్నట్టు రుజువుచెయ్యటం కష్టంకాదు విప్లవసాహిత్యం సృష్టించేవారికీ, ప్రచారం చేసేవారికీ ఇలాటి మానసిక వ్యాధులులేవు. ఉండే అవకాశంకూడా లేదు. నక్సలైట్లకు స్వార్థం అంటగట్టడం ఎంత అసమంజసమో, విప్లవ సాహితీపరులకు ulterior motives అంటగట్టటంకూడా అంత అసమంజసమే. అమాయిక మనస్తత్వంగల వాళ్లు స్వార్థాన్నిసహించి అర్థంచేసుకున్నట్టుగా నిస్వార్థాన్ని అర్థంచేసుకోలేరు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను ప్రతిపక్షాలు కూలదొయ్యటానికి అవాచ్యపు పనులెన్నిచేసినా అదంతా సబబుగానే కనపడుతుంది. బూర్జువా పరిపాలన అంతం కావాలనటం మటుకు రాజద్రోహం! ప్రజలే పాలకులు కావాలన్నది దేశద్రోహం!

ఇలాటి ఆరోపణలతో ఆంధ్రప్రభుత్వం విప్లవ సాహిత్యంమీద దాడి ప్రారంభించింది. దేశానికి సోషలిజం తెచ్చి, నిరుద్యోగాన్నీ, దారిద్ర్యాన్నీ, అసమానతలనూ తొలగిస్తామని వాగ్దానాలుచేసే పార్టీ పరిపాలించేచోట సోషలిజం కావాలనీ, దారిద్ర్యాన్నీ జీవితంకుళ్లనూ ప్రజలే తొలగించుకోవాలని హెచ్చరించే సాహిత్యంమీద ఏమొహం పెట్టుకుని దాడి సాగించింది? ఈ సాహిత్యాన్నిచూసి దేనికి గుండెదడ? విప్లవ రచయితల ఇళ్ళమీద అర్ధరాత్రి దాడులూ, సోదాలూ దేనికి? ఇటువంటి పనులు బ్రిటిషు పరిపాలనలో కొంత అర్థం ఉన్నది. బ్రిటిషువాళ్ళు మనకు భావ స్వాతంత్ర్యమూ, సోషలిజమూ ఇస్తామని వాగ్దానాలు చెయ్యలేదు; మనం ప్రజాతంత్రానికి కూడా పనికి రామని సర్టిఫికేటిచ్చారు!

విప్లవ సాహితీపరులను "నక్సలైట్లు" అని ఆంధ్రప్రభుత్వం అంటున్నది. సాహిత్యోద్యమానికీ రాజకీయోద్యమానికీ చుట్టరికం ఉంటుంది, కాని రెండూ ఒకటి

కాదు. ఆంధ్ర ప్రభుత్వానికి రాజకీయోద్యమాలను గురించీ, సాహిత్యోద్యమాలను గురించీ కూడా తెలియదులాగుంది. విప్లవ రచయితలు ఇతర సాహిత్యోద్యమాలకు రాజకీయ బిరుదులు ఎన్నడూ తగిలించరు. విరసంపుట్టే సమయంలోనే అభ్యుదయ సాహిత్యోద్యమం కొత్త మేకప్ చేసుకుని ముందుకు వచ్చింది. కాంగ్రెసు మంత్రులు దాన్ని ఆశీర్వదించారుగదా అని దాన్ని ఎవరూ కాంగ్రెసు సాహిత్యోద్యమం అనలేదు. అతకని పేర్లు పెట్టేవారు మూఢులను మోసపుచ్చనచ్చు. కాని తమ కుళ్లకంపుమాత్రమే బయట పెట్టుకుంటారు.

"ఝంఝ"లో సైన్యంలో చేరవద్దని హెచ్చరిక ఉన్నదని ఒక ఆక్షేపణ. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతుండగా చార్లీచాప్లిన్ "గ్రేట్ డిక్టేటర్"లో సైనికులను యుద్ధం చెయ్యవద్దని హెచ్చరిస్తాడు. తీవ్రంగా యుద్ధం జరుగుతుండగా కూడా ఆచిత్రం నడిచింది, దాన్ని ఎవరూ నిషేధించలేదు। సైన్యంలో చేరేవారిని వద్దని చెబుతూ కవిత్వంరాస్తే కూలిపోయే విషమదశలో ఉన్నదా ఆంధ్రప్రభుత్వం। ఇలాటి చర్యలుచూస్తే ఈదేశాన్ని ఏ మతిమాలినవాళ్లు పరిపాలిస్తున్నారో అర్థంకాదు.

రచయితలూ, కవులూ అన్నతరవాత వాళ్లు అంతో ఇంతో మేధావులుగానే ఉంటారు. ఎలెక్షను ప్రచారాల మీటింగుల్లో మాట్లాడేటప్పుడు రాజకీయ నాయకులు భాగవతార్ల వైఖరి అవలంబించటమే ప్రమాదకరంగా ఉన్న ఈ కాలంలో రచయితల పట్ల కాస్త గౌరవం ఉంచటం శ్రేయస్కరం. ప్రజాస్వామ్య రాజకీయ ఆదర్శాలను తోసిపుచ్చి, తమకునచ్చని రచనలుచేసే మేధావులను దొంగల్లాగానూ, కేడీలలాగానూ చూడదలుచుకున్నప్పుడు ఈ రచయితల వెనక ప్రజలున్నారనీ, పాలకులకూ పాలితులకూ మధ్య ఉండే బంధంకన్న చాలాదృఢమైన బంధం ప్రజాకవులకూ ప్రజలకూ మధ్య ఉన్నదనీ. తమ గుండెదడకు మూలకారణం ప్రధానంగా అదేననీ, ప్రజలమేలు తప్ప రచయితకు మరొక ఆశయం ఏమీలేదనీ గుర్తుంచుకోవటం మంచిది.

ఫాసిస్టు పద్ధతులు అవలంబించదలచిన పాలకులు చరిత్రను సింహావలోకనం చేసుకోవటం మేలు. నిజాన్ని ఏనాడూ ఎవరూ అణచలేకపోయారు. సూర్యుడిచుట్టూ భూమి తిరుగుతున్న దన్నందుకు ఆమాట అన్నవాళ్లను సజీవంగా తగలబెట్టినవాళ్ళను చరిత్ర గాడిదలను చేసింది. జర్మను, ఇటలీ ఫాసిస్టులు సోదిలోకిలేకుండాపోయారు. అమెరికను ఫాసిస్టులు ఇండో చీనాలో ఉడ్డుగుడుచుకుంటున్నారు; అమెరికను మేధావుల చేతనే తిట్లుతింటున్నారు. ఫాసిస్టుతత్వంలో అంధత్వం ఉన్నది. అందుచేతనే ఫ్రెంచి వాళ్ళనుచూసి అమెరికనులు గుణపాఠం నేర్చుకోలేకపోయారు. గాంధీ వారసులమని చెప్పుకునేవాళ్లు ఫాసిస్టులకు వారసులు కావటానికి ఉబలాటపడటం చిత్రం!

ఈ దేశంలోని పాలకవర్గాల క్షేమం కోరవలసిన అవసరం లేకపోయినా వారిక్షేమం అవ్యాజంగాకోరి చెబుతున్నాను. మీరు నిత్యమూవల్లించే ప్రజాస్వామ్యాన్ని చేతలలో గౌరవించండి. తిరుగుబాటు చేస్తున్నవారు చావుకూ, బతుకుకూ మధ్య సరిహద్దు చెరిగినవాళ్లనీ, వాళ్ళు అవలంబించేది ప్రతిహింసేగాని హింసకాదనీ గుర్తించండి. మీకు నిజంగా అహింసలో విశ్వాసం ఉన్నట్లయితే జీవితంలో ఉన్న దారుణ హింసను గుర్తించి, దాన్ని తుపాకులతో కాపాడటం మానండి. విప్లవం అనేమాటను తేలుమంత్రంలాగా వాడకండి. మీరు నిజంగా విప్లవ పరిణామాలు తెచ్చే సద్బుద్ధిగల వారైతే విప్లవంకోసం సకల కష్టాలను ఎదుర్కొనే వారిమీద దాడులు మానండి. ప్రజా జీవితంలో విప్లవ చైతన్యం మందకొడిగా ఉండటాన్నీ, వారిలో రాజకీయపరిజ్ఞానం హీనదశలో ఉండటాన్నీ మీస్వార్థానికి వినియోగించుకుని, ప్రజలను మభ్యపెట్టకండి.

ఇవేవీ మీరుచేయరు. మీకసలు విప్లవకరమైన కార్యక్రమంలేదు. ఆర్థికంగానూ, సామాజికంగానూ మనదేశం అపహాస్యంపాలు అవుతుంటే మీకు పట్టలేదు. ఆసియా వాసులను ఆసియా వాసులచేత చంపించి డినిడెండ్లు సంపాదించే అమెరికా ఆశయానికి మీరు ఆలోచించిన విరుగుడు ఏమిటి? ఉన్న అక్షరాస్యులకే ఉద్యోగాలు లేకుండా ఉంటే, చదువుకునేవాళ్ళకు విద్యాసంస్థలలో సీట్లులేకుండా ఉంటే, మీరు దేశంలో నిరక్షరతలేకుండా ఏం చెయ్యగలరు? మనదేశపు ఆస్పత్రిలలో చికిత్సకోసం చేరేవారిని అధికారులు అధమతరగతి పౌరులకింద చూడకుండా మీరేం చెయ్యబోతున్నారు? (డబ్బున్నవాళ్లు ప్రైవేటు నర్సింగ్ హోములకుపోయి వేలకువేలు చెల్లిస్తారు.) రోజుకు రూపాయి సంపాదించలేని కోట్లాది జనం సమస్య మీరు ఏవిధంగా తీర్చబోతున్నారు? మీకు పనికివచ్చే కార్యక్రమం ఏదీలేదు. మా విరసం రచయితలు ప్రజల తిరుగుబాటు మీద నమ్మకం పెట్టుకున్నారు. చాతనయితే దాన్ని అబద్ధం చెయ్యండి. దేశంలో విప్లవ పరిణామాలు రావటం మాకు ప్రధానం. అవి ఎవరుతెచ్చినా మేము ఆహ్వానిస్తాం. వాటిని ప్రజలే సాధించగలరని మా దృఢవిశ్వాసం. మీకు లేకపోవచ్చు, మాకు ప్రజలలో విశ్వాసం ఉన్నది. మీకు వాళ్ళ వోటులోనే విశ్వాసం ఉండిన పక్షంలో ఎప్పటికైనా దెబ్బతింటారు మీ రాజకీయాలు ప్రస్తుతం పార్పుతప్ప మరేమీ కాదు. రాజభరణాలు రద్దుచెయ్యటానికి మీకు ఒక్కవోటు తక్కువయింది? ఎవరికీ మెజారిటీ లేనిచోట నాలుగు సీట్లున్నవాళ్లు గూడుపుఠాణీలో విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్నారు! ఇటువంటి రాజకీయాలను మేము ఆదరించలేం, ప్రజలను ఆదరించవద్దని హెచ్చరించే నైతికహక్కు మాకున్నది. మా అభిప్రాయాలు మీకు చేదుగా ఉంటే మమ్మల్ని "బయటి ప్రతిపక్షం"గా తీసుకోండి. ఏ ప్రతిపక్షంమీద దాడిచేసీ మీరు మీ రాజకీయ ఆదర్శాలను నిలబెట్టుకోలేరు. ఇది ముమ్మాటికీ నిజం.

— కొడవటిగంటి కుటుంబరావు

రెండు నారా కవితలు :

బోధపరచాలి తప్పదు

వాడు
ఎత్తుగా వుంటాడు
దర్జాగా వున్నట్టు కనిపిస్తాడు
ఒకచోట సూటేసుకుంటాడు
మరోచోట ఖద్దరు కడతాడు

వాడికి
బోలెడు డబ్బుంటుంది.
డబ్బున్న వాళ్ళుంటారు
బోలెడు తుపాకులుంటాయి
బూట్లుంటాయి
ఇంకా, జైళ్ళుంటాయి, కోర్టులుంటాయి,
ఒక రాజ్యాంగం కూడా వుంటుంది.

వాడు
ఉపన్యాసాలిస్తాడు.
కోప్పడతాడు
కొంటాడు
కొడతాడు

పుస్తకాల్ని నిషేధిస్తాడు
గొంతుకల్ని నొక్కేస్తాడు
దేశాన్ని ప్రేమిస్తాడు

కాని— అదేమిటో—
గొంతుకులు మూసుకోవు
పుస్తకాలు మాసిపోవు

పిడికిళ్లూ
గుండెలూ
చప్పబడవు, చల్లారవు

పుస్తకాలు అచ్చుకాగితాల్లో కాదుగదా బతికేది
గుండెల్లో.
పిడికిలి బలం వేళ్ళల్లో కాదుగదా వుండేది
గుండెల్లో.

చంపినా, కాల్చినా, కొట్టినా కోసినా
అణచరానిది
ఒక్కటేవుంది.
మనుషుల గుండె

ఇది చాలాసార్లు, చాలాచోట్ల రుజువయిన సంగతి
అయినా, వాడికి బోధపడని సంగతి

నిజం

కొందరు చెప్పరు
చెపితే వాళ్ళకి నష్టం
మరికొందరు చెప్పలేరు
చెప్పడానికి భయం

పెద్దపెద్ద పతాక శీర్షికల మాటున
నంగినంగి సంపాదకీయాల చాటున
విలేఖర్ల కథనాల బురఖా వెనకాతల
మాటల ట్రాపుల్లోపల
నీతుల గోతుల్లోపల
విచ్చు కత్తిలాటి నిజం వుంది.
వెచ్చని నెత్తురులాంటి నిజం వుంది.

భయపడ్డ వాడికి తెలుసు
చచ్చిపోయిన వాడెందుకు చచ్చిపోయాడో,
ఎవరిచేత
ఎవరికోసం చచ్చిపోయాడో,
మాట్లాడుతున్న వాడికి తెలుసు
తాను ఎన్నెన్ని ఎందుకోసం కప్పెడుతున్నాడో-
ఎగురుతున్న జండాకి తెలుసు
ప్రతి లోయకీ ప్రతి కొండకీ తెలుసు
నీలపు ఆకాశానికి తెలుసు
నిఖిలసాక్షి సూర్యుడికి తెలుసు
ఉరికంబానికి తెలుసు
ఊరకుక్కకి తెలుసు
యూనిఫారాలకి తెలుసు
యువర్ మోస్ట్ఒబీడియంట్ సర్వెంట్స్‌కి తెలుసు

బతకాలనే కాంక్షతో
బట్టకట్టాలనే కోరికతో
గుండెల్ని గుప్పిట్లో పెట్టుకొని బతుకుతున్న
ప్రతి నీకూ నాకూ తెలుసు

అబద్ధాలకి అర్థాలు చాలా వుంటాయి.
నిజానికి ఒక్కటే అర్థం.
చచ్చినా దాన్ని కప్పట్టలేరెవరూ
ఓట్లతోగాని, నోట్లతోగాని,
రూళ్ళతోగాని, గుళ్ళతోగాని,
పెగుల్చుకుని పైకొస్తుంది—
ప్రచండంగా.

కొలిమంటుకున్నాది

—చెరబండరాజు

కొలిమంటుకున్నాది
తిత్తినిండా గాలి
పొత్తంగ ఉన్నాది
నిప్పారిపోనీకు - రామన్నా
పొద్దెక్కిపోనీకు - లేవన్నా

నీపక్క పొలమోడు
దుక్కి సాగిండన్న
కాళ్లాపి కూకోకు - రామన్నా
కార్తె పోతేరాదు - యినుమన్నా

ఎరువు కావాలింక
గుడిసేసుకోవాలి
నీబండి పట్టాలు - రామన్నా
కొత్తయే కావాలి - యినుమన్నా

ఉత్తరా నురిమింది
రోజు మొగు లవుతూంది
ఎర్రిమెరుపూ సూడు - రామన్నా
కర్రిపారా సాన - పెట్టన్నా
కంచాన గంజికీ
గద్దలూ కాకులూ
వడిసేల పేనుకో - రామన్నా
వడివడిగ రాళ్లేసి - కొట్టన్నా

ఇనుప ముక్కలు కొడుకు
లుండి ఫలమేముంది

పగటి నిద్రలు మాని–రామన్నా
పనిముట్లు చేసుకో–వేలన్నా

ఓటుకెదిగిన బిడ్డ
పెళ్లి లేకున్నాది
కూలో నాలో నేసి రామన్నా
కూడబెట్టిందేమి–లేదన్నా

చట్టాలు అన్నారు
పట్టాలు అన్నారు
పొలములో కాలెడితె–రామన్నా
పోలీసులొచ్చేరు–ఏలన్నా

కౌలు కిచ్చే నోడు
కన్నెర్ర సేసేడు
అప్పులిచ్చే నోడు
ఆలినే సూసేడు
దయగల్ల సర్కారు
దాదాలె ఆయ్యేరు
నీదారి గోదారి–రామన్నా
కానీక కదనాన–నిలువన్నా

కొలి మంటు కున్నాది
తిత్తి నిండా గాలి
పొత్తంగ ఉన్నాది
నిప్పారి పోనీకు రామన్నా
సందాల కానీకు–లేవన్నా
కర్రు పారాసాన–బెట్టన్నా
బతుకు యుద్ధము లోన–నిలువన్నా

సృష్టి

— తాడిగిరి పోతరాజు

రోహిణీ కార్తె జరిగిపోయి చానాళ్ళయినా ఇంతవరకూ చినుకులేదు. సూర్యుడు ఇంకా నిప్పులు చెరిగిపోస్తున్నాడు. పొలాలన్నీ నెర్రెలుబారి వాన చినుకు కోసం నోళ్లుతెరచుకొని ఉన్నాయి. పశువులన్నీ డొక్కలు అంటుకుపోయి ఈసురోమంటూ నేలను నాకుతూ బీళ్ళలో తిరుగుతున్నాయి.

ఇక ఊళ్ళో నీటి ఎద్దడి చూద్దామా మరింత అధ్వాన్నంగా ఉంది. నాల్గు నెలలనాడు ఒట్టిపోయిన మంచినీళ్ళ బావులు రెండూ చెత్త చెదారంతో నిండిపోతున్నాయి. ఆమడ దూరంలోవున్న చెరువులో చెలమలు త్రవ్వుకొని బురదనీళ్ల తేర్చుకొని త్రాగుతున్నారు. ఊరంతా కూలీనాలీ చేసుకొనే అలగా జనం పనులులేక తిండికి మలమల మాడిపోతున్నారు.

నాల్గురోజుల నుండి మబ్బులు చేస్తున్నాయి ఫెళఫెళమనీ ఉరుములు ఉరుముతున్నాయి, కానీ వానమాత్రం ఊరిమీద వంగటంలేదు. ఊళ్ళో ఆడంగులంతా బుగ్గలు నొక్కుకొన్నారు చోద్యంగా. వృద్ధులు నొసటిపై చెయ్యి అడ్డం పెట్టుకొని పెదవి విరుచుకొన్నారు నిరాశగా.

.... ఆవేళ మంచినీళ్ల చెరువు కట్టపై ఊళ్ళో పెద్దతలలనుకొనే పదిమందీ ఆ సమస్యా పరిష్కారానికై సమావేశమయ్యారు. కుర్రకారు వినయంగా చేతులు కట్టుకొని పెద్దలవెనుక నిలబడ్డారు.

“కలికాలం .... పాపం పెరిగిపోయింది. ఊళ్ళో దేవుడు - దెయ్యం అనే భయం భక్తి ఉంటేనా? .... ఊరు నాశనానికొచ్చింది .... కానివ్వండి... ” రుసరుసలాడుతూ బంగారపు మురుగులు పైకి త్రోసుకొంటూ ఊరిపెద్ద చిన్నపరెడ్డి సమావేశం ప్రారంభించారు.

“రాత్రి రేడియోలో చెప్పింది. అదేదో పట్నంలో కూడ నీళ్ళ ఎద్దడి....” అని “అవునవును.... బొంబాయిలో కూడ తాగటానికి నీరులేక జనం నానా ఇబ్బంది

పడిపోతున్నారంట. ఇక వానకోసం.... నిన్నటినుండి పెద్ద పెద్ద వాళ్ళందరూ కూడ బలుక్కుని వానదేవునికి పూజలు సేపిత్తున్నారంట. ఒక్క మనూళ్లోనేకాదు దేశమంతటా పాపం పెరిగిపోయింది"

"పాపమా?.... పాపమా?".... ఏనాడయినా అమ్మిందా ఏరుశెనక్కాయ నూనె తొమ్మిది రూపాయలు?.... దరిద్రపు బుద్దులు.... నాశనానికి కాకపోతే...."

"అదిసరే.... ఇప్పుడు మనం కూడ పూజలు జరిపియాల్సిందే నంటారా–....అదేదో తేలవండి." ఓ నడికారు పెద్దమనిషి ప్రశ్నించాడు.

"జరిపియాల్సిందేనంటారా?" అని మెల్లిగా అడుగుతాడేరా?.... కొలుపులు కొలవాలి.... ఊరిబయట పోలేరమ్మతల్లి గుడికాడికి పోయి ఎన్నాళ్ళయిందో ఏందో, ఒక దీపారాజన లేదు.... అలనా పాలనా లేదు.... ఆమె మాట మరిసిపోయినప్పుడు మన సంగతి ఆమె కెందుకు?" ....చుట్ట కాల్చుకొంటూ దీర్ఘంగా అన్నాడు చిన్నపరెడ్డి

"అవును బావా!.... పాపం బాగా పెరిగిపోయింది.... ఈ ఎదవ సినిమా లొచ్చినాయి.... ఆడముండలు మరీ బరితెగించిపోతున్నారు.... మన కాలంలో ఆడది గడపదాటి ఎరుగదు. ఇక యిప్పటివాళ్లా? ఒకటే ఇకఇకలు- పకపకలు.... ఎక్కడ సూసినా సినిమా ముచ్చట్లు– సిగ్గూ– ఎగ్గూ లేకుండా ... సినిమాల కెళ్ళడం ... సోకు సేసుకోవటం.... పట్టపగ్గాలు లేకుండా పోతున్నాయి".... యువతరం ఆడవాళ్ళపై తనకున్న అక్కసునంతా వెళ్ళగక్కాడు ఓ పెద్దమనిషి, అవకాశం చూసుకొని.

"ఇంతకూ ఇప్పుడేం సేద్దాం?"

"ఏంసేద్దా మేమిటి? తల్లి కోర్కెలు తీర్చాలి.... మొక్కులు మొక్కాలి ... అప్పుడే వాన బడుద్ది" ...

"ఇంకేం ఇంటికొక కోడిపుంజు ... కులానికొక దున్నపోతుగానీ ... మేక పోతునుగానీ ఇడుద్దాం తల్లిపేరట" ....

ఆ ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదించ బడింది. అందరి ముఖాల్లోనూ సంతృప్తి. విపరీతంగా పెరిగిపోయిన పాపానికి పరిహారార్థమై పోలేరమ్మ తల్లికి చెల్లించవలసిన మేకపోతులు– దున్నపోతులు– కోడిపుంజుల లెక్క తేలిపోయింది. పదిహేను రోజులవరకూ కొలుపులు కొలవాలి, నిర్ణయమైంది, ఆరోజు మొదలుకొని.

దాదాపు నెలరోజుల నుండి ముడిపడి కూర్చున్న సమస్య విడిపోయిన మబ్బులా కనిపించింది. కుర్రకారు బిలబిలమంటూ కదలసాగారు. అందరి ముఖా

ల్లోనూ ఉత్సాహం పొంగి పొర్లసాగింది. అనుకున్నదే తడవుగా పోలేరమ్మతల్లి గుడిని దర్శించటానికీ, అభిషేకించటానికీ సన్నాహాలు జరిగిపొయ్యాయి.

ఆ సాయంత్రం మూడు గంటలకు 'పంబలవాళ్ళు' డోళ్లు బూరాలూ చేత బట్టారు: 'కీం-కీం' అని డోలుపై గీరుతుంటే ఒళ్లు గగుర్పొడచ సాగింది. సింహ నాదం పైకెత్తి ఊరు ప్రతిధ్వనించేలా నాల్గుపైపులా తిప్పి ఊదుతూంటే [ఒక్కొక్క రిలో] ఏదో కొత్త ఉన్మాదం ఆవహించసాగింది. గాలిలో తిరిగే గడుసు దయ్యాలు ముసురుకొంటూన్న అనుభూతి.

కుర్రవాళ్ళందరూ ఉత్సాహంగా కావిళ్ల భుజానవేసుకొని, బావులవైపు పరు గెత్తారు. ఉరకలు పరుగులపై కావిళ్ల నింపుకొని, రెండు జట్లుగా నిలబడిపొయ్యారు. గరుడుగుడ్డ నాల్గుమూలలాబట్టి నల్గురు నిలబడ్డారు. మధ్యలో చిన్నగడతో దాన్ని గొడు గులా లేపి నిలబడ్డాడు ఊళ్లో నాల్గుతరాలు చూసిన పెద్దమనిషి. ఆతని సరసనే నిల బడింది ఊళ్లో పెద్దముత్తయిదు. తలంటి స్నానంచేసి నొసట రూపాయంత కుంకమ బొట్టు దిద్ది, పసుపుబట్టలు చుట్టుకొని హారతిపళ్లెం పట్టుకొంది. పసుపు- కుంకుమ- పూలు- బుక్కాలు- కొబ్బరికాయల మధ్య కాలుతున్న అగరువత్తులు. ఆమె చెంతనే నిప్పు కణికలున్న కుంపటి, పంబలవాళ్లు, సాంబ్రాణి చల్లినప్పుడల్లా గుప్పున పొగలేచి వాసనలు, మత్తెక్కించ సాగాయి.

డోళ్ళు- సన్నాయిలూ తారస్థాయికి వెళ్ళి- 'కీం - కీం' అనే భయంకర సంగీతం వినిపిస్తున్నాయి. పెచ్చుచేసిన కనకతప్పెటలు లయబద్ధంగా ఊరేగింపుకు దారి చూపుతున్నాయి. దాదాపు రెండుపందల నీళ్ళకావిళ్ల 'గరుడు'గుడ్డ వెనుక నిలబడి పొయ్యాయి, శ్రవణేంద్రియాలు పగిలిపొయ్యేలా చేస్తున్న ఆ కోలాహలంలో ఒకరితో మరొకరు మాట్లాడటానికి వీలులేక, సైగలు చేసుకొంటూ, హడావుడిగా తిరుగుతు న్నారు. అమ్మవారి గుడికెళ్ళటానికి అన్ని తతంగాలూ పూర్తయ్యాయి.

అందరి ముఖాల్లోనూ ఒక్క క్షణికకాలం ఏదో అవ్యక్తమైన వెలితి కంపిం చింది, ప్రోగైన జనాన్ని పరీక్షగా అవలోకించసాగారు పెద్దలు. ఊరు ఊరంతా కదిలి తల్లిని తలచుకొన్నప్పటికీ ఆమెకింకా అనుగ్రహం కలుగలేదు. ఎవరిని ఆవేశిం చటం లేదు. "తల్లిపూనింది- పూనింద"ని కేకలు—

జనం తొక్కిసలాట. జన సమూహంలో- అంతలో సమూహంలో నుండి ఒకవ్యక్తి దూసుకొచ్చాడు. పచ్చివేపాకు మండలు కసిగా నములుతూ వెనక్కీ ముందుకూ ఊగిపోసాగాడు. అందరి ముఖాల్లోనూ ఆనందం తళుక్కున మెరిసింది.

సాంబ్రాణిధూపం ఎక్కువైంది. తప్పెటలు తారాస్థాయికి వెళ్ళిపొయ్యాయి. సింహనాదాలు హర్షధ్వానాలు చేశాయి. అతని తలపై కడవలతో నీళ్ల కుమ్మరించి మరింత పవిత్రంచేశారు. నీరుకారుతూన్న శరీరంతో మరింత ఊగిపోతూ కళ్ళుమూసి కొని వేపాకు కసిగా నమిలి వెళ్ళగక్కసాగాడు.

తప్పెటలపై దరువు పరసమారింది. చిందులు తొక్కుతూ డప్పులవాళ్లు ముందుకు కదిలారు. వాళ్ళవెనుక పెద్ద ప్రవాహంలా వూరంతా పోలేరమ్మ గుడివద్దకు కదిలిపోయింది.

శంఖు ఆకారంలోవున్న గుడి - గుడిచుట్టూ నానాచెత్త చెదారం వెల్ల వేయక పోవటం వలన పచ్చగా నల్లగా పాకుడుపట్టి అసహ్యంగావుంది. రివ్వున ఒకడు గుడి పైకి ప్రాకాడు. అందరూ కడవలతో నీళ్లందించారు— ఏకధారగా గుడిపై నీటిని కుమ్మ రించసాగారు. బావులన్నిటినీ వూడ్చిపారేసి తెచ్చిన ఉప్పునీళ్లన్నిటినీ గుడిపై దిగపార బోసి మొదటి అంశం పూర్తిచేశారు.

కిర్రున గది తలుపులు వెనక్కి వెళ్ళిపొయ్యాయి.

గబ్బిలాల కంపు- ఉడతలు- తొండలు- చిమ్మెటలు- విసర్జించిన మల మూత్రాదుల మాగుడు వాసనలు గప్పునలేచి ముసురుకోసాగాయి. అంతా చీకటి- కిటి కీలులేని పోలేరమ్మ నివాసం, పెద్దలందరి కళ్లూ పొడుచుకొని చూశాయి మారుమూల ల్లోకి తల్లికోసం. ఆమె అదృశ్యమైంది,

గుడి నడిబొడ్డుమీద ప్రతిష్ఠించబడిన పోలేరమ్మ విచిత్రంగా మాయమైంది. ఆమె ఎప్పుడు ఎలా అదృశ్యమైందీ ఏ మానవుడికీ తెలియదు. అందరూ ముక్కుమీద వేలు వేసికొన్నారు.

తల్లికి తీరని అపచారం జరిగిందనే భావం అందరి ముఖాల్లోనూ ప్రస్ఫుట మైంది.

"నన్ను మరిసిపొయ్యారు మీరు".... వెనుకకూ ముందుకూ వూగిపోసాగాడు గణం పెరిగినవ్యక్తి. నిప్పుకణికలపై సాంబ్రాణి గుప్పెళ్లగుప్పెళ్లగా కుమ్మసాగారు.

మేఘంలా లేచిన ధూపం.

ధూపంలో వూగిపోతూన్న తల.

"శరణు- శరణు తల్లీ" లెంపలు వాయించుకొన్నాడు కథానాయకుడు. "నాకు మేకపోతులు కావాలి .. కోడిపుంజులు కావాలి.... నా ఆకలి తీరటంలేదు .. నాకు ఆహారంలేక ఏళ్ళు గడిచిపోయినయి".... నురగదుబ్బల వేపాకు పెదవులవెంట కార్చు కోసాగాడు.

"అపశారమైంది తల్లి . శరణు .. శరణు.... నీకోర్కెలన్నీ తీర్చుతాం ... పల్లగాసూడు తల్లీ".... ఒక్క దెబ్బతో కొబ్బరికాయ పగలకొట్టి గణాచారి చుట్టూతిప్పి విసిరిపారేశాడు.

"ఆకలివేసి నేను వూరు ఇడిసిపొయ్యా ... నన్ను మరసిపొయ్యారు మీరు నా ఆకలి తీరవలేదు మీరు".... వూగుతున్న శరీరం బోరగిలాపడింది. పడిన శరీరంపై కడవలతో నీళ్ళు.

తల్లి ఆ నోటివెంట పలికిన సత్యం అందరి తలలోకి ప్రాకినది. డోళ్ళు దప్పులూ ఆగిపొయ్యాయి. సింహనాదాలు, కొమ్ముబూరలూ భుజాలెక్కాయి వాన కురిశాక కనిపించే వెలిమబ్బులా ప్రశాంతత.

తల్లికి ఆగ్రహం కల్గి నిష్క్రమించినందుకు అందరూ ముఖాలు వేలాడవేసి కొన్నారు. ఆమె పునః ప్రతిష్ఠాపనను గూర్చి సమాలోచనలు ప్రారంభమయ్యాయి. విగ్రహం చెక్కించి ఆలయపు నడిబొడ్డుపై ప్రతిష్ఠించాలి అది తక్షణ కర్తవ్యం— అయితే పోలేరమ్మ మూర్తిని రాతినుండి మలచటమా లేక చెక్కనుండి తొలచటమా అనే సమస్య ఉత్పన్నమైంది. శిలనుండి శిల్పాన్ని చెక్కటానికి చెయ్యి తిరిగిన శిల్పి కావాలి. అతనికీ కొన్ని నెలలయినా గడువివ్వాలి, పెదవులు చప్పరించారు

అందరి దృష్టి గుడిముందు జడలు విరబోసికొన్న ముసలి వేపచెట్టుపైకి ప్రాకింది. తల్లికి ప్రీతికరమైన చెట్టు- మ్రానుచుట్టూ పసుపు- కుంకుమ,

దక్షిణ దిశగా గుడిపైకి ప్రాకిపోయిన పెద్దకొమ్మలను నరికి అందులోనుండి పోలేరమ్మను సృష్టించటం సబబనిపించింది. పదిహేను రోజుల్లో పోలేరమ్మమూర్తి తయారు కావటానికి అంతకన్న వేరేమార్గం కనిపించలేదు పెద్దలకు. అయితే వేప మొద్దునుండి తల్లిని తరయారుచేయగల చెయ్యితిరిగిన వడ్రంగి ఎవరా అని తలలుపట్టు కొని కూర్చున్నారు. వారి దృష్టిపథంలో ఎవరూ తగలలేదు.

'ఆఁ.... వాడు– పల్లెలో వీరాయ్ రెండో కొడుకు.... వాడుతప్ప నాకెవరూ గుర్తు తగలటంలేదు' ... ఒక పెద్దమనిషి సలహా ఇచ్చాడు.

'అదే– వాడు మిలిటరిలోకి పొయ్యొచ్చాడు కదా? నాకూ వానిమీదే వుంది. ఇందాకట్నుంచి వాడిసేత మొన్న మా పడమటీధి భవంతి దర్వాజా చేపిచ్చా .. గుర్రాలు గిరాళ్ళు ప్రాణంతో ఉన్నట్టే ఉన్నాయి ... కాని వాడిసేత తల్లిని సేపిద్దామా?'.... సందేహాస్పదంగా అందరి ముఖాల్లోకి చూశాడు చిన్నపరెడ్డి.

"కులం తక్కువోడనేగా నీ అనుమానం.... తక్కువో ఎక్కువో మరేం సేద్దాం– అంతకన్న వేరేదారి లేనప్పుడు"....

"అపశారమవుతుందేమో?"

'ఇక అపశారమో గిపశారమో.... వాడు తప్పితే మనకు ఏరే వడ్రంగపు పనివాడు దొరకడు.... దొరికినా ఇంత తొందరలో మనకు తల్లిని సేసియ్యలేడు ... పోతే అపశారం జరుగుతుంది. మైలపడకుండ ఏదైనా ఉపాయం ఆలోసించాల్సిన పని సిద్ధాంతికి వదిలేద్దాం' ...అంటూ కళ్ళు శాస్త్రిలగారికేసి తిప్పాడు.

శాస్త్రిలు ఆలోచనను వ్యక్తపరుస్తూ కళ్ళు ఆకాశంకేసి వేపచెట్టుకేసి తిప్పు కొన్నాడు. జంధ్యంతో వీపు రుద్దుకొన్నాడు చిటికెడు ముక్కుపొడుం నసాళానికి అంటించి, విభూతి పూసుకొన్న నొసలు చిట్లించి కనుబొమలు పైకెగురవేశాడు.

'పోలేరమ్మ క్షుద్రదేవత— స్పృశ్యులు- అస్పృశ్యులు అనే తారతమ్యం అంతగా పాటంచదు— అయినా వేదాల్లోచెప్పినట్లు ఆమెను సృష్టించిన వాడెవడయినా కావచ్చు' కాని ఆ మూర్తికి చూపు ప్రసాదించినప్పుడే ఈసమస్య ఉత్పన్నమౌతుంది. ఆమెకు అపచారం కలుగకుండ— శుభ్రంగా స్నానం చేయించి మైలతుడిచి, నా చేతుల్తో చూపు కలిగిస్తాను— వేదోక్తంగా తల్లికి చూపుకల్గించి ప్రతిష్ఠించుతాను'— సున్నితంగా చేతులు తిప్పుతూ ఉపన్యసించసాగాడు.

అందరి ముఖాల్లోనూ ఉత్సాహం అలుముకపోయింది గచ్చుమీదబడ్డ కిరసనాయిల్లా. మాటా పలుకూ లేకుండ సిద్ధాంతికేసి చూడసాగారు వాళ్లు. ఆ అస్పృశ్యులందరికీ దూరంగా ఒక బండపై బాచిపీటవేసి కూర్చున్న ఆ సిద్ధాంతి చిరునవ్వుతో అందర్నీ పరామర్శిస్తూ సమస్యకు పరిష్కారమార్గం చూపెట్టాడు.

జన్మతరించినట్లు, వెర్రి ఆనందంలో అందరూ ఆ అపరదైవానికి చేతులెత్తి నమస్కరించారు.

పోలేరమ్మ తల్లికి అత్యంత ప్రీతికరమైన వేపచెట్టు కొమ్మతెగి నేలపడిపోయింది. ముళ్లు- పగుళ్ళు- పుచ్చు- చిచ్చులేని అతిశ్రేష్ఠమైన చేవకల్గిన రెండుగజాల పొడవున్న మొద్దు తీర్మానం ప్రకారం వీరాయ్‌కొడుకు ఇంటికి చేరింది. పదిరోజుల్లో ఆ మొద్దునుండి తల్లి ప్రత్యక్షం కావాలని అతన్ని శాసించారు. తల్లిని తొలచినందుకు ప్రతిఫలం రెండుబస్తాల వడ్లు, పసుపు కుంకుమ తాంబూలం, పంచెలసాపు, అన్ని లాంఛనాలు ఇవ్వటానికి ఒప్పుకొంది పోలేరమ్మ కమిటీ.

కమిటీ ఒక ముఖ్యవిషయమై పదేపదే హెచ్చరించింది- 'చూపు తనుపెట్ట కూడదని' మౌనముద్రతో ఆ ఒప్పందంపై ఆమోద ముద్రవేశాడు మిలిటరీకి పోయి వచ్చిన వీరాయ్ కొడుకు.

పదిహేను రోజులు కాలవులు సాగిపొయ్యాయి భయంకరంగా, రోజుకొక ప్రాణితల, గున్నపోతుగానీ, మేకపోతుగానీ, కోడిపుంజుగానీ తెగిపోయింది. శిరస్సు తెగిన ప్రాణి విలవిలలాడుతూ నేలపడి నాల్గుకాళ్ళు కొట్టుకొని రక్తపు మడుగులో ప్రాణం విడిచేది. వేపమండలు కట్టి పసుపు కుంకుమలు దిద్ది పవిత్రంచేసిన కుంపటిని రక్తంతో నింపి తెగిపడిన శిరస్సును ఆ రక్తంలో పేర్చి కుంపటిని శివంబూనిన ఒక 'పంబలవాడి' తలపైకెత్తి వూరు మాటుమణిగిన తరువాత వూరి వీధులన్నీతిప్పి వూరుని పవిత్రం చెయ్యసాగారు,

భయంకరమైన అరుపులతో కేకలతో ఒళ్లు జలదరించే డప్పుతో, మేళాలతో రాత్రిళ్ళు ఈ భీభత్సకాండ నిర్విఘ్నంగా కొనసాగింది ఒకవైపు.

వీరాయ్ కొడుకు చేతుల్లో వాడి బాడిస, ఉలిదెబ్బల కింద వేపమొద్దులో నుండి కొద్దికొద్దిగా తొంగిచూడ సాగింది పోలేరమ్మ మరోవైపు.

ముందు తలభాగంతో ప్రారంభమైన పోలేరమ్మ గిరుప్రిన పదిహేనురోజులు తిరిగేటప్పటికి కాళ్ళూ- చేతులూ అన్నీ సంతరించుకొని భేషుగ్గా కూర్చుంది వూరికి ఎడంగానున్న గుడిసెల మధ్య. తల్లిని చూడటంకోసం వూరి పెద్దలంతా వీరాయ్‌కొడుకు ఇంటికి తరలివెళ్లారు పదిహేనవరోజు ఉదయం, పసుపు పూసికొన్న పోలేరమ్మను ఇద్దరు కుర్రాళ్లు ఆ ఇంటిబైటకు మోసికొచ్చారు. పదిమంది పెద్దలూ విగ్రహం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ పరిశీలించసాగారు.

"అంతా బాగానేవుంది కాని ఈచెయ్యి కొద్దిగా జారినట్టనిపిత్తంది- నాకు మట్టుకు- ఏది కొద్దిగా ఎడంగా పొయ్యి సూడనివ్వండి- దూరంగా వుండి చూసినా

అట్టా అనిపిత్తందా? ఏది రామయ్య బావా? నీవుసూడు"— నఖశిఖ పర్యంతం పరిశీలించిన చిన్నపరెడ్డి అన్నాడు.

"నాకు మాత్రిం నీకన్న ఎక్కువేం తెలుసు"— అంటూ నాల్గడుగులు వెనక్కూ ముందుకూ వేసి— "నాకుకూడ అట్టానే అనిపిత్తంది బావా?" అన్నాడా తలపాగా చుట్టిన పెద్దమనిషి.

'పరీచ్చగా సూత్తే అట్లానే అనిపిత్తంది'— నాల్గయిదు కంఠాలు వంతపలికాయి వీరాయ్ కొడుకుకేసి చూస్తూ.

విశాలమైన వక్షస్థలము— మెలితిరిగిపోయిన కండరాలు— రోమన్ సైనికునిలా రెండు చేతులు నడుముపై ఆన్చుకొని ఠీవిగా నిలబడి తన సృష్టికేసి సుదీర్ఘంగా చూస్తున్న అతను పోలేరమ్మకేసి రెండడుగులు వేశాడు.

'ఈ చెయ్యికదూ మీరు సెప్పేది?— అవును అదాటున బాడిసిదెబ్బ తగిలి కొద్దిగా జారింది ఇప్పుడైనా కొంపమునిగిపోయిందేముందిలే సరిచేద్దాం' అంటూ 'అమ్మీ— గూటిలో మేకులున్నాయి ఇటు తీసికురా' అని కేకలేశాడు.

మేకులు చేతికందాయి.

'దీనిదేముందిలే— గూడ జారిందంతే'— అంటూ తల్లి భుజం కొద్దిగా పైకెత్తి మేకు పొందికగా పట్టుకొని బాడిస తీసికొని పోలేరమ్మ భుజంపై రెండు చరిచాడు.

'చాలు చాలాగ్రి .... ఇప్పుడిక తల్లికేం వంకర్లు లేవు ..... మనం పెందరాళే గుడికాడకు తల్లిని సేరుస్తాం . ఒరేయ్ నీకు రెండు బస్తాల వడ్లు రేపు కొలుత్తా— మాయింటికాడకురా . ఇక మేము నీకిత్తామన్న పంచెలసాపు తాంబూలం మద్దినేల తల్లిముందు దణ్ణం పెట్టి కట్టుకో... అంతటతో నీకు అపశారముండదు

'సిత్తం .. సిత్తం కానీ గింజలొద్దులెండి...ఏదో తమ దయవల్ల కూటికి ఇబ్బంది పడటం లేదు. ఏదో నాకు సేతనయినంత మట్టుకు నేను తల్లికి సేశాను.... ఆసూపుకూడ నేనే పెడ్తా'...బాడిస భుజాన వేసుకొని రెండు చేతులెత్తి అందరికీ దణ్ణం పెట్టాడు పారిదేయ పడ్తున్న కళ్ళతో.

అవతలివాళ్ళకళ్లు ఎరరిబారాయి. కోరచూపులు చూశారు వీరాయ్‌కొడుకుకేసి "బాబుగారూ నాదొకసిన్న మనవి నాకొడుకు ఈపదిహేనురోజులూ తిండితిప్పలూ

మానుకొని రేయనక, పవలనక తల్లిని తయారు సేశాడు. ఇకనేనుగానీ నాకులపోళ్ళు గానీ ఈ వూరు పుట్టినప్పటినుండీ డప్పులుకొట్టి బలులు నరికి తల్లికి సేవసేత్తున్నాం .. తల్లి మా కులదైవం .. అసూపు కూడా మా వాడే బె డ తా డు ..మీకు దణ్ణం బెడతా'' వీరాయ్ పలికాడు. నిమ్మకాయ నిలిచే గుబురు మీసాలు సొగసుగా ఆడించుకొంటూ, తప్పతాగిన కళ్లు చింతనిప్పులు కక్కుతున్నాయి.

'అరేయ్ వీరాయ్.. అదికానిసంగతి నాసేత పదేపదే సెప్పించుకోమాకండి వాడితో మొన్నకూడాసెప్పా...అసలే తల్లికి కోపమొచ్చిఊరువిడిచి పోయిందని శాస్త్రులు సెబుతానే ఉన్నాడు దానికితోడు ఈడు సూపు బెడితే ఇంకేమన్నా ఉందా? వానలు లేవు సరికదా? ఇంకా అమ్మవారు పొయ్యటం—గత్తర రావటం ఊరంతా ఊడ్చుకపోతది, మళ్ళీ రెండోసారి ఆ కూతకూయగాకండి నా దగ్గర'—బంగారపు మురుగులు పైకి తోసుకొని పొన్నుకర్ర పొడుచుకొంటూ ముసలాడు ముందుకు కదిలాడు-పరివారాన్ని వెంట బెట్టుకొని.

కదిలిపోతున్న వాళ్ళను విస్ఫారిత నేత్రాలతో పరికిస్తూ పళ్లు కొరుక్కో-సాగారు వీరాయ్, వీరాయ్ కొడుకు, ఇంకా ఇతర స్వజనం.

పదిహేను రోజులుగా జరిగిపోతూన్న పోలేరమ్మ కొలుపులు ఈవేళ పరా కాష్ఠ నందుకొన్నాయి. విగ్రహ ప్రతిష్ఠాపన- పూజలు- బలులు పట్టినంతపని ఊళ్ళో ప్రతి యింట్లో ఈ హడావుడి కనిపించసాగింది. ఇంటి గడపలు పసుపు కుంకుమ-తో ద్వారాలు వేపమండలతో కళకళలాడుతున్నాయి. ఉదయానే లేచి ఆడవాళ్లు స్నానాలు ముగించుకొని పసుపు బట్టలు ధరించి, కొబ్బరికాయలు, పూలు బుక్కాయి పేర్చిన హారతిపళ్లాలు చేతబట్టి బారులుతీరి పోలేరమ్మ గుడివైపు నడిచారు.

గుడి వెల్లవేసి శుభ్రంగా కళకళలాడుతోంది,

గుడిముందు మండపం, మండపం మధ్యలో కూర్చున్న పోలేరమ్మ. ఆమె కుడిచేతివైపు బారులుతీరిన బలి పశువులు, దున్నపోతులు - మేకపోతులు, పసుపు కుంకుమలు చల్లిన వెన్నులతో, మెడలలో వేలాడుతూన్న వేపమండలతో, తమ అంతిమ క్షణాలను నిరీక్షిస్తూ 'అంబా' మంటూ హృదయ విదారకంగా అరుస్తున్నాయి మోర లెత్తుకొని.

వాటి చెంతనే వాటి శిరస్సులను ఒక్కవేటుతో త్రెంచి పారెయ్యటానికి సన్నద్ధమైన వీరాయ్- అతని అనుచరుడు మరొకడు, ఇద్దరికీ మొలలపైగుడ్డ మినహా యించి ఒంటిపై మరో అచ్ఛాదనలేదు.

నల్లని ధృఢమైన శరీరాలు.

రప్పతాగిన ఎర్రని కళ్లు.

గుబురు మీసాలతో విలయ తాండవానికి సన్నద్ధులైన రాక్షసులు. ఇద్దరి చేతుల్లో రెండు పొడుగాటి కత్తులు, తీక్షణమైన సూర్యకాంతితో తళతళలాడుతూ నెత్తురు కోసమని నాలుకలు చాస్తున్నాయి. వాళ్లిద్దరూ నిర్వహించాల్సిన రాక్షస కృత్యాలు నిర్విఘ్నంగా కొనసాగించటానికై ఊతగా శ్రవణేంద్రియాలు పగిలిపొయ్యేలా తప్పెటలు- డోళ్ళు- సింహనాదాలు- కొమ్ముబూరలూ చేస్తూన్న పైశాచిక సంగీతం.

అంతా కోలాహలం.

పశువుల ఆర్తనాదాల మధ్య డప్పులమోతలో జనసమూహపు రద్దీ మధ్య సిద్ధాంతి, రెండవ తరగతి పిల్లవాడు బట్టీపేసిన ఎక్కాలు అప్పచెప్పినట్లు, సూత్రాలు వల్లించసాగాడు— పోలేరమ్మకు ఎదురుగా కూర్చొని.

గాలి స్థంభించిపోయింది.

చెమటతో అందరి శరీరాలు తడిసిపోసాగాయి. నడినెత్తిన సూర్యుడు సకనక లాడిపోతున్నాడు.

పట్టు అంగవస్త్రం పూర్తిగా తడిచిపోయినా అచంచలంగా కూర్చొని ఏక ధాటిగా అర్ధగంటసేపు మంత్రాలు పఠించి టపీమని కొబ్బరికాయ కొట్టి తల్లిచుట్టూతిప్పి జనంలోకి విసిరాడు. మరుక్షణంలో ఇంటికొక కావిడిచొప్పున నీళ్ళను పోలేరమ్మపై కుమ్మరించి ఆమెకు సోకిన మైలనుండి పవిత్రించేశారు.

డప్పులు తారస్థాయికి వెళ్ళిపొయ్యాయి

నిప్పుకణికలపై గుప్పెళ్లు గుప్పెళ్ళు సాంబ్రాణి. మత్తెక్కించే పొగలు సెగలు— కరుడుకట్టిన నెత్తురులా కుంకుమరాశి— పటపటమని పగిలిపోతూన్న కొబ్బరి కాయలు.

చూస్తూ- చూస్తూ సూర్యుడు మబ్బుల వెనుకకు తప్పుకోవటం మూలంగా మూగ ఎండ కుతకుతలాడి పోసాగింది.

తల్లి పవిత్రమైపోయింది.

డప్పు లాగిపొయ్యాయి- అంతా నిశబ్దం- అందరికళ్లూ సిద్ధాంతిపై కేంద్రీక రించాయి. తల్లికి చూపుకల్గించే కార్యక్రమం కోసమై సన్నాహాలు ప్రారంభించాడు.

పోలేరమ్మ కళ్ళపై నీటుగా పసుపురేఖలు దిద్దాయి అతని చేలివేళ్ళు. తిరిగి కుంకుమ రాశిలోకి వెళ్లాయి.

అంతే!

కుంకుమలో వేళ్లు గుచ్చుకుపోయ్యాయి- నల్లనిపాదం ఒకటి చేతిని తొక్కి-పట్టింది, మరుక్షణంలో ఆ శరీరం అతనిపైకి వంగిపోయింది. సిద్ధాంతి కెవ్వున కేక వేశాడు.

నల్లని చేతులు కుంకుమ అందుకొన్నాయి.

తల్లి పసుపుపచ్చని కళ్ళలో రెండు ఎర్రని కుంకుమ కనుపాపలు దిద్దాయి. నల్లనివేళ్లు పెళపెళమని ఉరుము- గుడిపై నల్లని మబ్బులు.

'వాడిని పట్టుకోండ్రా.... నరకండ్రా.... ఆఖరకు వాడు తల్లికి సూపుపెట్టనే పెట్టాడ్రా" మురుగులు చిన్నపరెడ్డి గొంతు బలిపశువుల మధ్యగా చించుకోసాగింది;

"ఆగక్కడ .... ఒక్కడుగు ముందుకేశావా నీతల అవతల బడుద్ది .... ఇయ్యాల తల్లికి నరబలి. ఈ దున్నపోతు తలకాదు.... ముందు నీది.... తరువాత వాళ్లది".... వీరాయ్ గుబురు మీసాలపై మాటలు వంకర తిరుగుతున్నాయి

అతని చేతుల్లో కత్తి- పొడుగాటి కత్తి.

అందరి శిరస్సులపై గాలిలో మిలమిలలాడుతూ తూలిపోసాగింది. ఆకత్తి వెనుక ఇంక పది పన్నెండు కత్తులు.... తప్పతాగిన మచ్చుకత్తులు "దాహం- దాహం" అన్నట్లు నాల్కలు చాస్తున్నాయి.

ఒక్కడుగు ముందుకి ఉరికిన కులపెద్దలు నాల్గడుగులు వెనక్కివేశారు. "ఇదిగో.... ఈ పోలేరమ్మను నేను శేశా.... తల్లికి సూపుపెట్టటంగానీ- బతికియ్యటం గానీ- సంపటంకానీ నాసేతుల్లో పని నాయిట్టం.... ఇదిగో రచ్చించదలచుకొన్న వాడెవడో ముందుకు రండి".... వీరాయ్ కొడుకు గర్జించాడు.

తల్లి మెడపై బాడిసతో ఒకదెబ్బ పడింది.

తెగిన శిరస్సు గుడిమెట్లపై 'దభదభ'మంటూ దొర్లిన శబ్దం. పెళపెళమని ఉరుము- బరువుగా నల్లగా కదుల్తూన్న మేఘాలు- 'రంయ్ రంయ్' మంటూ పెద్ద తుపాను- ఇంతింతలావు చినుకులు

వాన— భయంకరమైన గాలివాన.

వడగళ్లవాన- రాళ్లు రువ్వుతున్నట్లు భయంకరమైన వడగళ్లు.

వానచినుకు బడగానే ఒళ్లు జలదరించి జనం మధ్యగా పరుగెత్తుతూన్న బలి పశువులు.

వాన- కుంభవృష్టి. నిలబడటానికి వీలులేక అటూఇటూ పరుగెత్తుతూన్న ప్రజల కోలాహలం.

జడివానలో మట్టి కొట్టుకుపోతూన్న పోలేరమ్మ శిరస్సు.

మరబ్రతుకులు

— బి. టి. రామానుజం

ఆ వేళ. విశాఖపట్నంకి దగ్గరగా, బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడినట్లు ఏ రేడియో ప్రకటన చెయ్యలేదు. తుఫానువచ్చి ఊళ్ళూ, యిళ్ళూ వూడ్చుకుపోయే ప్రమాదమూ లేదు. కనీసం భూకంపం వచ్చే సూచనైనా లేదు.

అయితే,

“ఆ లంజకొడుకుని వొదుల్తామా” అన్నాడు నర్సిగాడు పైవన్నీ జరిగిపోతున్నాయన్నట్లు.

“వొదలంగానే, వొదలం” అన్నాడు నారాయుడు సిగరెట్ పారేస్తూ.

“అవునాణ్ని వొదల్రాదురా, నాయనా!- అన్నాడు సూరి.

పైడితల్లి, యిందాకణ్నుంచి, సూరికేసి అలా చూస్తూనే వున్నాడు.

“ఎలాగేట్రా—?” విసుక్కున్నాడు సూరి. సూరంటే వూరివూరికే హడల్. సూరి అసలు పేరు.... సూరి, సూరడు— సూర్నారాయిణా అయుండాలి,

అతను లావుగా, ఎర్రగా వుంటాడు. ఎర్రగా అంటే దొరలా వుండడు. బస్సులు తోలేవాడు దొరలా ఎలాగ వుంటాడయినా? అతను ఎల్లమ్మతోట జంక్షన్ దగ్గిర లాయరుగారి ఆఫీసు పక్కనవున్న గవర్నమెంటు సారా దుకాణంకి నమ్మకమైన కాతాదారు.

సూరి జీవితంలో, ఎప్పుడూ దేనికీ జడవలేదు. చిన్నప్పట్నుంచి అతను మొండిగానే పెరిగాడు. వూరి చివర్ని పూరిగుడిసెల్లో పుట్టాడు. అక్కడుండే దరిద్రంతోనే పెరిగాడు. రోజంతా ఎముకలు విరక్కొట్టుకొని, పాటుపడి, బూతులు తిట్టుకొని, యింతాచేసి తాగటానికి రెండు పూటలా గంజయినా దొరకని బతుకులు— అవి ఎందుకలా తయారవుతున్నాయో అతనికి అంతు పట్టకపోయినా, మొత్తానికి తమ బతుకులన్నీ పైవాళ్ళని యింకా యింకా పెద్దవాళ్ళన్జేసి. పెంచడానికే పనికొస్తాయనీ, వాళ్ల పెరిగినకొద్దీ తమ బతుకులు మరీమరీ అధ్వాన్నం అయిపోతున్నాయనీ, అతనికి

గట్టి నమ్మకం కుదిరిపోయింది. జీవితంలో ఏమి వుండదు, ఒక సంతోషమూ, ఓరోజు కడుపునిండా తిండి వుందన్న సంతృప్తి, ఏమీవుండదు బతుకులో ఏమీ లేకపోయిన తర్వాత, ఫీలింగ్ వుండదు, సెంటిమెంటుకి చోటెక్కడ? సూరికి ఆమెతకదనం ఏవీ లేదు. అతను ఉక్కుమనిషిలా వుంటాడు

అందుకే,

ఎవడన్నా—

"ఎలాగిరా?" అని కనక అంటే అతనికి చెడ్డచిరాకు.

"ఓరి, యీ దొంగనాకొడుకుల కెవరు జడవమని చెప్పార్రా? ఆళ్ళే మనకి జడవాలి. యీడి బాబెవడన్నా వచ్చి తోత్తాడేటాని ఈ బస్సులు?

"అయినా ఆడేటి. మరో బస్సువాడేటి— యింకో బస్సువాణ్ని అందరి మజ్జనెట్టి కొట్టడవేఁటి? ఎన్ని గుండెలాని నా కొడుక్కి? అయినా ఆడు వర్కరా. కాదే! బస్సోనరు. లంజకొడుక్కి కళ్ళెత్తిమీది కెక్కిపోయి కాపోతే, సాఫ్ జోలి కొస్తాడా?" సూరి తన మామూలు ధోరణిలో అన్నాడు.

"ఎందుకు లెద్దు సూరీ! ఆడిమాలాన ఆణ్నిపోనీ" నారాయుడు అన్నాడు. అతను మెడచుట్టు మఫ్లర్ (చింకిది) చుట్టేసి, చేతులుకట్టుకొని కూర్చుని, చలికి యింకా వొణుకుతున్నాడు.

"తగువియ్యాల్టికి తెల్లారేలా లేద్రానాయనా—" పైడితల్లి చిన్న యినపచువ్వకి ఏవో పీచుగుడ్డలు చుట్టి, ఆయిల్‌పోసి, అంటించాడు ఒక్కసారి మంటలేచి అందరి ముఖాలమీదా పడింది.

పన్నెండు గంటల రాత్రయినా, వాళ్ళ ముఖాల్లో ఎక్కడా నిద్రఛాయ లున్నట్లు లేవు. ఏదో ఆత్రంగా వున్నాయి వాళ్ళ ముఖాలు

పెట్రోలు బంకుదగ్గిర అంతా నిశ్శబ్దంగా వుంది. బంకు ముందున్న బస్సు చీకటిలో భూతంలా వుంది. మంట వెలుగు పడగానే, దాని నిజస్వరూపం బయట పడింది,

ఏనాటిదో, తాతఁనాటి బస్సు. కొంతకాలం క్రితం రంగుపూసి, అదిచేసి, యిదిచేసి, కొత్తబస్సులా అలంకరించాడు. అప్పుడే అది పాతబడిపోయి, రంగుమీద

గీతలుపడి, అసహ్యంగా తయారైంది. బస్సుకి ఎన్నిరంగులు పూసి హడావిడి చేసినా ఒకటే. డొక్కుబస్సు డొక్కుబస్సే. ఎప్పుడు సరిగా నడుస్తుందో, ఎప్పుడు నడ వదో తెలీదు. ఏక్షణాన యింజన్ ఆగిపోతు దో తెలీదు. ఎక్కడ బస్సుతొయ్యాల్సి వస్తుందో తెలీదు. అయితేనేం? బస్సుబస్సే! బస్సు డొక్కయినా సరే. దానిసర్వీస్ దానిదే. ఓవర్‌లోడ్ చేసి, టైము దాటేసి రెండోబళ్ళ వాళ్ళతో దెబ్బలాటలు తెచ్చి, పోటీలుపడితే కాసులు గలగల లాడతాయి.

చక్రంకనట్లు బిగించేసి. చేతులు దులుపుకొంటూ, పనయిందన్నట్లు చూసేడు పైకితల్లి.

"పూం—" అని నిట్టూరుస్తూ, "మరేటి సేస్తాంరా? యీ బస్సుల్లో పన్జె య్యడ మంత మాదెచ్చదపని మరోటిలేదు. 'యింతేనా తేతే.' అంటాడు ఓనరు. ఆటుసూస్తే కాంపిటీసను. యిటుసూస్తే యీడు. బొక్క బద్దలయిపోతున్నాది" నారా యుడు అన్నాడు.

"మరే—" అన్నాడు నర్సి.

అతను చెక్కరు.

చెక్కరంటే యీ బస్సుల కండక్టర్లు మసిపూసి మారేడుకాయచేసి డబ్బులు చెక్కెయ్యకుండా 'చెక్' చేసే వాడన్నమాట. ఎక్కువ మంది బస్సోగర్లు ఈవూరి వాళ్ళుకారు. వాళ్ళందరూ ఎక్కడో గుంటూరు నుంచో, కాకినాడనుంచో వచ్చినవాళ్లు. దాదాపు అందరూ ఒకేకులంవాళ్లు పాపం. వాళ్ళలో ఆపాటీ ఈపాటీ లేనివాళ్ళు వుండ రుట. అందరికీ బాగా ఆస్తుపాస్తు లుంటాయిట. ఓవేళ అలా లేనివారెవరయినావుంటే వాళ్లబాధ భగవంతుడికి తప్ప మరెవరికీ అర్థంకాదు. కులంనుండి వెలివేసినట్లుంటుంది. ఈవెల్నుంచి బయటపడటాని కెంత ప్రయత్నించాలి? చేసినా ఎంతమంది శ్రమ ఫలి స్తుంది? అలా ఫలించిన వాళ్లసంగతి మనకెక్కువల్సింది. ఏ అమాయకుడూ, తను పైకి వెళ్ళి, తనవాళ్ళందర్నీ తనతో పైకిలాగాలని చూడడు. అలా చూస్తే, ముందు అతనే కిందపడిపోతాడు. వాళ్ళవాళ్ళు చాలామంది వుంటారయినా. అందర్నీ ఎక్కడికని లాగుతాడు? అందుకే బస్సుల్లో నమ్మకంగా 'చెక్కరు' పని అప్పగిస్తారు. మరింక అంతే! ఎంతయినా నిజాయితీగా వుంటాడు. గొడవలుండవు. అలాంటి 'ట్రాప్స్'లో వేస్తారు. నర్సి. నర్సింహులు. (అతని పూర్తిపేరు నర్సింహారావు మనుషుల పరిస్థితు లను బట్టి పేర్లు మారుతుంటాయి. అతనే ప్రయివేటు కంపెనీకో అధికారయివుంటే,

'బాస్' అని పిల్చేందు రందరూ) అతనికి తెనాలిలో కొద్దిగా, బహుకొద్దిగా పొలం వుంది. సంవత్సరానికో రెండువేలు దానిమీద వస్తుందతనికి. ముప్ఫై రూపాయలు అద్దె యిచ్చి వుంటున్న చిన్నగది— అందులో అతనితో వచ్చిన అమ్మాయివుంది. ఈ అమ్మాయి అతని భార్యకాదు అతను తనకువచ్చే నూటఏనభై రూపాయల్తో— ఆవూళ్లో ఎలా బతుకు యీడుస్తున్నదీ ఆ 'అమ్మి'కి తెలీదు. అమ్మికి అతనంటే యిష్టం సొంత వూరుది. నర్సింహులు కళ్ళకి 'బానే' వుంటుంది. అమ్మిని సుఖపెట్టాలని అతని తాపత్రియం. ఓ హోటల్లో రిజర్వ్‌చేసిన, ఓ రూంలో పేకాడే కొందరు ప్రబుద్ధుల్లో అతనుంటాడు. 'టెన్ - ట్వంటీస్'- రమ్మీ ఆట. ఎలా ఆడతాడో వూర్లో జనంకి అర్థం కాకపోవచ్చునుగాని. మిగతా పార్టనర్స్‌కి అందులో ఆస్చర్యంలేదు. అదిగాక అతన్ది విన్నింగ్ హాండ్‌ట! బస్సు కలెక్షన్ల విషయంలో ఎంత తనకులం వాళ్లయినా 'పాతివ్రత్యం' వెలగబెట్టాలని ఎక్కడ వుంది ? పేకాటలో ఓవేళ అతనికి నష్టం వచ్చినా అతనికి మామూలుగానే వుంటుంది. అతనెప్పుడూ ఆటకి ముళ్లమీద కూర్చున్నట్లు కూర్చోలేదుగానీ. ప్రస్తుతం అతనికి ముళ్ళమీద కూర్చున్నట్లుంది.

"పైడితల్లీ, అయిపోయిందిరా?" అన్నాడతను చివరికి.

పైడితల్లి, పని యిందాకే ముగించేశా నన్నట్లు చేతులు దులుపుకొన్నాడు.

"దీనమ్మ! ప్రతి రాత్రి సేవేం—" అన్నాడతను.

పైడితల్లి బతికిచెడిన మనిషి. అతను చేసినపన్లు చాలా వున్నాయి. చేసిన ఉద్యోగాలు చాలావున్నాయి, చిన్నచిన్న పనులుచేశాడు. పెద్దవాళ్లదగ్గిర పనిచేశాడు. బంట్రోతు- ఉద్యోగాలు చేశాడు, కొంతకాలం కిళ్ళీ బడ్డీ. మరికొంత కాలం కిరాణా దుకాణం నడిపాడు 'శని' అంతా అతనినెత్తినే వున్నట్లుంది— 'బ్రాకెట్' రూపంలో అతన్ని మాపేసింది. మూడువేల రూపాయలు దివాలా, చివరికి క్లీనరయాడు. అతనికి ముప్ఫయ్యేళ్లుంటాయి, కాని నలభైవున్నట్లు కనబడతాయి. ఎప్పుడో పోగొట్టుకొన్న దాని గురించి యింకా విచారిస్తున్నట్లు కనబడతాడు,

అసలు పైడితల్లికి లోకమంతా విచిత్రంగా కనబడుతుంది, అతని కళ్లముందు చాలామంది 'పెద్ద' వాళ్ళయిపోయారు. కిళ్ళీబడ్డీతో మొదలుపెట్టి పెద్ద మేడలుకట్టిన వాళ్లున్నారు, లారీలు కొన్నవాళ్లున్నారు. కంట్రాక్టర్లయిన వాళ్ళున్నారు, ఏ 'ట్రిక్' ఉపయోగించి, వాళ్ళందరూ పెద్దవాళ్ళయిపోయారో, ఆ కీలకం అతని కంటుపట్టలేదు.

'సిన్నోడు పెద్దోడవటం కల్ల' అనుకొన్నాడుగానీ, పెద్దోళ్ళయిన చాలా మంది కళ్లెదురుగా కనబడుతుంటే, 'కల్ల' అని ఎలా అనుకోగలడు? "ఆ భగమంతుడి దయ, అదురుష్టం వుండాల—" అనుకొంటాడు చివరికి. 'తనకూ ఆ అదురుష్టం తగలదా?' అని ఆశ. లోకమంతా 'అన్నేయం' అనికూడా అతని నమ్మకం. 'అయితే, అన్నేయాన్ని భగమంతుడే సూస్తాడు'.

నారాయుడు యిందాకణ్నుంచి నిశ్శబ్దంగా వూరుకుండిపోయాడు. అతనికేదో బాధగావుంది. ఏదోశక్తి పీడించుకొని తినేస్తున్నట్లుం దతనికి. తలపోటు వచ్చేస్తోంది. తనుకారణం కాని వాటికి శిక్ష ఎందుకు తను అనుభవించడం జరిగిందా అని అతను మధన పడిపోతున్నాడు ఉద్రిక్త పరిస్థితుల్లో యివాళ ఏమయినా జరగొచ్చు. కానీ రేపుమాట ఏమిటి?

"యియాల్టికి పోదాం" అన్నాడతను.

"సంగతేటొద్దో రేపు సూద్దాం"— సూరి.

వెలుగుతున్న మంటని 'టప్'న నేలని కొట్టి, ఆర్పేసి,

"పదండెహె—" అన్నాడు పైడితల్లి.

*   *   *

అసలు నారాయుడుకి తను చేసే కండక్టర్ పనికి యిన్ని తగువులుంటాయని అనుకోలేదు. అతను ఎస్సెల్సి తప్పేడు, తప్పేడంటే చదవక కాదు, టైఫాయిడ్ వచ్చింది. తప్పేడు, మరి చదవలేదు. కండక్టర్‌గా చేరేడు. నెలకి జీతం, బేటీలు, కలెక్షన్ రెండొందల యాభైదాటితే, బోనస్—

అతనుద్దేశంలో, ఈ బస్సుల గొడవా అదీ పెద్దయుద్ధం. యుద్ధంలో అవతలవాణ్ని వోడించినంత పని చెయ్యాలి, ఇదో పెద్ద బిజినెస్. అంతా తనలాంటి వాళ్లే— తనలాంటి వాళ్లతో తనకు తగవులు, యింకో రూటువాడితో కాంపిటీషను. ఓ స్టేజికి వాడు ముందెళ్తే, మరోస్టేజికి తను బండి అడ్డం పెట్టెయ్యడం. అది కదలక ముందే కదలడం, తర్వాత స్టాపులో రెండోబండి ఆరోడ్డు మీదినుంచి వెళ్ళడానికి దారి యివ్వకుండా బస్సు ఆపడం— యిదీ తంతు.

జనం.

రష్.

తొక్కుడు.

ఈ తొక్కిడిలో దూసుకొంటూ వెళ్ళి టికెట్లు చింపాలి. మధ్య మధ్యలో పాసింజర్ల తిట్లు. ఎవరికోసం యివన్నీ? తనకోసమా? తను 'కలెక్షన్' చేసే డబ్బులు సంచిలో పడేసుకొనే డబ్బులన్నీ— తనకోసమా?— కాదే! 'ఖర్మ'.

కాలేజీ ట్రిప్పులయితే మరీను. ఫుట్ బోర్డుమీద వేళ్ళాడిపోతారు. స్టూడెంట్సు— ఏమన్నా అంటే మళ్లీకోపాలు, దెబ్బలాటలు, కొట్టుకోడాలు, కాలేజీ ట్రిప్పుల్లో అమ్మాయిల మధ్యకి వెళ్లాలంటే అతనికి భయం. వెనకనుంచి అరుపులు—

"మీ బస్సుల్లో కండక్టర్ జాబ్ బెస్టు గురూ—"

"లక్కీ ఛాన్స్ గురూ" అంటూ.

బస్సు కెపాసిటీ అరవై అయితే, వందకుతగ్గదు. ఓవర్ లోడ్ పట్టుకొనడం కల్లే ఓనర్లకీ ఆర్టీవోలకీ మధ్య ఎప్పుడూ ఏవో వుంటూనేవుంటాయి, ఎప్పుడయినా పేచీ వస్తే పట్టుకొంటాడు. లేదా, పైఅధికారి హఠాత్తుగావస్తే పట్టుకొంటాడు. సాధారణంగా పై అధికార్లు ఎప్పుడువచ్చేదీ తెలుస్తూనే వుంటుంది. అది బస్సు ఓనర్లకీ, వెంటనే తెలుస్తుంది. పై అధికార్లు వచ్చినప్పుడు మాత్రం, బస్సులు కెపాసిటీతో నడుస్తాయి. పొరుగును కూడా ఓవర్ లోడ్ చెయ్యరు. బస్సులు, రామరాజ్యంలోని బస్సుల్లా, ప్రయాణీకులకు హాయిగొల్పుతూ ఖాళీగా వెళ్తాయి డ్యూటీ ప్రకారం, రూలు ప్రకారం. కెపాసిటీతో వెళ్తాయి. మళ్ళీ ఏమన్నా అంటే,

"అదంతేనండీ! బిజినెస్. కండిషన్లు బావుండాల" అంటారు. అసలు గవర్న మెంటువారి ఆర్డరు ప్రకారం, ఏ గెజిటెడ్ అఫీసరయినా ఓవర్ లోడ్ చేసినప్పుడు పట్టుకోవచ్చుట! ఆఫీసర్ల షర్టులు నలిగినా, మురికి అంటినా ? అదే మామూలువాళ్ల షర్టులు చిరిగిపోయి, చెప్పులు తెగిపోయినా—? (!)

'అసలు ఓవర్ లోడింగ్ ఒక కళ. అది రానివాడు ఒట్టివవట ఓవర్ లోడ్ చెయ్యమని ప్రతి వోనరూ, ఆజ్ఞ యిస్తాడు. ఆజ్ఞ యివ్వనివాడు బస్సుకొనడు. కొన్ని మర్నాడే అమ్మేకు పోవాలిట!'

బస్సుల్లో పనిచేసేవాళ్లకి జీతాలు తక్కువ— పోలీసువాళ్లకు మల్లే. అందుకే కండక్టర్లయినా, చెక్కర్లయినా, రెండోరకం సంపాదనలు మొదలుపెడతారు. యిది ఓవర్ లోడింగ్‌కన్నా పెద్దకళ. కొన్నికొన్ని బస్సుల్లో రోజుకి యిరవైముప్పై యింటికి పట్టుకెళ్ళే కండక్టర్లున్నారు. జేబు సంపాదన అంతా ఓ మిస్టరీ. గొప్పగొప్ప ట్రిక్కులున్నాయి అన్నిటికన్నా భారీఎత్తు వ్యాపారం దొంగ టిక్కెట్లు ప్రింటు చెయ్యడం,

నంబర్లతో సహా, అవే టికెట్లు. కొంతమంది టికెట్లు తీసుకోకుండా డబ్బులు యిచ్చి పోతుంటారు. టికెట్టు కొయ్యకుండా కండక్టర్ సంచీలోకి డబ్బులు వెళ్లాయంటే, అవి కండక్టరు సొంతం, క్లీనర్ తీసుకొన్న టికెట్లు మళ్ళీ కండక్టరు చేతిలోకి రావడం ఓరకం.

లైన్ బస్సులయితే, మరీ సులభం.

అయితే,

యిన్ని లొసుగులున్నా, ఓనర్లు బస్సుమీద బస్సులు ఎలా కొంటున్నా రన్నది నారాయుడికె కాదు, చాలామందికి గొప్ప మిస్టరీ. ఎన్ని లొసుగులు ? ఆర్డీ ఓ లకులంచాలు– రిపేర్లు యిన్నిపోగా యింకా బస్సుమీద బస్సు కొంటున్నారంటే, అసలీ లొసుగులన్నీ లేకపోతే, యీ ఓనర్లు ఏనాడో కోట్లు కూడబెట్టుందురేమో ? అసలీ చిక్కంతా ఎక్కడుంది ?

అతని బుర్రికో చిక్కుప్రశ్న—

అయితే,

ఎక్కణ్ణుంచి వస్తుందో తెల్సినా తెలీకపోయినా, లాభం అనేదివుంటే బెల్లం చుట్టూ మూగే ఈగల్లా. పోటీదార్లు వస్తూనే వుంటారు. వేగం వేగం మారుతున్న జీవితంలో ఆలస్యం భరించడం కష్టం. బస్సుల్లో ఎంత ఓవర్ లోడ్ చేసినా, సర్దుకొని పోయేవాళ్ళకి, ఒక్కసారిగా బస్సు కెపాసిటీతో 'రన్'చేస్తే, ఎంతకష్టం?

అవతల ఆఫీసులు– ఏం గొడవ? తర్వాత బస్సులో చోటు దొరుకుతుందో లేదో తెలీదు.

"మీ యిష్టం వచ్చినట్లు మీరు నడిపితే, జనం వూరుకొంటా రేమిటండీ ? యిందా కిందాక ఓవర్ లోడ్ చేశారు. యింతలోకే ఏమయిపోయింది ? మమ్మల్ని చచ్చినట్లు తీసికెళ్ళండి."

"అయ్యా, అవతల ఓవర్ లోడ్ హఠాత్తుగా పట్టుకొంటున్నారండీ ! ప్లీజ్, నెక్ట్సు బస్సులో రండి. లేదా బస్ ఆగిపోతుంది"

—యిదీ గొడవ.

"బాస్టర్డ్స్ ! అంతా వీళ్లయిష్టమే ! వుండి వుండి తెగుళ్లు పుట్టుకొస్తాయి."

నారాయుడికి యిక్కడో విషయం అర్థం అయింది. జనంకీ, ఓనర్లకీ మధ్య, ఎదురుగా 'విలన్'లా కనబడేది, స్టాఫ్. ఎన్ని బూతులయినా పడాల్సిందే. యింకో

విషయం కూడా అర్థం అయింది. బస్సులు చాలవు. బస్సులు చాలవు అంటే, జనం అవసరానికి తగినన్ని బస్సులులేవని. మరికొన్ని బస్సులుపడాలి.

మరికొన్ని బస్సులు పడితే?

ఒకో బస్సుకీ, కలెక్షనూ — లాభమూ తగ్గిపోతుంది. బస్సులున్నది దేనికి? లాభానికి అంతేగాని. ప్రజల సౌకర్యం కోసం కాదని విజ్ఞులందరికీ తెల్సును, యింకొన్ని బస్సులుపడితే, తనలాంటివాళ్ళు, యింకొందరికి పనిదొరికేది. యిప్పుడో? ఆ అవసరం లేకుండా, వున్నకొద్దిమందీ వాళ్ళపనీ, దాని ఫలితమూ. ఓనర్లకి ధారపోస్తున్నారు.

ఎన్ని అన్యాయాలు జరిగినా. అందరూ ఎంత నీచంగా బ్రతుకుతున్నా అల్టిమేట్‌గా, చివరికి ఓనర్లకి లాభంమాత్రం తప్పదు,

జనంకీ ఓనర్లకీ మధ్య. స్టాఫ్ నలిగిపోక తప్పదని అతనికి తెల్సుగానీ. ఓనర్ల లాభంకోసం రక్తం చిమ్మాల్సి వస్తుందని అతనెన్నడూ అనుకోలేదు, ఓవర్ లోడ్ చెయ్యలేదనీ, ఖాళీలేదని అన్నందుకూ అతన్ని ఒకటి రెండుమార్లు కాలేజీ కుర్రాళ్ళు కొట్టారు.

వెనకాల వున్నది వేరొకళ్ళయినా, ఎదురుగా వున్నందుకు దెబ్బలు తినక తప్పిందికాదు.

ఆట బొమ్మల్ని ఆడించేవాడు ఆట బొమ్మల మీద దౌర్జన్యంచేస్తే, దానిఫలితాలు చివరికి అనుభవించాల్సిన దశవస్తుంది.

కడుపులు మాడ్చడం, దోపిడీ అయితే,

అంతకన్న పెద్దదోపిడీ ప్రాణాలకు ఎసరుపెడ్తుంది.

అసలింతకీ ఏం జరిగిందంటే.

ఆరోజు

"అల్లదిగో, బెంజి బస్సు వెళ్ళిపోతోంది — లాగించెయ్" అన్నాడు నారాయుడు.

బస్సునిండా జనం

బస్ కదుల్తుండగా, బయటకు చూశాడతను.

బెంజివాడు కదిలిపోయాడు.

"ఒరేయ్! లాగించెయ్. ఆ దొంగలంజ కొడుకు చూశావు కదా, ఎంతలోడ్ చేస్తున్నాడో" అన్నాడతను.

పోటీలు పడ్తున్న రెండు బస్సులూ ఒకే 'రూట్'వి.

బస్సు వేగంగా వెళ్లి బెంజి బస్సుకి అడ్డంగా నిలబడింది. నారాయుడు బస్సు దిగి వెళ్లాడు.

"ఒరేఁ యిదేట్రా! పదినిమిషాల్లేటా! సర్వీసేటయి పోవాల్రా?"

"ఏట్రా?" అంటూ, అవతల బస్సులో కండక్టరు, కిటికీలోంచి తల బయటకు పెట్టాడు.

"ఏట్రా" ఏటి? పదినిమిషాలు లేటుచేసి, యిదేటి? పాసింజర్లని దింపెయ్-"

"అదేటాఁ- పాసింజర్సేటన్నా గొర్రెలేటాఁ దింపడానికి? బేగిపోనీరా-" అంటున్నాడు అవతల కండక్టరు

"అవతలి రెండుస్టాపులూ వొదిలెయ్—" అన్నాడు నారాయుడు. ఒదల్నన్నాడు అవతల వాడు.

చిలికి చిలికి గాలివాన అయింది.

స్టాపూ, స్టాపూ తన్నుకొనడం జరిగింది.

"ఏడీశారు! లంజకొడుకులు మక్కెలు జార్తాయని చెప్పండ్రా" అన్నాడు, నారాయుడు బస్ వోనరు.

అతనికి బ్యాంకులో ఎకౌంటూ, బస్సుల సంఖ్యా, బొజ్జా పెంచడం అలవాటయిపోయింది. అతను, బొజ్జ కుడిచేత్తో రాసుకొంటూ, వెకిలిగా నవ్వేడు.

వూళ్లో చాలామంది, అతన్ని 'కత్తి'లాంటి మనిషిగా పేర్కొంటారు,

"వూరొచ్చినప్పు డేఁవుందీ ? ఏఁవీలేదు. ఐదేళ్ళకి బస్సు కొన్నాడు" అంటారు కొందరు,

"అసలాడికి దురాశలావు. ఎన్ని బస్సులున్నా చాలవు. లారీలున్నాయి. అయితే ఏం? వూరు వూరంతా వాడిదే అయినట్లు పోజు" అన్నాడు సూరి, అతనికి, యిద్దరు ఓనర్లమధ్యా వైరుధ్యాలున్నాయన్న సంగతి అర్థం అవుతూనేవుంది, ఆకసితోనే యీ దెబ్బలాట జరిగిందని అతని నమ్మకం,

"వూరు ఎవడిదో అప్పుడే ఏం తెలుస్తుంది?"

భవిష్యత్తులోకి దృష్టిపోనిస్తూ అన్నాడు ఓనరు.

ఓనరు ఎన్ని వెకిలికబుర్లు చెప్పి, ఎన్ని డబ్బాలు కొట్టినా జరిగిన గొడవ నారాయుడికి నచ్చలేదు.

"ఎందుకీ వెధవగోల? వాడి వోనర్ని పెంచాలని వాడి తాపత్రియం, అదీ న్యాయమైన తాపత్రయం కూడా కాదు. యింకెన్ని గోలలవుతాయో—"

అన్నాడు నారాయుడు, సూరితో.

అయితే అవాల్సిన గొడవకన్నా పెద్దగొడవే అయింది.

ఈరకం గొడవ నారాయుడు వూహించలేదు.

రాత్రి తొమ్మిదిన్నర అవుతుంటే, బస్సు బస్టాండుదగ్గిర ఆగింది. బస్సు దగ్గిరకొచ్చిన ముగ్గురు మనుషులు పుష్టిగావున్నారు. మధ్యలోవున్న ఒక్కడూ, భారీగా ఏనుగులా వున్నాడు. దళసరి కళ్ళద్దాలు, మనిషినిచూస్తే, ఎందుకో అసహ్యం వేసేలా వున్నాడు.

బస్సులో అట్టే జనంలేరు. వున్న ఒకళ్ళో యిద్దరో, ముసిలివాళ్లు, వెనక సీట్లో జారగిలబడి కూర్చున్నారు.

"ఒరే! ఎవర్రా కండక్టరు?" అన్నాడు, ఏనుగులాంటి మనిషి. అతనికి కండక్టరు ఎదురుగా, కాష్‌బాగ్‌తో కనబడుతూనే వున్నాడు,

'ఈ లంజకొడుకు దాపరించాడూ....' అనుకొన్నాడు పైడితల్లి.

అతనీ ఏనుగులాంటి మనిషితత్వం బాగా ఎరుగును.

ఏనుగులాంటి మనిషిపేరు సర్వేశ్వర్రావు. చాలా బస్సులూ, లారీలూ వున్నాయతనికి. బస్టాండు దగ్గిరున్న షావుకార్లలోనూ, యితర జనంలోనూ అతనికి ఎక్కువే పలుకుబడివుంది. అక్కడ అతనికి తిరుగులేదు. అతన్తో దెబ్బలాటకు దిగిన ఎవరైనా, ఆ ప్రాంతంలో 'సఫా' అవాల్సిందే.

పక్కనున్న వాళ్ళిద్దరిలో ఒకతను అతని తమ్ముడు. రెండోవాడు అతని భార్యకి తమ్ముడు.

"ఏట్రా! ఒకోళ్ళకీ వొళ్ళు కొవ్వెక్కిపోతున్నది!" అన్నాడతను. నారాయుడు తెల్లబోయాడు.

"ఏటంటున్నారు—" అన్నాడు.

"అవున్రా! లబ్డీకొడుకుల్లారా! ఎందుకర్థం అవుతుందీ? మొన్న కొట్టుకుంది చాలక. అయినా మొన్న మొన్న వచ్చాడు మీ ఓనరు. ఏటా పొగర్తనం?

ఏటంత ఇష్టస్రిక్షన్నిచ్చేశాడేటి? కలబడి కొట్టుకోడమేనట్రా? పాతేస్తే గతేటాని మీకు? ఏంటి? మాట్లాడవేటి?" సర్వేశ్వర్రావు రైజయిపోతున్నాడు, అదేపనిగా.

"అయ్యా! నేనీవూళ్లోనే పుట్టాను. మావోనర్ మరోవూర్నుంచి వచ్చాడు. నిజఁవే! కొంచం కాలమే అయింది- కాదన్ను. అంతమాత్రాన మేం మీకు లొంగా లనుండేమిటి ? మీరూ దూరంనుంచే వచ్చారు. దూరం దూరం నుంచి వచ్చిన వాళ్ళం దరూ కొద్దికాలంకే గొప్పోళ్ళయి, యిళ్లు కట్టుకొని బస్సులు కొంటున్నారు బాబూ ! భవంతులు వేసేస్తున్నారు. మా మేటి? పుట్టింది యిక్కడే. చచ్చేదీ యిక్కడే. మాకు తినడానికి తిండీవుండదు, వుండటానికీ జాగా వుండదు మమ్మల్నెందుకు వెక్కిరి స్తారు, రోడ్లమీద నిలబెట్టిందిచాలక? అయినా, స్టాపూ స్టాపూ తన్నుకొన్నాం. మధ్యన ఓనర్లెందుకయినా?"

అన్నాడు నారాయుడు.

"ఓర్లంజకొడకా!"

యిద్దరు వచ్చి అతనిమీద పడిపోయారు. చుట్టూ చూస్తున్న జనం పూరు కుండిపోయారు. వాళ్ళంతా సర్వేశ్వర్రావు వెంట వచ్చినవాళ్ళే అయుంటారు.

"అదేటది? స్టాపు తగువులకు ఓనర్లొచ్చి దవుర్జ్యం చేస్తారేటి" అన్నాడు సూరి.

"స్టాపు తగువుల గురించి అడగటానికొస్తే, ఎలాగ పేల్తున్నాడో చూశావు కదా! యిదేటి పెళ్లాంతో సరసం అనుకొన్నాడేటి" అన్నాడు సర్వేశ్వర్రావు.

"రంకు మొగుడితో సరసం అనుకొన్నాను" నారాయుడికి ఒళ్లుమండింది, కానీ అతను వలలో చిక్కినట్లయిపోయాడు అతన్ని రెండు వేపుల్నుంచీ, యిద్దరు పట్టుకొన్నారు. సర్వేశ్వర్రావు ఎదురుగా, కాలయముళ్లా నిలబడివున్నాడు. ఆతను మోచెయ్యితో బలంగా నారాయుడి కడుపులో పొడిచాడు.

"అమ్మో!" అన్నాడు, నారాయుడు బాధకి, కిందకి వంగిపోతూ.

"వేషాలు వేస్తున్నాడు!" సర్వేశ్వర్రావు రెండు చేతుల్తో, నారాయుడి తల పట్టుకు గుంజటం ప్రారంభించాడు. బస్సుమీదకు గట్టిగాతోసాడు. మిగతా యిద్దరు కూడా చేతులు చేసుకొన్నారు.

"ఓరి, ఓరోరి" అంటూ సూరి ముందుకు రాబోయాడుగానీ, నలుగురయిదుగురు అతన్ని బలంగా పట్టుకుని ఆపేశారు.

రెండు నిముషాల్లో నారాయుడ్ని చిత్తుగా తన్నేరు.

"ఏటనుకొన్నావో? జాగర్త."— సర్వేశ్వరాత్రివు.

నారాయుడి పళ్ళలోంచి రక్తం కారుతోంది- తల చిట్లింది.

"మీ పెద్ద బస్సోనర్లకీ, చిన్న వోనర్లకీ తగాదాలకి మధ్య మమ్మల్ని చంపండి" అనరిచాడు.

అందుకే—

పైడితల్లికీ, సూరికీ, నర్సికీ, నారాయుడికీ రక్తం కుతకుతలాడి పోతోంది.

వాళ్ళకేకాదు. ఈవిషయం తెల్సిన చాలామంది బస్‌వర్కర్లు కూడా అలానే వున్నారు.

*　　　　*　　　　*

"చంపేశారు! పోలీస్ రిపోర్టు ఎందుకిచ్చారు?" అన్నాడతను.

"వూ(—" అని వూరుకొన్నాడు సూరి.

పూర్ణామార్కెట్ వెనక భాగానవుండే కూరగాయల దుకాణందగ్గిర నిలబడి వున్నారు వాళ్లు.

"బెండకాయ లెలాగమ్మా...." అన్నాడు నారాయుడు.

అక్కడున్న కూరలు చవక.

చవక కూరలన్నీ, మార్కెట్ వెనక భాగానవున్న దుకాణాల్లో వుంటాయి. ముందువేపున్న కూరలు తాజావీ, ఖరీదయినవీను. యిక్కడ అన్నీ మిగిలిపోయినవి, కూరలు తాజావి కాకపోయినా, ఆకల్తో చావకుండా బ్రతకదల్చుకొన్న వాళ్ళకి పనికొచ్చే రకం కూరలు.

"అవు నంతతొంద రెందుకు" అన్నాడతను.

అతను గాభరాపడుతున్న జంతువులా కనబడుతున్నాడు. కరోనా వాళ్ళ పద్దెనిమిది రూపాయల బూటు వేసుకొన్నాడు. కాటన్ పాంటులో టెర్లిన్ షర్టు టక్ చేసుకొన్నాడు. చౌకరకం, కూలింగ్ గ్లాసులు పెట్టుకొన్నాడు.

"తొందరేమిటి?" విసుక్కున్నాడు సూరి.

"చంపేశావు, కొంప ముంచేశావు"

"ఇదిగో— నాగేశ్వర్రావ్, నువ్వెన్నిచెప్పు, నేను వినను. నాకు మండి పోతోంది. దీన్తో, అటో యిటో తేలిపోవాల్సిందే"

"ఛ ఛ- అలాగనకు సూరీ! అసలు గొడవ పూర్తిగా చెప్పు" అన్నాడు నాగేశ్వర్రావు. నాగేశ్వర్రావు బస్ వర్కర్ల యూనియన్‌కి సెక్రెటరీ. అయితే, అతను బస్సు కార్మికుడు కాదు, ఆ మాటకొస్తే, అసలు ఏ కార్మికుడూ కాడు.

"ఏటవుద్ది? ఏటీ తెలీనట్లు మాట్లాడక. ఓనర్లొచ్చి స్టాపుమీద దవుర్జన్యం చేస్తారూ—"

"ఛ ఛ! మనోడిది కాస్తంత తప్పుంది" నాగేశ్వర్రావన్నాడు.

"యదవనాకొడుకు కబుర్లాడక" సూరి వార్నింగిచ్చాడు.

"ఎంతసేపూ నీయిది నీదేగానీ మాటినవుకదా"

నాగేశ్వర్రావు ఎంతసేపూ కులాసాగావున్నట్లు కనబడటానికి ప్రయత్నిస్తాడు. మనిషికి చీకూ, చింతాలేనట్లు వుంటాడు. బస్సుల గొడవయితే, ముందు అతని కన్సల్టేషనుంటుంది. మనిషి అఖండుడిలా మాట్లాడతాడు, ఎవర్ని సపోర్టుచేస్తున్నదీ కనుక్కోవడం కష్టం. చివరికి అతనే అన్నాడు.

"అదికాదు గురూ, మనకూ ఓనర్లకీ తగువెందుకు గురూ? ఆళ్ల బావుంటేనే కదా మనబావు. ఆడు మన ఓనరవనీ, మరో బస్సవనీ, ముందు బస్సోనరు బావుండాలా? బస్సోనర్లే లేపోతే మనగతేటి? అఁహ! నువ్వే ఆలోచించు గురూ! ఆడికెన్ని బస్సులున్నాయి? చానావున్నాయి కదా? లారీలున్నాయి- షెడ్డుంది, ఆడెంత పెద్దోడన్నది కాదు నేచెప్పేది. ఆడికింద ఎంతమంది పన్జేసి బతికేదీ చెబుతున్నా— ఏటి? డ్రయివర్లూ కండక్టర్లూ, క్లీనర్లూ చెక్కర్లూ, షెడ్డు వాచిమెన్లూ— ఎంతమంది? యీళ్లందరూ ఈడొక్కడి మీదేనా ఆధారపడి బతికేదీ? కాదా? మరాణ్ని నువ్వు 'అదిసేస్తా విదిసేస్తా'నంటే— ఆళ్ళందరూ నీలాంటోళ్ల కాదూ"

"అదిసరే. అసలు ఏడుపేడెహ—"

"తగ్గరా బాబు తగ్గు సీక్కోపం వస్తే ఎంతపనైనా సేస్తావని తెల్సుగావి.

ఆగు ఆలోసించాల్సిన టయిం యిది. ఓసరొచ్చి కొట్టాడే అనుకో— అయినా ఆలో సించాలి కదా. ఎందుకొట్టాడూ, ఏటి. కతా అని ఆలోసించాలా వొద్దా? ఆడిమీద పోలీసు రిపోర్టిచ్చీడం వే? ఓరిబాబు. మనకది తగదురా. ఎందుకంటావూ, ఆడీకేసెలాగయినా కొట్టించీగల్డు. మనమీద కక్షగడతాడు, మసిచేస్తాడు. రేపు మరో బస్సోనరు మనల్ని వుజ్జోగంలోకి తీసుకొంటాడూ? అందుకే. మజ్జేమార్గం సూడమన్నారు. మనకీ మనకీ ఎందుగ్గురూ తగావులు. ఓనరు తప్పుచేస్తే, చెమించి పారెయ్యాలి అంతేగానీ, పోలీసు రిపోర్టులేటి? కుక్క జట్టీల్లా. సర్వేశ్వర్రావు సేత చెమాపణలు వేడించీ పూచీనాది. కాంపెన్సేషన్ యిప్పించీ పూచీనాది, విన్నావ్ కదూ, రిపోర్టు విత్‌డ్రా చేసియ్యండి మరి.

"చావ్! నోర్ముయ్. దీ నంతం చూడాల్సిందే"

"అదికాదురా నాయన, మన వొంటికది మంచిది కాదురా. నా మాటిని, యివేళ సాయంత్రంకి బట్టేందుదగ్గిర కొచ్చీండొ్. షెడ్డుంది కదా, అక్కడికి. అక్కడన్ని ఎవారాలూ సెటిల్‌సేద్దాం, నామాటిని రండ్రా. రాకుంటే వొట్టు. నా కరిజంట్ పనుంది. సాయంతరం ఏళ కొచ్చెయ్యండి"

అంటూ, నాగేశ్వర్రావ్ అర్జంటుగా వెళ్ళిపోయాడు.

"దొంగతొత్తు కొడుకు. అమ్మో! ఎంత దొంగలంజకొడుకో చూశావ్‌కదూ. ఛీ వోనర్లకి కాకాకొట్టి బతుకు, కుక్కావుంది ఎందుకూ? సెటిల్‌సేస్తాట! ఏటిసేస్తాడో సూద్దాం. యీడి జేజమ్మ బతుకియేల బయటపడాలి. యాసికా లనుకొంటున్నాడు దవుర్జన్యానికి దవుర్జన్యం వే మందు—" సూరి మంటగా అంటుంటే నారాయుడు వింతగా చూశాడు.

* * *

ఐదున్నరకే చీకటి పడుతుంటే షెడ్డులో లైట్లు వెలిగాయి.

"యిదిగో వచ్చేశారు" అన్నాడు నాగేశ్వర్రావు, సూరినీ, నారాయుడ్నీ చూస్తూ. అతను వెనకవున్న పైడితల్లినీ, నర్సినీ యింకా వెనకవున్న జనంనీ చూడలేదు. షెడ్డులో యింకా మనుషులున్నారు. వాళ్ళందరూ బస్సువర్కర్లే.

పావుతక్కువ ఆరవుతుండగా, సర్వేశ్వర్రావు వచ్చాడు.

అతను నాగేశ్వర్రావును చూస్తూ, బరువు దిగినట్లు ఫీలయ్యాడు. అతను నాగేశ్వర్రావుని పక్కకి పిల్చి ఏదో మాట్లాడాడు.

సూరి, నారాయుడి చెవిలో,

"యదవనాకొడుకుల బతుకులు చూశావ్‌కదూ" అన్నాడు.

అంతా గోలగోలగా వుంది.

నాగేశ్వర్రావు, ఒక్కసారి గొంతు పెగుల్చుకొని గట్టిగా అన్నాడు.

"ఓనర్లొచ్చి మామీద దవుర్జన్యం చెయిడం గోరం బాబూ. ఓనర్లకీ పనోళ్లకి తగూలుఇలావస్తే ఎలా? తొందరతొందరలో గొడవలు జరిగిపోతాయి. చివారికి తలలు బద్దలుకొట్టుకోడాల కెళ్ళిపోతాయి. అయినా, స్టాపుతగువులకిలా ఓనర్లు కలగజేసుకోడం అన్నేయం. అణ్ణలా కొట్టేసినారుకదా. ఏటయిపోంది? ఆడు చచ్చీ వూరుకొంటే ఏటి గతి? పనోళ్ళను కంట్రోల్ చెయ్యాలన్జెప్పి ఈరకంగా సేసేస్తే మాకేటిగతి. యిప్పుడయినాది సూసినారుకదా, ఓనర్లే పనోళ్ళను కొట్టేస్తే, మాకెవరు దిక్కు? పోలీసోళ్లు తప్పించి? మరందుసేతే, పోలీసు రిపోర్టిచ్చేళారు. ఎదో, మరేదో నష్టపరియారం యిచ్చెయ్యండి. ఏదో నచ్చజెప్పి రిపోర్టు వెనక్కి లాక్కుంటాం, ఏటంటారు"

సర్వేశ్వరావు మధ్యలో కల్పించుకొని అన్నాడూ.

"అసలు కలెక్షన్‌కోసం దెబ్బలాటలు పనికిరాదు, అసలీపనోళ్ళని కంట్రోలు చెయ్యాలి, ఆబస్సోనరేటి. యీబస్సోనరేటి, అందరూ ఒకటే. పనోళ్ళలో తప్పుంటే ఓనర్లు సరిదిద్దాల. ఎవడయితేనేం, సరిదిద్దటానికి? ఓరకంగా అవాల్సింది మరోరకంగా అయింది"

"అదేటది? ఎంత మీరూ మీరూ ఒకటయినా మమ్మల్ని రక్తం వచ్చేలా కొడతారా?" సూరి మందువేసి రాలేదుగనీ, అతడంత ఆవేశంతో వున్నాడు.

"అవునది కాదండీ, యివాళ మమ్మల్ని కొట్టారు, రేపు మీస్టాపుతో మాకు తగువు ఆవుతుంది. మళ్ళీ తగువవుతుంది. అయినా ఎవరికోసం మా కీ పీకులాట. జనంతో గొడవలు, యింకో బస్సువాళ్లతో గొడవలు. అంతా గొడవలే మా ప్రాణాలకు సుఖమేలేదు.

"అయినా మా బతుకులకు విలువలేదు, రక్షలేదు, హామీలేదు. పనోళ్ళం పనోళ్ళం కొట్టుకుచస్తున్నాం, అంతేగా మీ సంబరం. కాలిమీద కాలేసుకొని డబ్బుల మూటలు కట్టుకొన్నారు మీరు. పొద్దుట్నుంచి రాత్రివరకు తన్నుకుచచ్చి మీకోసం, మీ

డబ్బుల మూటకోసం, యెదవ బతుకులు మేం బతుకుతుంటే, మామీద దవుర్జన్యం చేస్తారా మామీద. మా బతుకులకు విలువలేకుండా చేసిన మీ ప్రాణాలకు, విలువ మేం ఎందుకివ్వాల?" సూరి వూగిపోతున్నాడు.

అతన్ని చూస్తుంటే సర్వేశ్వర్రావుకి భయం వేస్తోంది. వ్యవహారం వుత్తి కుత్తినే పీకమీదకి వచ్చినట్టు కనబడుతోందతనికి.

జనంలోంచి గోల.

అరుపులు,

యిదంతా చూస్తుంటే సర్వేశ్వర్రావుకి దడ పుట్టుకొస్తోంది.

నాగేశ్వర్రావు, రంగంలోకి దిగుమతి.

"సూరీ! చెప్పేది యినవేటి. చెమాపణ అంటున్నాడు కదా—"

నాగేశ్వర్రావు మాటపూర్తి అవకముందే. ఒకతను ముందుకొస్తూ,

"క్షమాపణలు దేనికి? లెంపకాయ కొట్టి క్షెమాపణంటే, ఆయనూరుకొంటాడూ?" అన్నాడు.

జనం మళ్ళీ గొల్లుమన్నారు.

"ష్! గొడవొద్దు. చెప్పేది పూర్తిగా వినండి" నాగేశ్వర్రావు మళ్లీమొదలు పెట్టాడు:

"ఆయన తప్పయిందనొప్పుకుంటున్నాడు కదా, క్షెమాపణ అనగానే అది పోదు. నిజఁవే కాంపెన్సేషన్ యిస్తానంటున్నాడు కదా. ఆయన చెప్పినట్టు వింటేనే మనకు మంచిది. లేదా మనకే నష్టం. ఆయన ఏదయినా చెయ్యగల్డు"

"నీ జేజమ్మ వచ్చినా అదికుదర్దు. నీయబ్బ సొమ్మేవడిదో యిస్తున్నావా కాంపెన్సేషన్? మాకడుపులు కొట్టిన సొమ్మేకదా అది. యీపోలీసు రిపోర్టు వెనక్కి చచ్చినా తీసుకోం. నీ వాడబ్బుకోసం కక్కుర్తి బతుకులను కొన్నావుటార్రి మా బతుకులు. యివి రక్తం దారపోసి బతుకుతున్న బ్రతుకులార్రి. డబ్బుతో మీయిష్టం వచ్చినట్లు మీరుచేస్తారు. మేం? మాకు డబ్బేటుంది. మాకండల్లో శక్తితప్ప. మేమందరం కలిస్తే మీ డబ్బేపాటి? పోలీసు రిపోర్టు యిచ్చాం డబ్బుతో దాన్నెలా మాన్పించగలరో

మేమూ చూస్తాం, మాకు నాయం వచ్చేదాకా వూరుకోం. ఈ పోలీసులూ, కోర్టులూ మాకు నాయం చెయ్యవా? మే మే వున్నాం. మా నాయం చూసుకోడానికి మీ డబ్బు న్నోళ్ళకీ, యీదొంగ కోర్టులకీ మా నాయం తెలీకపోవొచ్చు, లేదా మాక్కావాల్సిన నాయం యివ్వడాని కిష్టం లేకపోవచ్చు. కానీ, మా నాయం మాకు బాగాతెలుసు. దాన్ని సాదించుకోవాలంటే యేం చెయ్యాలోకూడా మాకు బాగాతెల్సు. యియేళ రాత్రితో మీకూ, మీ డబ్బుకూ, మీ కోర్టులకూ రోజులు చెల్లిపోయాయి మాకు నాయం మేమే చూసుకొంటాం. రేపు మరియాదగా మాకు నాయం దొరికి నువ్‌శిక్ష అనుభవించావా సరే. లేదా, ఆ నాయం ఏదో మాచేతిల్లోకే తీసుకొంటాం. ఇదిగో యిదేటో తెల్సునా. యినుపచువ్వ. ఏటి చేస్తున్నానో తెల్సునా, బూవిలో పాతేస్తున్నా. రేపు మీగతీ అంతే!"

సూరి చువ్వ గట్టిగా నేలలో గుచ్చాడు. అతనికి ఒళ్ళంతా చెమటలు పట్టి పోయింది. ఏం జరుగుతుందో అతనికే తెలీడంలేదు. అతని చెవులకు గోలలు వినబడు తున్నయి అతనికళ్ళలో నీళ్ల తిరిగి, ఎదురుగా వెలుగుతున్న దీపాలు మసక మసకగా కనబడుతున్నాయి.

సర్వేశ్వరావు పనీ ఇంచుమించు అలానేవుంది. అతని గుండెదడ ఎక్కు వయిపోతోంది. మధ్యవర్తిగావున్న నాగేశ్వర్రావు అతన్ని రక్షించేలాలేడు. అతనికున్న డబ్బూ, రేపు వెళ్ళబోయే కోర్టులూ అతన్ని రక్షించేలాలేవు. ఒకవేళ రక్షించినా వీళ్ల నుండి అతన్ని ఎవరూ రక్షించేలాలేరు. 'ఎలా తెల్లివార్తుందిరా భగవంతుడా' అనుకొం టున్నాడు సర్వేశ్వరావు.

'ఈ పాపం పండకపోదు మా బతుకులు తెల్లారకపోవు' అనుకొంటు న్నారు జనం.

ఔను. మన దరిద్రాలన్నింటికీ ఈ భగవంతుడి మీది విశ్వాసమే కారణం. గుళ్ళముందు, మసీదులముందు, చర్చిలముందు కనిపించే కోటాను కోట్ల దరిద్రులే దేవుడులేడని చెప్పడానికి తిరుగులేని సాక్ష్యం.

శ్రీ శ్రీ

మోతుబరి

'నాని'

"చూశావా ఎంత పని జరిగిందో! మన ఎంకాయ్ తమ్ముని ఆ బద్రిగాడు పొట్టనెట్టుకున్నాడు," అన్నాడు సుబ్బయ్య రొప్పుతూ,

అతను అప్పుడే భద్రయ్యగారి ఇంటినుండి పరుగు పరుగున వచ్చాడు.

"ఏంటిరా. ఏంటి. అంత సిన్నోణ్ణి ఎట్టా సంపాడురా? అసలాడికి సేతు లెట్టొచ్చాయి?" బాధగా అడిగాడు కిట్టమ్మ.

"రామాయణమంతా ఇని రాముడికి పీతేంటౌతుంది అన్నట్టుంది. ఈ సావుకార్ల ఊసు ఎరగనట్టే మాగుతావేరా?" అన్నాడు సుబ్బయ్య అసలు విషయం మర్చిపోతూ.

"సరి సరి అసలిసయం సెప్పారా. ఎట్టా సంపడు, ఏంటి కత. ఎంకాయ్ ఏమన్నాడు? సెప్పు సెప్పు." అన్నాడు కిట్టమ్మ ఆత్రుతగా.

"సెప్తున్నానా, ఇనుకో మరి. సిన్నోడు గొడ్లకి సీలెట్టకండా పొలం పోయాడు, ఇంకే——దొరికిందే సందని బద్రిగాడు ఓ 'సిన్న' దెబ్బేశాడు, ఏసే తలికి మనోడు తప్పుకుండావని సూసాడు. ఇట్టా వుంచా సీపనని బద్రిగాడు సిన్నోణ్ణి మామిడి సెట్టుకి కట్టేసి బాదాడు. తెలుసుగా అడి దెబ్బలు ఎట్టుంటయో........"

"అబ్బ అసలిసయం సెప్పరా."

"ఇను మరీ. బాదాడు బాదాడు... కసిదీరా బాదాడు సిన్నోడు సచ్చాక. నెత్తి మీద కొచ్చుద్దని దిగుడు బావిలోకి తోసేసాడు, అడి గుట్టు దాగుద్దా? వూరంతా టాం టాం అయింది. ఎంకాయ్ అమ్మ వూరుకుంటుందా? ఏసుకుంది నా సామిరంగా...."

"దానికి కోపం కంటె బాదెక్కువరా, దాని దాకా ఎందుకు. మనకి లేదూ బాద? సిన్నోడు మనవంటె ఎంతిదిగా వుండే వోడు! అడి సిన్న కల్లు ఎప్పుడు తలుక్కు తలుక్కు మనేవిరా, నేనంటేఆడికి మరీ పానం, ఎట్టా బరించాడో ఆ గొడ్డు దెబ్బలు?" అన్నాడు కిట్టమ్మ పైపంచి నోటికి అడ్డం పెట్టుకుంటూ.

"నీకేనేంటిరా, మాకులేదూ ఆడిమీదపేమ? మీరోరూలేనపుడు మేవిద్దరవే సేలో ఆడుకునే వోల్లం. ఆడెన్ని ఆటలాడేవోడో అంతపని సేసేవోడు. ఒక్కరోజు పని మానుకుంటేనే అట్టా బాదాలా? ఆ బద్రి అసలు మడిసికాడురా" అన్నాడు సుబ్బయ్య కొత్త సంగతి తెలుసుకున్నట్టు.

"ఇంతకీ ఎంకాయ్ ఏడున్నాడు?"

"ఆడు ఈ సావుకబురు ఇనే తలికి శానా ఇదయి పోయాడు. ఆ బదిరి గాడ్ని....?" అంటూ పళ్లనూరాడు సుబ్బయ్య.

"ఆగసే, అంత దూకుడు కూడదు, ఎంకాయ్‌నికూడా రానియ్ ఆలోసిద్దాం" అంటూ సర్దబోయాడు కిట్టమ్మ.

"ఇంకా ఏవనాగుతాంరా? ఆడుసేసిన గోరాలు కూసినా కాసినా? నేనొక్కడ్నైతేనా! ఈ తలికి ఆడి రక్తం కల్లసూసేవోడివి. లేపోతే అంత సిన్నోడిమీద సెయ్యి సేసుకోటానికి ఆడికేంటొసే అక్కు?" అన్నాడు సుబ్బయ్య రెచ్చిపోతూ.

భద్రయ్యగారు ఆ వూళ్లోకల్లా మోతుబరి. నూరెకరాల ఆసామి. పేరు మోసిన వడ్డీ వ్యాపారి. చాలామంది ఆయన దగ్గర నగలు, ఇళ్లు, పొలాలు తాకట్టు పెడతారు. నూటికి పదిమంది కూడా వాటిని విడిపించుకోలేరు. అందువల్ల ఆయన ఆస్తిలో కలిసిన ఇళ్లస్థలాలకు, పొలాలకు; ఆయన భార్య ఒంటిమీద పెరిగిన నగలకూ అంతులేదు. డబ్భై ఏళ్లదాటినా దుక్కలా తిరుగుతారు. అప్పుల వసూళ్లకోసం ఎంత దూరమైనా సరే వెళ్తారు. అసలు ఫాయిదాలు ముక్కుపిండి వసూలు చేయడంలో ఆయన్ని మించిన చెయ్యి ఆ చుట్టుపక్కల లేదు.

పాలేళ్ళ దగ్గర్నుండీ ఇంట్లో పిల్లలదాకా ఆయన్ని చూస్తే హడిలిపోయేవారే. ఆయన కొట్టినా, తిట్టినా అడిగినప్పుడల్లా తాకట్టుపెట్టుకుని అప్పులిస్తారు కనుక పాలేళ్లు ఆయనదగ్గర పనికి కుదురుకునేవారు. ఆస్తికి యజమాని కనుక ఇంట్లో భార్యాబిడ్డలు కిక్కురుమనే వారుకాదు. ఆయన నోటికీ, ఆస్తికీ జడిసి ఊళ్ళోవాళ్ళు చెప్పుకింద తేళ్ళలా పడివుండేవారు. ఎదురుగా ఏమీ అనకపోయినా బీదా బిక్కీ చాటున పళ్ళు నూరేవారు. అందుకు కారణం ఆయన చిన్నప్పట్నుండీ ఒక్క మంచిపని కూడా చేయకపోవడమే.

"అడుగో ఎంకాయ్ రానే ఒచ్చాడు. ఇక నువ్వు కాసేపు మాటాడమాక. ఆడేవంటాడో ఇందారి" అన్నాడు కిట్టమ్మ ఎంకాయ్‌వైపు తిరుగుతూ.

సుబ్బయ్య. ఎంకాయ్. కిట్టమ్మ— ముగ్గురూ ఒకచే గుటక. వాళ్ళను చూసి గిట్టనివాళ్లు కళ్లల్లో నిప్పులుపోసుకుంటే, అయిన వాళ్ళు త్రిమూర్తులని పొంగిపోయే వారు. ఏపనిచేసినా ముగ్గురూ కట్టకట్టుకుని దూకేవారు. మాలపల్లి జనానికి తలలో నాలుకలాంటి వాళ్లు ఈ ముగ్గురూ.

ఎంకాయ్ తమ్ముడిని మిగతా ఇద్దరూకూడా చాలా గారాబంగా చూసేవారు చిన్నాడు లేడిలా గెంతుతూ చిన్నచిన్నపనులు చేసిపెట్టేవాడు. తనకి లేదనికాక ఇతర్లకి వుండాలనే వుద్దేశ్యంతోనే చాలా పనిచేసేవాడు. 'ఇంత సిన్నప్పట్నుండి ఈడు ఇట్టా ఉన్నాడు, మనని మించిపోతాడురా" అనుకునేవారు ఈ ముగ్గురూ. చిన్నాడు చనిపో యాడని బాధగావున్నా. చంపినవాడిమీద కసి ఎక్కువగా వుంది వీళ్లకి.

* * *

"ఎవరెట్టాపోతే నాకేంగాని, ఈ సావుకార్లు మడుసుల్ని మడుసులిగా సూడ రమ్మా లేప్పోతే సూత్తాసూత్తా ఇట్టా నిండుపేనాన్ని వోరైనా పొట్టనెట్టుకుంటారా?" అంటూ నోరు నొక్కుకుంది పక్కింటి పుల్లమ్మ.

"ఎంత గొప్పోడైనా అంత మిడిసిపాటు పనికిరాదమ్మా. అయినా నాకు తెలవకడుగుతానూ. వూరంతా గుప్పుమన్నాక తల్లిని వదిలిచ్చుకోటానికి సేతులు తడి సేసాడంటాగా?" అంది గట్టవతలి ముక్కులేని సీతాలచ్చి.

"ఎంత వదిలిచ్చుకుందా వనుకున్నా ఎంకాయ్ అట్టా వొదిలేరకం కాద మ్మోయ్. తమ్ముడంటే ఆడికెంత పేమో!"

తనకి కావల్సిన సమాధానం రాకపోయేసరికి పక్కావిడతో ఛేటీ వేసుకుంది ముక్కులేని సీతాలచ్చి.

"ఇంతకీ ఎంతిచ్చాడే?" పక్కావిడ దగ్గరికి జరుగుతూ అడిగింది.

"అదే తెలపటల్లా"— గుసగుసలు.

"బాగానే అందుంటుంది. అందుకే కొడుకు పోయినా అంత నిలకడగా కూకుంది. ఎంత నంగనాచే! ఇట్టాటి తల్లిని నేనెక్కడా సూడలేదమ్మా. ఇదిగో ఇదెక్కడన్నా అనేప్! అయినా నాకెందుకులే. ఎవరిపాటికి ఆల్లుంటే అందరికీ మంచిది" అంది సీతాలచ్చి ఏదో తొందరపని వున్నట్టు బైటికి వెళ్లిపోతూ.

* * *

"ఈసారి తాడో పేడో తేలాల్సిందే" అన్నాడు సుబ్బయ్య ఉద్రేకంగా.

"ఇంకా ఆ వైపు రాలేదురా" కిట్టమ్మ శాంతపరచాలనే ఉద్దేశ్యంతో మాట కలిపాడు.

"ఇంకెన్నాళ్లురా? ఆడి గోరాలు ఏకరువెట్టనా?" అంటూ సుబ్బయ్య మొదలెట్టాడు—

"సిన్నప్పటి లీలలు వొదిలేద్దారి. మిగతాయి సెప్తా కాసుకోండి. పదారో ఏట రావయ్యగారి పాలేర్నితన్నాడు. పదేడో ఏట మాలపల్లోరి లచ్చిని సెరిసాడు. కొన్నాళ్లు పోయాక గుహప్రవేశానికి మంగలాడెదురయాడని ఆడ్ని సితకబాదాడు. పెళ్లిభోజనంలో పొరపాటున వుప్పెక్కువేసిందని మడికట్టుకున్న ముసిల్దాన్ని కర్రెట్టిబాదాడు. అది గుటుక్కుమంటే కేసు కొట్టేయించాడది ఏరే ఇసయం. అప్పులెగేశాడని కొత్తయ్య గారి రత్తయ్య పెల్లాన్ని ఇంటో కట్టేసుకున్నాడు. పొలంగట్టు దాటొచ్చిందని పేరిగాడి వున్నొక్క గేదినీ తోలుకుపోయాడు...."

"బాబ్బాబు ఇక ఆపరా. ఇప్పటికి యెయ్యిసార్లిన్నాం"

"మరింకా ఆలోసిద్దారంటా రేంటి?"— సుబ్బయ్య ప్రశ్నకి మిగిలిన ఇద్దరూ దీర్ఘాలోచనలో పడ్డారు.

* * *

అక్కడ తులసమ్మ పరిస్థితి ఏమీ బాగోలేదు. పక్కవాళ్ళ సూటీపోటీ మాటలతో ఆమెగుండె మరీతూట్లు పడిపోయింది. చెప్పుకోటానికి ఎవరూ లేనందువల్లా. తనలో తనే కుళ్ళి కుళ్ళి ఏడ్చినందువల్లా మొహమంతా వాచిపోయింది. ఎంకాయ్‌ని చూడ్డంతోటే ఆవేదన పెల్లుబికింది.

"అల్లందరికీ డబ్బుసయవే పట్టిందిగాని నా బాదెవురికీ పట్టలేదురా నాయినా. ఆడు ఏలే సంపాదిచ్చాలా. లచ్చలే సంపాదిచ్చాలా? బతికి బట్టకడితే సాఁదా? సిన్నోడయినా సిసింద్రీలా పనులన్నీ సిటుకు సిటుకు సేసేవోడు. నాకడుపుకోత ఎవురు తీరుత్తారురా? నన్నుకూడా దేనిలోకయినా తోసేయిరా బాబూ. ఇక నేనెట్టా బతికేదిరా...." అంటూ సొమ్మసిల్లి పడిపోయింది తులసమ్మ.

శవపంచాయితీలో చిన్నాడిది "ఆత్మహత్య" అని తేల్చాడు డాక్టరు.

ఇది జరిగిన కొన్నాళ్ళకు పూరంతా కీలకలం రేగింది— ఆతృతగా అడిగే వాళ్ళూ— చెప్పేవారు, వీళ్ళందర్లో కలవరం రేపిన సంగతి— రావి చెట్టుకింద నిర్జీవంగా పడివున్న భద్రయ్యగారి కళేబరం. ఆ భీకరాకారం ఇప్పుడు ఎవర్నీ భయపెట్టలేకపోతోంది,

అదే సాయంత్రం స్నేహితులు ముగ్గురూ కలుసుకున్నారు. అందరి మొహాల్లో ఏదో సంతృప్తి తాండవిస్తోంది.

"ఇప్పుడు సూడాలి ఆడా పేరు ఏవంటాడో, సినోడ్ది ఆతంహచ్చ అన్నాడే, దీన్ని పేతంహచ్చ అంటాడేమో సుద్దారి" అంటూ చెరువు గట్టువైపుకు దారి తీశారు ముగ్గురూ.

సాహిత్యం మానవుణ్ని వున్నతుడిగాచేస్తుంది. తన్నుతాను తెలుసుకొని ఆత్మవిశ్వాసం పెంచుకుని, సత్యం న్యాయం కోసం పోరాడేట్టు చేయగలిగి వుండాలి. మానవుల్లోని నైచ్యత నిర్మూలించడానికీ, ఉత్తమగుణాల్ని ఉత్తేజిత మొనర్చడానికీ, సమర్థమైనదే సాహిత్యం అని చెప్పితీరాలి. అధర్మంమీద క్రోధం, దౌర్జన్యానికి సిగ్గుపడడం, న్యాయరక్షణకి ధైర్యం, సౌందర్యం అంటే పవిత్రప్రేమ వీటన్నిటినీ మానవుల్లో విజృంభింపజేసేదే, ఉద్దీపింపజేసేదే నిజమైన సాహిత్యం.

— మాగ్జింగోర్కీ

ప్రజలు - భావాలు

— త్రిపురనేని మధుసూదనరావు

సమాజ జీవితంలో మౌలికమైన మార్పులు రావాలంటే భావ విప్లవం అవసరమవుతుంది. విప్లవం అంటే మార్పు అని అర్థం. చిన్న చిన్న సంప్రదాయాలు అలవాట్లు మారినంత మాత్రాన దాన్ని విప్లవాత్మకమైన మార్పు అని భ్రమపడకూడదు. విధవా వివాహాలకు సాంఘికమైన అనుమతి లభించడం, శకునాలను లెక్క చేయకుండా మనుష్యులు ముందుకు పోవటంలాంటి అతిసాధారణ విషయాల్లో వచ్చిన మార్పునుకూడ కొందరు అల్ప సంతోషులు అభ్యుదయం అని, విప్లవం అని పేరుపెట్టి సంతోషిస్తారు. నెమ్మదిగా పరిణామంలో విప్లవం వస్తుందని ప్రచారం చేసేవాళ్ళు చాలామంది వున్నారు. చారిత్రికంగా విప్లవం అనివార్యమే అయినా వ్యక్తులు గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే ప్రమాదకరమైన ఫలితాలు చాలావస్తాయి. విప్లవ పరిణామాన్ని వేగవంతం చేయటం సాంఘిక బాధ్యత. ఈ బాధ్యత తీసుకోకుండా కబుర్లు చెప్పే వాళ్లంతా ఆషాఢ భూతులు. కుహనా అభ్యుదయ వాదులు. సమాజంలో ఏవో కొన్ని విషయాలు మారటంవలన, సంస్కరించటంవలన విప్లవంరాదు. నేడు అమలులోవున్న సమాజం మొత్తం సమగ్రమైన మార్పును కోరుతున్నది. తిరోగామి భావాల, సంస్కృతుల ఛాయలు రేఖామాత్రంగా కూడా లేకుండా నిర్మూలించటమే నేటి ప్రజల కర్తవ్యం. సాంఘిక విప్లవానికి రంగస్థలంగా. దోహదవంతమైన చైతన్య శక్తిగా సాంస్కృతిక విప్లవం అవసరమవుతుంది. కాబట్టి భావవిప్లవం అంటే సమాజంలో అనేక కారణాలవల్ల పేరుకపోయిన, ప్రచారంలో వున్న తప్పుడు భావాలను చెడ్డ సాంప్రదాయాలను అశాస్త్రీయ సిద్ధాంతాలను సహేతుకంగా ఖండించి విప్లవ భావాలను ప్రతిపాదించి ప్రజల్ని విద్యావంతుల్ని చేయటమే: ఈ కర్తవ్యం రచయితలు, విద్యార్థులు స్వీకరించాలి.

భావ విప్లవం అంటే స్పష్టమైన అవగాహన కలగటానికి భావాల స్వరూపం శాస్త్రీయంగా గ్రహించాలి. ఈ విషయంలో బూర్జువా మేధావులు, భావవాద సిద్ధాంత కేసరులు, పీఠాధిపతులు, ఉద్రిక్తయువకులు విశ్వవిద్యాలయ పండితులు, నాస్తికవాదులు,

మానవతావాదులు, అపరిణీత శాస్త్రవిజ్ఞానులు. ఆచరణస్పర్శలేని ఆదర్శప్రచారకులు ఎన్నో సిద్ధాంతాలను, తప్పుడు అభిప్రాయాలను ప్రచారం చేస్తుంటారు. వీళ్ళ విష వలయంలో పడకుండా అనవసర చమత్కారాలు పోకుండా సూటిగా స్పష్టంగా అవగాహనను పెంచుకోవాలి. అవగాహనలో లోపమే ఆచరణలో అవాంఛనీయస్థితికి దారి తీస్తుంది.

భావమంటే మనోవికారమని ప్రాచీన పండితులు చెపుతారు. స్వచ్ఛంగా, అద్దంలా వున్న మనస్సులో మెదిలేది భావమంటారు. నిజానికి భావరహితంగా శూన్యంగా వుండటం మనస్సుకు సహజలక్షణం కాదు, ఇందులో భావానికి ఆధారశక్తి ఏదో చెప్పడంకూడ జరుగలేదు. మొత్తంమీద భావవాదులందరూ మనిషి లోపలినుండి భావాలు పుడతాయని సిద్ధాంతం చేశారు. వేదాలను ఋషులు సమాధిలో దర్శించారని ఘంటాపథంగా చెప్పారు. ఏకాగ్రచిత్తంతో, తనలోకిచూస్తూ వైదికసత్యాలను లోకానికి ప్రకటించారని ప్రచారం చేశారు. ఈ అభిప్రాయంలో ఏమాత్రం నిజంలేదు. మనిషి అంతర జగత్తునుంచీ, ఇతరశక్తులతో సంబంధంలేకుండా భావాలు ముసురుకొనిరావడం అసాధ్యం. అల్లాగే భావాలు ఆకాశపు అంచులనుండీ రాలిపడతాయని చెప్పేవాళ్లు కూడా వుంటారు. భౌతిక ఆధారాలు చూపించకుండా వీళ్లుచేసే సిద్ధాంతాలన్నీ వ్యక్తివాదాన్ని ఆశ్రయించి వుంటాయి. ఒక రచయిత రాసిన కళారూపం మరొకడికి అర్థం అవుతోంది. అంటే దానికి కారణం ఇద్దరికీ సమానమైన భౌతిక ఆధారాలు వున్నట్లే. లేకపోతే ఒకడు రాసింది మరొకడికి అర్థం కావడానికి అవకాశమేలేదు, ఈ విధమైన అశాస్త్రీయతత్త్వాల ప్రచారాన్ని తప్పుడు భావ ప్రచారాన్ని విప్లవవాదులు తప్పనిసరిగ ఎదుర్కోవాలి.

భావాలు వ్యాప్తి కావడానికి సంఘమే కారణం. మంచిభావాలు, తప్పుడు భావాలుకూడ సాంఘిక జీవితంనుంచే పుట్టుకొస్తాయి. సాంఘిక ఆచరణద్వారా మాత్రమే మంచి భావాలు ఏర్పడతాయి. ఈ సాంఘిక ఆచరణ మానవుల్లో మూడువిధాలుగా వుంటుంది, ఉత్పత్తికోసం పోరాటం. వర్గసంఘర్షణ, శాస్త్రజ్ఞాన ప్రయోగం ఇటువంటి స్పష్టమైన సాంఘిక జీవితమే మనిషి ఆలోచనా విధానాన్ని నిర్ణయిస్తుంది పురోగామి వర్గలక్షణాలయిన మంచి భావాలను ప్రజలు అవగాహన చేసుకుంటే అవే భౌతికశక్తులుగా పరివర్తన చెందుతాయి, ఈ భౌతిక శక్తులవల్లనే సంఘం మారుతుంది. కాబట్టి ఏ భావము భౌతికశక్తిగా పరివర్తన చెందుతుందో అదే ప్రపంచాన్ని మారుస్తుంది.

అప్లే మార్పుకు తోడ్పడే ఆ భావమే విప్లవభావము. ఈ భావదృష్టిని అనేక విధాలుగా ప్రచారంచేసి తిరోగామిశక్తుల్ని నిర్మూలించటమే భావవిప్లవం అంటారు.

సాంఘిక ఆచరణలో ప్రజలు అనేకరకాల పోరాటాల్లో పాల్గొంటారు. విజయాలవల్ల పరాజయాలవల్ల అనంతమైన అనుభవాలు పొందుతారు. ఈ అనుభవాలన్నిటికీ మనుష్యేతరమైన ప్రపంచమే కారణం. బాహ్య ప్రపంచంలోని అసంఖ్యాక దృశ్యాలు పంచేంద్రియాల ద్వారా మనిషి మనస్సులో ప్రతిబింబిస్తాయి. మొదటిజ్ఞానం ప్రత్యక్షజ్ఞానమే. దృశ్యప్రపంచాన్ని పంచేద్రియాలు గ్రహించడమే ప్రాథమికజ్ఞానం ఈరకం జ్ఞానం కావలసినంత. అవసరమయినంత మేరకు సంపాదిస్తే భావాలరూపంలో ఘనీభవిస్తుంది. అంటే వ్యక్తిచుటూవున్న ప్రపంచం పంచేంద్రియాలద్వారా మనస్సులో ప్రతిబింబించి క్రమంగా భావాల రూపంలోకి మారుతుంది. ఇదే అవగాహనలో, భావాలు ఏర్పడటంలో ప్రథమ సోపానం. ఈదశే బాహ్యపదార్థం వ్యక్తిచైతన్యంగా రూపొందటానికి దోహదంచేసే శక్తి. కేవల అస్తిత్వం భావమయ వ్యక్తిత్వంగా మారటం, ఎదగటం ఆరంభమవుతుంది. ఈవిధంగా ఏర్పడిన ఒకవి చైతన్యం లేదా భావజాలం సరియైనదో కాదో ఈదశలో నిర్ణయించటానికి అవకాశంలేదు. బాహ్యపదార్థ వాస్తవికత సరిగ్గా ప్రతిబింబించిందో లేదో నిర్ణయించటానికి ఈదశలో సాధ్యంకాదు. ఏర్పడిన భావాలు తప్పుడువో, మంచివో స్థిరీకరించటానికి గూడ ఈదశ ప్రమాణం కాజాలదు.

అవగాహనా మార్గంలో భావాలను ఏర్పరచుకునే పథంలో రెండవదశ సహజంగానే ఆరంభమవుతుంది. ప్రథమదశను శాస్త్రీయమైన పరీక్షకు గురిచేయటమే దీనిలక్ష్యం. చైతన్యం నుంచి పదార్థానికి. భావజాలము నుంచి నగ్న అస్తిత్వానికి పోయి సాంఘిక ఆచరణతో ప్రయోగం చేయాలి. దీనివల్లనే సిద్ధాంతాలు, విధానాలు ప్రణాళికలు సరియైనవో కావో నిర్ణయం జరుగుతుంది. సాధారణంగా సాంఘిక ఆచరణలో సఫలమైన వాటిని శాస్త్రీయమైనవిగ, విఫలమయినవి తప్పుడు దృక్పథాలుగా పరిగణించవలసి ఉంటుంది. ముఖ్యంగా ఈ విధానం ప్రకృతితో మనిషిచేసే పోరాటంలో తిరుగులేని సాధనం. కాని సాంఘిక పోరాటంలో పురోగామి వర్గాలకు ప్రాతినిధ్యం వహించే శక్తులు, తిరోగామి శక్తులతో సమానమయిన బలం లేనప్పుడు పరాజయం పొందవచ్చును. అంతమాత్రాన సరియైన భావాలు, విప్లవాత్మక చైతన్యం చెడ్డవిగా, పనికిమాలినదిగా నిర్ణయించకూడదు. తిరోగామి భావాలకున్న శక్తి ఎక్కువ కావడంవల్ల శాస్త్రీయమయిన శక్తులకు తాత్కాలికంగా ఓటమి సంభవించవచ్చును. పురాతనశక్తులు తాత్త్వికంగా ఎంత బలహీనమయినా ఆత్మరక్షణకు అవినీతికరమయిన ప్రయత్నం

జరుగుతుంది. అధికారంలోవున్న భావాన్ని ఒకశక్తిని తుడిచిపెట్టటానికి పురోగామి శక్తులు బహుముఖాలుగా నిరంతర ప్రయత్నం చేయాలి అందుకనే సాంఘిక తాత్కాలిక అపజయాలు గణించదగ్గవి కావు. పద్ధతులు మార్చుకుంటూపోతే విజయం నిశ్చయంగా సాధించవచ్చు.

ఆచరణలో పరీక్షింప బడటంవల్ల మానవ విజ్ఞానం మరొక ఉన్నతదశకు ఉరకలువేస్తుంది. పూర్వపు దశకంటే ఇది మరీ ముఖ్యమయినది. బాహ్య ప్రపంచ వాస్తవికతను ప్రతిఫలింప చేసుకోవడం ద్వారా మొదటి దశలో ఏర్పడిన భావాల, సిద్ధాంతాల మంచి చెడ్డలను నిరూపిస్తుంది. అందుకనే ఈ రెండవ సోపానం ముఖ్యమవుతున్నది. ప్రాథమికంగా అందరిలోనూ ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండానే దృశ్య ప్రపంచం ప్రతిబింబించక తప్పదు. ఆ ప్రతిబింబ భావజాలం శాస్త్రీయమై పురోగామి శక్తులై చైతన్యంగా రూపు దిద్దుకోవాలంటే సాంఘిక పోరాటమే ఆధారం. నిజాన్ని పరీక్షించటానికి ఇదితప్ప వేరే గత్యంతరంలేదు

ప్రజలంటే ఎవరు? ఎవరికి చైతన్యంవుందోవారే ప్రజలు. చారిత్రికతత్వాన్ని బట్టి ఈ విషయాన్ని నిర్ణయిస్తాము. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్థిక. సాంఘిక సాంస్కృతిక స్వేచ్ఛకోసం ఎవరు పోరాటాలు జరిపారో వారే ప్రజలు. ఇప్పుడు వర్గ రహిత సమాజాన్ని సాధించటానికి ఉద్యమిస్తున్న శ్రామిక సందోహమే ప్రజలు. మతవాదులు, మితవాదులు యథాస్థితివాదులు ప్రజలు అనే పేరుతో పిలువటానికి తగరు. ఈ ప్రజలు లేదా శ్రామికులు ప్రపంచాన్ని గురించి తెలుసుకోటానికి ప్రయోజనం ప్రపంచాన్ని మార్చటానికే. ఈమార్పే విప్లవం. ఈ విప్లవమే భావ విప్లవానికి ఏకైక ప్రయోజనం. పదార్థం నుంచి చైతన్యానికి, చైతన్యం నుంచి పదార్థానికి అనేకసారులు తిరిగి తిరిగి ప్రయోగం చేయటంవలన మంచి భావాన్ని నిర్ణయింపవచ్చు ఆచరణ నుంచి జ్ఞానం. జ్ఞానంనుంచి ఆచరణ అనేకసార్లు పునరావృతం కావడం వలన శ్రామికుల మానసిక జీవితం విప్లవ భావపూరితం అవుతుంది. ఆచరణ సాధ్యం కానిది, ఆచరణను కోరనదీ ఎటువంటి జ్ఞానమయినా పచ్చిమోసం. గతితార్కిక భౌతికవాదజ్ఞాన సిద్ధాంతమే సాంస్కృతిక భావ విప్లవానికి శాస్త్రీయమైన సాధనం. చాలామంది అభ్యుదయ వాదులు ఆచరణలోను, భావాలను ప్రచారం చేయటంలోను గతితర్కాన్ని విస్మరిస్తున్నారు. ఏర్పడుతున్న భావాలకు ఆధారాలు తెలిస్తే బలం ఎక్కువ.

నిత్యజీవితంలో ప్రతిక్షణం జరుగుతున్న, అనుభూతి పొందుతున్న చైతన్యానికి పదార్థానికి సంబంధం గ్రహించలేక పోవటం చిత్తశుద్ధిలోనే లోపం అనాలి. ప్రజల ఆలోచనా సరళి బాగుపడాలన్నా, పరిశీలన, అనుభవాలను అర్థం చేసుకోవటం ఆటంకాలను అధిగమించడం సంభవించాలన్నా గతితర్కం సంస్కారంలోనే లీనం కావాలి. ఈ జ్ఞాన సిద్ధాంతాన్ని సాధనంగా చేసుకునే భావవిప్లవం తీసుకురావాలి. పీడితులను భావ విప్లవం ఏకంచేసి సాంఘిక విప్లవానికి పురోగమింప చేస్తుంది. ప్రజల మనస్సులో స్థిరమైన భావాల్లో మార్పులు రాకుండా సంఘంలో ఏ మార్పువచ్చినా అది తాత్కాలికమే.

(రాయలసీమ బై వీక్లీ సౌజన్యంతో)

రచయితలకు విజ్ఞప్తి

నాలుగు సంవత్సరాలుగా సృజనను ఆధునిక సాహిత్య వేదికగా నిర్మించుకోవడానికి మీరిచ్చిన సహకారానికి ధన్యవాదాలు, మీ ఈసహకారాన్ని యింకా వేగవంతం చేయవలసిందిగా కోరుతున్నాం.

త్రైమాసికకు వ్యవధిలో వున్న వ్యత్యాసం వంటిదే యీనాటి ఆధునిక సాహిత్యానికి 1966 నవంబర్‌లోని ఆధునిక సాహిత్యానికి వున్న తేడా. ఇప్పుడు మీ చేతుల్లో మీ సహకారంవల్లనే మాసపత్రిక మూడో సంచిక వున్నది,

ఈనాటి ప్రజావసరాలను గుర్తించే, ప్రజాసమస్యలను చిత్రించే రచనలు మీనుంచి కోరుతున్నాం. ముఖ్యంగా కవితలు, వ్యాసాలు, విమర్శలు. కథలు, ఏకాంకికలు జీవితంనుంచి వచ్చి జీవితానికి వెలుగు యిచ్చేవి కావాలని మనవి చేస్తున్నాం.

సృజన ప్రతినెల మొదటివారంలో వెలువడుతుంది. కాబట్టి రచయితలు వచ్చే సంచికకొరకు ముందునెల ఒకటో తేదీవరకే రచనలు పంపించాలి.

సంపాదకుడు, సృజన

కుందుర్తి-నగరంలో వాన

- కుమారి శిష్ట్లా శకుంతల

పదాల ఆడంబరంతో యిక ఎదగడం ఆగిపోయిన అభ్యుదయ కవిత్వాన్ని ఒక మలుపుతిప్పి కవిత్వాన్ని ముందుకు తీసుకుపోయిన కవులలో కుందుర్తి, బాల గంగాధరతిలక్‌లను ముందుగా పేర్కొనవలసి వుంటుంది. కేవలం ఆవేశప్రధానమైన గుణాన్నుంచి, పదాల ఆడంబరాన్నుంచి సామాన్యప్రజల అవగాహనా పరిధిలోకి కవిత్వాన్ని నడిపి, యిప్పటికీ నడుపుతూ అనేక యువకులకు మార్గదర్శకులుగా నిర్విరామ కృషి జరుపుతున్నారు కుందుర్తి. శ్రీశ్రీ బాటలోనడిచి ఆధునిక కవిత్వానికి ప్రజాదరణను లభింపచేయడంలోనూ, సామాన్యుని కవితావస్తువును చేయడంలోనూ శ్రీశ్రీ అనంతర కవులలో యితరులకన్న ఒకడుగు ముందుకే పోగలిగిన అభ్యుదయ మార్గావలంబి ఆయన. తెలంగాణాలో రాచరికపు సింహాసనం కింద, జమీందారుల పాదాల కింద నలిగిపోతున్న సామాన్యునిగూర్చి మొట్టమొదటిసారిగా వచనకవితలో "తెలంగాణా" అనే మహాకావ్యాన్ని వ్రాసి కవిత్వలక్ష్యాన్ని మరింత స్పష్టంగా చూపించారు కుందుర్తి. వారి యిటీవలికాలంలో వెలువడిన కావ్యమే ఈ 'నగరంలో వాన' ఆయన మాటల్లో చెప్పాలంటే నగరంలోవుంటూ కుందుర్తి మేఘం కురిపించిన వర్షధారలివి.

ఈ సంపుటిలో చిన్నచిన్న ఖండికలతోపాటుగా ఒక పెద్ద కావ్యంకూడావుంది. ఒకవ్యక్తి బాల్య, యౌవ్వన, వార్ధక్యదశలను వర్ణించి చెప్పిన సుదీర్ఘమైన కావ్యమిది. కథాకథన పద్ధతిలోసాగిన రచనయిది. 'తెలంగాణా' ద్వారా కవిత్వంలో ఒకసంపూర్ణమైన కావ్యత్వసృష్టికై కొత్తప్రయోగంచేసి, విమర్శకుల, పాఠకుల ఆదరాభిమానాలను పొందిన యీకవి మొదటినుంచీ కూడా వచనకవిత్వం కథాశ్రయ పద్ధతిని అవలంబించనిదే పరిపూర్ణంకాదని నమ్ముతూ వచ్చారు. వారి యీధోరణికి యిది వుదాహరణ.

కవిత్వం సామాన్యునికి అందుబాటులో వుండాలని ప్రతీ ఆధునిక కవీచెప్తున్నప్పటికీ వ్రాతలోకి వచ్చేసరికి ఆ విషయాన్ని అత్యధికులు విస్మరిస్తున్నారు. అర్థం కాని ఇమేజరీలనూ ఇంగ్లీషు వుర్దూపదాల సర్కసుఫీట్లనోచేసి ఆధునికంగా వ్రాస్తున్నామని నిరూపించుకున్నారేగాని, ఆధునిక కవితాలక్షణాన్ని చూపించలేకపోతున్నారు.

కుందుర్తి కవితలో యీ రెండులోపాలూ కనిపించవు. భావకవిత్వపు అందమైన గ్రాంథిక పదాలమోజు యీ కవికిలేదు. వాక్యాన్ని తేలిగ్గాచెప్పడం యీ కవిలోని ప్రత్యేకత.

"నగరంలో కురిసే వానకు తెలుసు
పలకా పుస్తకాలు నెత్తినబెట్టుకొని
పరుగెత్తే బడి పిల్లవాడు
కాలుజారి బురదలో పడినా,
కారుచక్రాలు మురికి చిమ్మినా
వాళ్ళమ్మ వాణ్ణి అరుస్తుందని"

—ఇంత తేలిగ్గా, అతిమామూలు మనిషికికూడా అర్థమయ్యేటట్లు రాయడం ఆధునిక కవుల్లో కుందుర్తికి తెలిసినట్లు మరొకరికి తెలియదంటే అతిశయోక్తికాదు. వాక్యం అతిసరళంగా సాగుతుంది. గ్రాంధికపదాల బరువువుండదు, సంస్కృత సమాసాల ఆడంబరంగానీ, ఇంగ్లీషు పదాలమోజుగానీవుండవు, ఇందులో ఏదోభావం దాగివుండితీరాలి- అని మన అజ్ఞానంమీద ఎక్స్‌పెరిమెంట్‌లాటి ఆడంబరం, ఆధిక్యతా లేకుండా చదవగానే సూటిగా తెలిసేభావం. ఇంతకన్న సింపుల్‌గా చెప్పడం యిక సాధ్యం కాదనిపించే గుణం. ఇవన్నీ యీయన కవిత్వంలో కనిపిస్తాయి.

ఉదాహరణకి —

మూడునాళ్ళ పసిపాపను
ముద్దుగా ఒడిలో గుండెల కద్దుకుంటూ
వెచ్చగా, ఆస్పత్రినించి వచ్చిగా యింటికివెళ్ళే
పచ్చి బాలెంతరాలి మీద
పూలజల్లు పడుతుందిగాని
ఘోరున వర్షం కురవదు —

అనే భావాన్ని అంతకన్న తేలిగ్గా చెప్పడం సాధ్యంకాదనే నా అభిప్రాయం. ఇటువంటి లక్షణం ఏ ఒకటో అరో ఖండికల్లోనేగాక పుస్తకం అంతటా కనిపిస్తాయి. ఇది యీకవిలోని ప్రత్యేకత.

కుందుర్తి కవితలోని మరో ముఖ్యమైన లక్షణం— చక్కటి వుపమానాలు విరివిగా వుండడం. నిత్యమూ మనకు మన జీవితంలో తారసపడే అతిసామాన్య వస్తువుతో ఉపమానించి, భావాన్ని మరింత విపరంగా చెప్పడానికి యీకవి ప్రయత్నిస్తారు. మనకళ్ళ ముందున్న వస్తువునే తీసుకుని పోల్చిచెప్తారీయన.

కొండెక్క బోతున్న దీపంలా
కునికిపాట్లు పడుతున్నది జీవితం
—అని అన్నా
ప్రత్యుత్తరం సాధించలేని ప్రేమలేఖలా
జీవితం చిక్కాగా వుంది

—అని అన్నా కవి చమత్కృతి మాత్రమేగాక భావాన్ని మరింత స్పష్టంగా చెప్పాలనే ధోరణికూడా ఈ వుపమానాల్లో కనిపిస్తుంది.

నెహూ్రు మరణవార్తవిన్న ఒకసామాన్యుడ్ని గురించిరాస్తూ
చింతచెట్టు చిటారు కొమ్మెక్కి
ఉరుకులు పెడుతున్న చారల ఉడత
హఠాత్తుగా కాలుజారి భూమ్మీద పడినట్లు
సామాన్యుడు చతికిలబడ్డాడు
ఎక్కడి వాడక్కడ.

మరొకచోట—
నింగి నీలం కుర్చీమీద
నెల బాలుణ్ని కూచోబెట్టి
చల్లిన రేగుబండ్లు చెల్లాచెదరైనట్లు
తళతళా దొర్లుతున్నాయి తారలు

ఇలా పోలికను కొత్తగా చెప్పడం మాత్రమేగాక దృశ్యాన్ని కళ్ళముందుకు రప్పించడంలో ఉపమానాన్ని యీకవి ఒక వుపకరణంగా వాడుకున్నారు.

కుందుర్తి కవితలో అక్కడక్కడ చిత్రకవిత్వమూ కనిపిస్తుంది. అయితే చాలా మందిలాగ పదాలను గారడీచేసో, ఏమాటమీదో శ్లేషను వుపయోగించో నవ్వు తెప్పించే రచనకాక, భావంద్వారా హృదయానికి గిలిగింతలు పెట్టారీయన. ఈవిధమైన భావప్రకటన సమర్థుడైన కవికితప్ప సామాన్యులకు సాధ్యంకాదు.

జాతీయ రక్షణనిధికి ఉంగరం పంపిన ఓవ్యక్తినిగూర్చి చెప్తూ—

ఉంగరంలోని ప్రేయసిని
హృదయంలోకి మార్చేసుకుని

విరాళం తులం పంపాడు
విజయవాడ ప్రేమికు డొకడు.

అన్న కవి వాక్యాలను చదివినప్పుడు చిరునవ్వు పెదాలమీద గిలిగింతలు పెడ్తుంది.

పిలిస్తేగాని పలకని భీరువుభార్య నిన్న
ఇవ్వాళ గడుసరిగావచ్చి అదీయిదీ అడుగుతుంది
రేపు కొడుకునో కూతురినో చూపి
సర్వాధికారం చెలాయిస్తుంది.

ఇటువంటిదే మరోటి—

అయ్యవారు పెట్టిన నైవేద్యం చాలక
ఆకలేసింది కాబోలు
తెల్లవారి చూచేసరికి
దేవుడే నూనె తాగేశాడు.

ఇంత చక్కగా భావంతో హాస్యాన్ని సృష్టించటం కుందుర్తి ప్రత్యేకతల్లో మరొకటి. విషయాన్ని సీరియస్‌గా చెప్పడంతోపాటు సరదాగా, హాస్యంగా చెప్పడం కూడా యీ కావ్యంలోని అనేక ఖండికల్లో కనిపిస్తుంది.

'నగరంలో వాన' కావ్యంలోని కవితలకీ, ఈకవి వ్రాసిన యింతకుముందు కవితలకీ చాలాతేడా కనిపిస్తుంది. లోగడ వీరు వ్రాసిన తెలంగాణా కావ్యంలో కనిపించే వుద్రేకంగాని, కసిగాని కనిపించక చింతన, మానసిక సంఘర్షణ యీ కావ్యంలో కనిపిస్తాయి. ఈకవి అంతర్ముఖుడై "నేను నేనుగా కనిపించాలని పూనిక మనసులో పెంచి" వ్రాసిన రచనలే చాలావరకు. అనుభవంచేతా, అవలోకనచేతా జీవితాన్ని సమగ్రంగా దర్శించడం యీ ఖండికల్లో కనిపిస్తుంది. కేవలం ఆవేశ ప్రధానమైన అరుపులవల్ల కవిత్వంద్వారా సాధించేది ఏమీ వుండదని సంయమనంతో ప్రవర్తించినప్పుడే దేనికైనా అవగాహన చేసుకుని ప్రయోజనకరంగా సాధించవచ్చునని యీకవి తెలుసుకున్నట్టు అర్థమౌతుంది.

"బడిలో చెప్పని చదువు బ్రతుకుతూ బాధతోనేర్చి
బాధ అని ఆదిలో అనుకున్నది బ్రహ్మానంద పదవిగాతోచి

చేసుకుంటే పూలబాటే జీవితమనిచాటే పని
ఎండిపోయిన మెదడు వనిలో తెలివిమొక్కలు నాటేపని

—ఈకవి అనుభవంతో అలవర్చుకున్నారు.

కాస్సేపు వెలుగూ కాస్సేపు చీకటిచేసే
రెండునాల్కల నీతితో తనచుట్టూ తానేతిరిగే భూమికి
మరికొన్ని ఉపగ్రిహాలు తిప్పించి, దానికోపం తెప్పించి
మనసుతో నక్షత్ర కాంతిమండలంలో ప్రవేశించి
అనంతకోటి వెలుగు సంవత్సరాల ఆయుర్దాయం పోసుకుని
అక్కడి కల్పవృక్షాలు పండిన అమృతపుటూహలు కోసుకుని
కాలంతో జీవించడం —

—ఈకవి నేర్చుకోవడంవల్లనే వెనుకటి ఆవేశాన్ని వొదులుకుని ఆలోచనని పెంచుకున్న ఛాయలు ఈ ఖండికల్లో కనిపిస్తున్నాయి. జీవితంమీదా, జీవన స్థితి గతులమీదా కుందుర్తి విరివిగా నిర్వచనాలు చెప్పారు. జీవితాన్నిగూర్చి —

"ఇంటిముందు వేపచెట్టు
కొంచెం నీడ యిస్తుందికాని
తనలాగే జీవితం కూడా
చేదని జ్ఞాపకం చేస్తుంది."

కాలంమీద కవిచేసిన నిర్వచనం —

చిత్రంగా వుంటుంది కాలంతీరు
రంకుల రాట్నంమీద గుర్రపు స్వారీలాగ
క్షణిక సుఖభ్రాంతమైన జీవితార్థి అంచులమీద
తెప్పగా తేలిపోతుంటుంది కాలం."

"నగరంలో వాన" పుస్తకం మొత్తంమీద తలమానికం అనిపించే రచన ఆపేరుమీదవున్న ఖండికే. బహుశా యిందుకేనేమో యీపుస్తకానికి యీపేరుపెట్టారు. మరోముఖ్యమైన కవిత కోటేశ్వర్రావును గూర్చి అజ్ఞాతశైశవం, ఆరంభ యవ్వనం, అసమర్థ కౌమారం, అవసాన వార్థక్యం అన్న పేర్లతో వ్రాసిన సుదీర్ఘమైన కథాత్మక కావ్యం. ఇందులో మనిషి ఆయాదశలలోని మనస్తత్వాన్ని, చుట్టూచేరే పరిస్థితులను చాలా చక్కగా కళ్లకు కట్టినట్లు చూపించారు. అయితే కుందుర్తి కవిత్వంలో సాధార

ణంగా తొంగిచూసే ఆశావాదం యిందులోలేదు. ఒకనాడు పరమనాస్తికుడిగా, సంఘాన్ని మార్చదలచిన మహావీరుడుగా, విప్లవభావాల పల్లకీమీద వూరేగిన వుత్సాహవంతుడిగా వున్న కోటేశ్వర్రావును పరిస్థితుల పేర్లుచెప్పి దేవుడికి నమ్మినబంటుగా, కాలపు ఉక్కు పంజరంలో కట్టబడిన రామచిలుకగా చూపించడం కుందుర్తివంటి అభ్యుదయవాదికి తగదు. తెలంగాణా లాంటి కావ్యాన్ని వ్రాసిన కుందుర్తేనా యిలా నిరాశను వ్యక్తపరుస్తున్నదవి అనిపించక మానదు.

ప్రజాస్వామిక పేదరాజుల భారాన్ని సగంమోస్తూ, అనధికార హోదాలో మంత్రిగా సలహాల గీతాలురాస్తూ కష్టాలు క్రమంగా గడచి ప్రజలంతా ముందుకుపడిచే భూలోక స్వర్గానికిముందుగా ద్వారాలుతెరుస్తూ ఆశతో కవిత్వ్రవాస్తానని "స్వాభినందన" లో చెప్పుకున్న విషయం కుందుర్తి మర్చిపోవడం ఆశ్చర్యమే.

కావ్యం వుదాత్తవస్తుగుణ ప్రధానంగా వుండాలనీ. చివరలో అది సందేశాత్మకంగా ముగియాలని కుందుర్తి భావిస్తారు. అయితే ఈ పుస్తకంలోని 'అముద్రిత కావ్యం'లో యీ సందేశంలేదు. కోటేశ్వర్రావు సమస్యలను ఎదుర్కోలేక మరణించడమే మేలు అని కవి తనంతతానుగా కల్పించుకుని చెప్తారు. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే చేవలేక, జీవితాన్ని అంతం చేసుకునేవారు ఎలాటి పిరికివారో, సమస్యను పరిష్కరించడం చేతగాక పాత్రలను చంపేసే రచయితకూడా అంత పిరికివాడు. ఈ విషయాన్ని కుందుర్తిగారు మర్చిపోవడం ఆశ్చర్యమే.

వచన కవితోద్యమాన్ని నడుపుతున్న నాయకుడిగా చెప్పదగ్గ కుందుర్తి "పండితులు తప్పుబట్టినా ప్రజలిచ్చే భాషలో, భగవంతుడు మెచ్చేభావాలు ప్రతిపాదిస్తున్నందుకు నన్ను నేను అభినందించుకుంటున్నాను" అని చెప్పుకున్న కుందుర్తి "సామాన్యుడికి దగ్గరచుట్టాన్ని, సంప్రదాయపు చెరువు తెగ్గొట్టిన ప్రమాదపు నీటి మట్టాన్ని" అని సగర్వంగా చెప్పుకున్న కుందుర్తి, సామాన్యునికి దూరంగాపారిపోయి, ప్రజల భాషకు అమడదూరానికి తప్పుకుని, "ఎదురు తిరిగి, నీరథము, సప్తవర్ణాలు" వంటి చంధోబద్ధమైన పద్యాలను యీపుస్తకంలో చేర్చడం హర్షించదగ్గ విషయంకాదు బహుశా తన పాండిత్యాన్ని ప్రదర్శించకోవడానికేనా కావచ్చు, ఛందోబద్ధ కవిత్వాన్ని రాయలేక వచనకవితను చేపట్టానని విమర్శకులు ఎక్కడ అనుకునిపోతారో అని భావించడంవల్ల కావచ్చు, పండితులచేత కూడా మెప్పుపొందితేగాని తన గొప్పతనం విలువ పెరగదని అభిప్రాయపడుటవల్లనే కావచ్చుకాని యీ అభిప్రాయం తప్పని కుందుర్తి

గుర్తించటం అవసరం. తన ఆనందానికికాక సమాజప్రజలకై కవిత్వాన్ని రచిస్తున్నానని చెప్పుకొనే కుందుర్తి యీసత్యాన్ని విస్మరించటానికి వీల్లేదు. వచనకవిత వుద్యమనాయకుడిగావున్న తాను ఛందోబద్ధ కవిత్వంలో కూడా సిద్ధహస్తుడనేనని నిరూపించుకుంటేగాని, పండితులు ఆమోదించరని కుందుర్తి భయపడవలసిన పనిలేదు. ఎందుకంటే పద్యాన్ని హృద్యంగా వ్రాయగల కవులు అనేకులు యీనాడు పద్యాన్ని వొదిలిపెట్టి వచనకవితనే రాస్తున్నారు.

ముందు ముందు యీసిద్ధాంతపరమైన అంశాన్ని కుందుర్తి విస్మరించక, కవిత్వాన్ని రచిస్తారని ఆశిద్దాం.

నీ జీవితం వృధాపోలేదని తెలుసుకుంటే నువ్వెంత ఆనందపడతావు. ప్రజలకి సేవచేయగలిగినందుకు, నీజీవితం ప్రజలకి అంకితమైనందుకు మహదానందం కలుగుతుంది. అట్టి ఆనందం ప్రతిఒక్కరికీ కలగాలని నేను కోరుతాను.

లోకంలోని సత్పురుషులంతా నిన్ను నలిపివేయడానికీ బురదలో తొక్కి నామరూపాలులేకుండా చేయడానికీ నిరంతరం కృషిచేస్తూనేవుంటారు. అంచేత ఒక్కక్షణమైనా ఏమరివుండకు. వాళ్ల ఆశయాల్ని ఫలించకుండా చేయడంలో అప్రమత్తుడవై పనిచేయి. నీకుతప్పక జయంలభిస్తుంది.

— మాగ్జిం గోర్కీ.

ఝూఁ పాల్ సార్త్రె - పీపుల్స్ కాజ్

1970 జూన్ మొదటివారంలో ప్యారిస్ నగరాన్ని తీవ్రమైన విద్యార్థుల ప్రదర్శనలు ఊపేసినవి. వాళ్లు యీసారి సారబన్ విశ్వవిద్యాలయాన్ని కాక, Ile de la cite మీది బ్లాకులకు కొంచెం దూరంగావున్న క్రిక్కిరిసిన చిన్న కోర్టుగదిని గురి చేసుకున్నారు. ఫ్రెంచి ప్రభుత్వం మావోయిస్టు ధోరణిగల వామపక్ష శ్రామికోద్యమాన్ని (Proletarian Left Movement) నిషేధించి ఆ ఉద్యమ పత్రిక అయిన La Cause du Peuple (పీపుల్స్ కాజ్) సంపాదకు లిద్దరిని అరెస్టుచేయడం యీ విద్యార్థుల కోపానికి ట్రిగర్ నొక్కింది. వేలకొద్ది వామపక్ష యువకులు కోర్టుముందర గుమిగూడి నినాదాలు, గీతాలు ఆలపిస్తే వారికంటే ఎక్కువసంఖ్యలో సాయుధులయిన పోలీసులువచ్చి వారిని తరిమేసారు. కోర్టులోపల మాత్రం ఎస్టాబ్లిష్‌మెంట్ అధికార విధానాలకు, వామపక్ష భావాలకు మధ్య వాగ్యుద్ధం సాగుతూనేవున్నది. La Cause ప్రస్తుత సంపాదకుడు, అస్తిత్వవాద (Existentialism) మూల పురుషుడు, నోబెల్ బహుమతిని తిరస్కరించిన సాహిత్యవేత్త ఝూఁపాల్‌సార్త్రె తనకన్నా ముందు సంపాదకులను సమర్థించడానికి లేచినపుడు యీచర్చ ఒక కొత్తమలుపు తిరిగింది 'ఇది ఒట్టి స్కాండల్' అన్నాడాయన. 'కోర్టు చర్యలు అసంపూర్ణంగా వున్నాయి. La Cause du Peuple కు ముగ్గురు సంపాదకులు. దానికి ముగ్గురూ బాధ్యత వహిస్తారు. ఆ పత్రిక నడిపినందుకే మొదటి యిద్దరినీ నేరస్తులుగా విచారిస్తున్నారు. నన్నెందుకు వేరుగా చూస్తున్నారు. వాళ్ళుచేసిన పనే నేను చేసినా నన్ను నేరస్తునిగా ఆరోపించడం లేదు.' ఎందుకు అన్నది సార్త్రెవాదన. కాని జడ్జ్ సార్త్రెమాట వినదల్చుకోలేదు. అంతేకాకుండా ప్యారిస్‌లో ఆ సంవత్సరం చాల సంచలనాత్మకమైన ట్రియల్‌గా భావించబడ్డ యీకేసులో ఆ యిద్దరినీ దోషులుగా నిర్ణయించాడు. La Cause మొదటి సంపాదకుడయిన 32 ఏళ్ల Jean-Pierre Le dantec కు 12నెలలు, ఆయన తరువాత సంపాదకుడయిన 32 ఏళ్ళ Michel Le bris కు 8 నెలలు శిక్షవేసాడు.

ఫ్రెంచి ప్రభుత్వానికి, ఆ ప్రభుత్వాన్ని కూలదోయడానికి యత్నిస్తున్న కొత్తతరం విప్లవ పత్రికలకు 4 నెలలుగా సాగిన యుద్ధంలో 900 మందికి పైగా అరెస్టు అయ్యారు. ఈచర్య వాటికి పరాకాష్ఠ.

1968 మే చివరి రోజుల్లో అకస్మాత్తుగా లెఫ్ట్ బ్యాంక్ వెంబడి వందలాది మావోయిస్టు, ట్రాట్స్కీయైట్, అనార్కిస్టు పబ్లికేషన్‌లు విచ్చుకున్నాయి. కాని విప్లవం ఎంత తొందరగా చల్లారిందో వీనిలో చాల అట్లాగే ఆరిపోయాయి. పోగా మిగిలిన 80 పైగా ప్రచురణలలో La Cause du Peuple ఇరవైవేల కాపీలు అమ్మేది. రెండేళ్ల కింద ద్వైమాస పత్రికగా యిది ప్రారంభమయింది. రహస్య పత్రికలకు సర్క్యులేషనూ, చదువరులూ తక్కువా, ప్రభుత్వ నిర్బంధం ఎక్కువా వుంటాయి. ఇప్పుడు ఫ్రాన్స్‌లో నిషేధింపబడ్డ యీ పత్రిక సంగతి మరీ విపరీతం. చదవటానికి కాదు, జప్తుకావటానికేనేమో అది అచ్చయేది. ఇంకొక పత్రిక L' Idiot International నలభై వేల కాపీలు అమ్ముతుంది. ఇది ఫ్రాన్స్‌లోనేకాక బ్రిటన్, పశ్చిమ జర్మనీ, ఇటలీలోకూడ ప్రత్యేకమైన ఎడిషన్‌లు తెస్తుంది. ఈపత్రిక క్యాపిటలిజమ్‌మీద విమర్శలతో, బ్లాక్ ప్యాంథర్, ఉమెన్స్ లిబరేషన్ గ్రూపులపట్ల సానుభూతితో నిండివుంటుంది. "మావోయిస్టు వర్గాలన్నీ మా పత్రికను తమ పత్రికే అనుకుంటాయి. కాని మా కటువంటి సంప్రదాయం కాని, వ్యక్తిగత నిర్ణయాలుకాని లేవు" అంటాడు దీని సంపాదకుడు Hallier.

La Cause మాత్రం స్పష్టంగా మావోయిస్టు ధోరణిగల పత్రిక. 'పత్రివారూ గెరిల్లాలుగా చేరండి' లాంటి శీర్షికలలో, మంటల్లాంటి విజ్ఞప్తులతో, సాహిత్య విలువలకన్న "ప్రజలు అర్థం చేసుకునే భాషలోనే యిది రాయబడుతుంది." ఈపత్రిక మిల్లు కార్మికులను యంత్రాలను ధ్వంసం చేయమని కోరుతుంది. విమానాలను ఎట్లా కూల్చాలో, వీధుల్లోయుద్ధం ఎట్లా నడపాలో చెబుతుంది. కోర్టులో Le dantec ఫ్రెంచి రిపబ్లిక్‌ను రెండో ప్రపంచయుద్ధంలో నాజీలతో పోల్చాడు. '1940-45 మధ్యన విదేశీ క్యాపిటలిస్టుల కింద జరిగిన దోపిడీకీ, యివ్వాళ ఫ్రెంచి క్యాపిటలిజం కింద జరుగుతున్న దోపిడీకీ— మార్క్సిస్టు దృష్టిలో, భేదంలేదు' అని మ్రాన్పడిపోయిన జడ్జితో ఆయనన్నాడు.

65 ఏండ్లు నిండిన సార్త్రి జూన్‌లో ఆయన మావోయిస్టు మిత్రుల ప్రోద్బలంతో యీ పత్రికా సంపాదకత్వాన్ని చేపట్టాడు. తాను యీపత్రికా సంపాదకత్వాన్ని స్వీకరించటం ఆ పత్రికా విధానాన్ని సమర్థించటానికంటే, పత్రికా స్వాతంత్ర్యాన్ని సంరక్షించటానికే అంటాడు సార్త్రి ఆ పత్రిక తీవ్ర అతివాదంతో ఆయన చేరిపోకున్నా. ఆయన సంపాదకత్వంలో కూడ ఆ పత్రిక పోరాటాలు, ప్రదర్శనలు, సమ్మెల వార్తలను యథాతథంగా ఖచ్చితంగా యిస్తూనే వున్నది. అందుకే ఫ్రెంచి ప్రభుత్వం తనను అరెస్ట్ చేయడానికి సంశయిస్తే ఆగ్రహపడి "ప్రభుత్వం నన్ను విచారణ చేయాలనుకుంటే ఆ విచారణ రాజకీయ విచారణకాకుండా ఆపలేదు" అంటాడాయన.

1970 మేనెల నుంచి సి. ఐ. డి. పోలీసులు మాంటోమార్ట్ ప్రింటింగ్ ప్రెస్ మీద ప్రతి పదిహేను రోజులకూ దాడిచేస్తున్నారు. అక్కడ వారికి దొరికిన 'పీపుల్స్ కాజ్' పత్రిక ప్రతి కాపీని వశం చేసుకుంటున్నారు. కాని యీ ముసలాయన ముందే ఒక రహస్య ముద్రణాలయాన్ని చూసివుంచాడు. ఐదువేల కాపీలు ముద్రిస్తున్నాడు. ప్రచురించి వెలువరించే సమయానికి సార్త్రి, ఆయనతో ఆయన చిరకాల స్నేహితురాలు సైమన్ డి బవారె, జీన్‌గోడార్డ్, మాలే లాంటి ప్రఖ్యాత సినిమా నిర్మాతలు, యింకా కొందరు ప్రముఖులూ కలిసి పక్కనున్న సందుల్లోకి, బజార్లలోకి కాపీలను పంపించుతారు. అందరూ తీసుకొని చదవటం ఆరంభించగానే ప్రతివాళ్ళ చేతిలోని కాపీలను ప్రభుత్వ పోలీసులు వశం చేసుకుంటారు. ఈ ముఖ్యుల జోలికి మాత్రం పోరు. ఈ తతంగం అయాక సార్త్రి పత్రికా స్వాతంత్ర్యం అపహాస్యం చేయబడటాన్ని గురించి ఉపన్యాసాలు చెపుతాడు.

నవంబర్ మొదటి వారంలో సార్త్రి ఇంకో కొత్త ఎత్తువేసాడు. 'పీపుల్స్ కాజ్' పత్రికను మామూలుగా సోమవారం కాక శుక్రవారంనాడు బయటికి తెచ్చాడు. అలా జాగ్రత్తగా పంచగలిగాడు. పారిస్‌లో పేరొందిన అతివాద పత్రికల వాళ్ళూ, ప్రచురణకర్తలూ, పుస్తకాల షాపులవాళ్ళూ ప్రింటింగ్ ప్రెస్‌కే వెళ్ళి కాపీలు తెచ్చుకున్నారు. ఈ ఒకసారయినా పోలీసుల చేతుల్లోపడకుండా పత్రిక కాపీలన్నీ అమ్మకాని కెళ్లినయ్.

సార్త్రి యీపత్రికను చేపట్టడం ఫ్రెంచి ప్రభుత్వం దృష్టిలో, ఒక ఫ్రెంచి అధికారి చెప్పినట్లుగా "చాల పిరికిపని. తనకు జైలుకుపోవలసిన రిస్క్ లేదని సార్త్రికు తెలుసు. ఆయన వయస్సూ, ఆయనకున్న అంతర్జాతీయ ఖ్యాతీ దానికి కారణం." కాని యీ డబుల్ స్టాండర్డ్‌లను డీగాల్ బాగా సమర్థించుకున్నాడు. సార్త్రిను అరెస్ట్ చేయడం ఎంత వింతగా, అపహాస్యంగా వుంటుందో చెప్తూ 'వాల్టేర్‌ను ఎవరూ అరెస్ట్ చేయరు' అన్నాడు.

తనను అరెస్ట్ చేయకూడదన్న ప్రభుత్వ నిర్ణయం గురించి "నాకు శిక్ష వేయరు. అడగనూ అడగరు. కాని పత్రికా ప్రింటర్‌ని అవస్తలు పెడుతున్నారు." అని సార్త్రి ప్రభుత్వ పిరికితనాన్ని బట్టబయలుచేసాడు. సుప్రసిద్ధ దినపత్రిక Le Monde సార్త్రిను సమర్థించింది. "హింసనో, అహింసనో ఎంచుకొని, భవిష్యత్తు గురించి విపరీతమైన సందేహాలతో, నిస్పృహకు లోనయి చెలరేగిన వేలాది యువకుల"తో అతడు కదిలాడని రాసింది.

సార్త్రి బౌద్ధిక నిజాయితీని శంకించలేం. కాని La Cause పత్రికను ఊరికే చూచినప్పటికీ దానినిండా హింసను ప్రేరేపించే బజారుభాష కనిపిస్తుంది. అయినా సార్త్రి ఆ పత్రికను సమర్థిస్తాడు.

"ఈ పత్రిక శ్రామికులు యితర శ్రామికులకు చెప్పడానికి వుద్దేశించింది. అందుకని దీనిభాష తీవ్రంగావుంది. ప్రేరేపించబడినపుడు ప్రజలుచేసే ప్రతిహింస న్యాయమైంది. ఈనాడు హింస తన అవసరాన్ని తాను గుర్తిస్తున్నది." అంటాడు ఝాఁపాల్‌సార్త్రి.

[ఈ పరిచయానికి 8 జూన్ 1970 News Week, 16 నవంబర్ 1970 TIME ఆధారం.]

మేధావులు - విప్లవం

ఝూఁ పాల్ సార్త్రతో ఇంటర్వ్యూ.

ఆతివాద మేధావి అని ఏఅర్థంలో అంటాము?

అతివాద భావాలులేనిదే అతన్ని మేధావి అనేందుకు వీల్లేదని నా వుద్దేశం. పుస్తకాలు వ్యాసాలురాస్తూ మితవాదంలోవున్న వాళ్ళున్నారు. కాని మేధావి అని అనాలంటే మేధను ఉపయోగించటంవరకే చాలదు. విజ్ఞానులు సార్వత్రికతను సర్వ వ్యాప్త సత్యాలను గమనించగలిగే అవకాశాలను కల్పించి తీరాల్సివస్తున్నది బూర్జువా సమాజంలో. కాని అతనువాటిని సంకుచితమైన సిద్ధాంత రాజకీయపరిధికే అనువర్తించ వలసివస్తున్నది. ఈవైరుధ్యం యీనాటి పరిస్థితుల్లోవుంది. మానసికంగా సార్వత్రికత తెలుస్తుంది. కాని సంకుచితవర్గ రాజకీయ ప్రయోజనాలకే తనవిజ్ఞానం ఉపయోగ పడుతోంది. ఇదే వైరుధ్యం.

ఉదాహరణకు డాక్టరురక్తాన్ని సార్వత్రిక సత్యంగా అంతటా రక్తంతోవున్న సమాన లక్షణాలను చదువుతూ వుంటాడు. ఆరకంగా తన ఆలోచనాజ్ఞానంలో అంతర్భాగంగా జాతివివక్షను తోసిపారేస్తాడు. కాని యీజీవశాస్త్ర సర్వసత్యాన్ని బూర్జువా సమాజ ప్రయోజనాలకుపయోగపడేకోసం చదువుతుంటాడు.

వందేళ్ళ క్రితం 'నిష్పాక్షిక' శాస్త్రీయపరిశోధన అనే బూర్జువా భావానికి అర్థంవుండేది. ఇవాళ ప్రతిశాస్త్రీయ పరిశోధన ఒకరోజు వెనుకో ముందో ఆచరణలో పరిపాలకవర్గ ప్రయోజనాలకు వినియోగపడటానికే జర్గుతున్నది. దైనందిన ఆచరణకు కాని విజ్ఞానం శాస్త్రపరిశోధన అనేదిలేదు యివాళ. అమెరికాలో సాంఘిక శాస్త్రవేత్త యజమానుల కార్మికుల సంబంధాలకొరకు జరిపే అధ్యయనం వర్గపోరాటాన్ని మొద్దు బరుచడానికే. అలాగే అణుశాస్త్రం కూడా అత్యవసరంగా ఆచరణలో వినియోగానికే అనేది నేను వేరే చూపనక్కర్లేదు.

మేధావి పొందేది విశ్వజనీనమైన విద్య, విజ్ఞానం, కాని ఒకానొక సమాజం, ఒకానొకవర్గం వర్గసిద్ధాంతంలకు సంబంధంలోనే, ఆ వర్గసిద్ధాంతంలోనే బాల్యంనుంచీ

తనుపెంచబడ్డాడు. తప్పకుండా ఆ వర్గసిద్ధాంత ప్రయోజనం తను వ్యవహరించే సాంఘికమైన విశ్వజనీనతకు, విశ్వసౌభ్రాతృతకు విరుద్ధమైనది. పైగా తనకున్న ఆర్థికశక్తివల్ల పాలకవర్గాలు మేధావియొక్క స్థానాన్ని జీతాన్ని నిర్ణయిస్తూవుంటుంది అలా అతను పాలకవర్గంపైన ఆధారపడవలసిన వాడుగా వుంటున్నాడు.

కాబట్టి యీ సమాజకారణంగా ఒకే ప్రత్యేకతగల వ్యక్తి తయారవుతున్నాడు. చిన్నప్పటినుంచీ ఒక వర్గసిద్ధాంతం మూసలోపెరిగి, ఆ సిద్ధాంతం, ఆ బూర్జువాసిద్ధాంత విధానాలయిన వర్ణవివక్ష, ఒకరకపు సంకుచిత మానవతలకు రెండో ప్రక్క తనవిద్య విజ్ఞానాలయొక్క విశ్వాత్మకతలకు— యీరెంటి మధ్య వైరుధ్యాలలో వుండిపోవటాన్ని చూస్తాము.

అతనే ఏదో రాజీకిరాగల్గితే, వాస్తవాలనుండి దాక్కోగల్గితే, ఆ వైరుధ్యం అనిశ్చితస్థితి నుండి ఏ ఊగిసలాట ద్వారానో, ఏ నటనద్వారానో తప్పించుకోవటంలో జయప్రదం అయితే— అటువంటి వారిని నేను మేధావులు అని అనను. ఒక ఉద్యోగి అనో, బూర్జువా వర్గపు ప్రయోగశీల సిద్ధాంతకర్త అనో అనుకుంటాను. అతను బోధించిన ప్రత్యేకమైన సిద్ధాంతాలను, వర్గప్రయోజనాలను కాపాడుతున్నవాడు గనక అతను రచయిత అయినా గ్రంథకర్త అయినా అతన్ని మేధావి అని అనను.

అలాగాక అతను ఆవైరుధ్యాన్ని గమనించిన కారణంగా విశ్వాత్మకతకు అనుకూలంగా అతనిలోనూ అంతటానూవున్న ప్రత్యేకతకు పాలకవర్గ సిద్ధాంత ప్రయోజనంకు వ్యతిరేకంగా నిలబడితే అప్పుడు అతను మేధావి.

మేధావి అని నిర్వచించేందుకు ఏమిటి గీటురాయి?

మొదటిది అతని ఆలోచనా సరళి ఎలాటిది అని. అది హేతుబద్ధత, ఆచరణలోనూ, గతితర్కంగానూ జనించే హేతువాదమూ, హేతువాదపు విశ్వజనీనతకు వీటిని సమర్థించేవర్గాలు విషయంలోనూ మేధావికి సరైన సంబంధం కనిపించుతుంది. మార్క్స్ చూపినట్లుగా అన్నిట్లోకి ఎక్కువగా పీడితులయిన వర్గం, వర్గాలనూ వర్గమనే భావాలనే సమూలంగా నాశనంచేయాలి. సామాజికవిశ్వాన్ని సృష్టించటం చేయకుండా తననుతా బాగుచేసుకోలేదు అప్పుడు విశ్వసత్యం ఎక్కడో సైన్సు అనే మారుమూల బాధ్యతారహిత పరిధిలోకి తోసేయబడక మనుషుల చారిత్రిక సాంఘిక పరిధిలోకి కొనిరాబడుతుంది. మేధావి తన వైరుధ్యాల నష్టంచేసుకోవటంద్వారా పీడితవర్గాల తరఫున నిలబడతాడు. ఎందుకంటే విశ్వసత్యం వారితరఫునే వుందిగనక.

కాబట్టి మొదటిసంగతి- హేతువాదరాహిత్యాన్ని జయించాలి. క్రియాశీలతకు అవకాశంకలిగే సిద్ధాంత దూరదృష్టిని కల్గించుకోవటం ద్వారానే యిది సాధ్యమౌతుంది. తనలోని వివేచనద్వారా వర్గవిపక్షకు వ్యతిరేకత కల్గితే వర్గవివక్షకు గురవుతున్న వారి పక్షాన నిలబడతాడు. తనలోనూ యితరత్రానూవున్న వర్ణవివక్షను సహేతుకంగా విమర్శిస్తాడు. మేధావి కుండాల్సిన రెండవది– రాడికలిజం– మౌలికంగా తీవ్రంగా మార్పులను అభిలషించటం. అసంబద్ధమైన ప్రత్యేక పరిస్థితికీ న్యాయమైన విశ్వ సత్యానికీ మధ్య రాజీకుదరదు. ఆ పోరాటం కొనకంటా మౌలికంగా యీ ప్రత్యేక పరిస్థితి సర్వనాశనం కావలసిందే. విశ్వజనీనతకు, విశ్వసత్యానికి భయంకలిగేందుకు కొన్ని పార్టీలలో రాజకీయ గ్రూపులలో దేనిని ఎన్నుకోవాలని అతనికి సమస్యవచ్చినపుడు అన్నిట్లోకీ రాడికల్ గ్రూపునే మౌలిక తీవ్రమార్పులకొరకు పోరాడేపార్టీనే ఎన్నుకొంటాడు మేధావి.

కాని యీ తీవ్రవాదంవల్ల యిబ్బందులకు రిస్కులకు గురవుతాం. అందులో ఒకటి- అతితీవ్ర తీవ్రవాదం (ultra leftism). అప్పుడికప్పుడే అన్నీ జరిగిపోవాలనే తత్వం. కాని యీ ప్రమాదానికి లోనుకాకుండా మేధావిలో రెండులక్షణా లుంటాయ్.

ఒకటి– సత్యంద్వారానే మేధావి తనకార్య విధానానికి వచ్చేగుణం. ఉన్నపరిస్థితుల్లో సాధ్యం, కర్తవ్యం ఏది అనే ఆలోచన చేయటానికి సత్యం సత్యాన్వేషణ అతనికి వుంటయ్.

నిజంగా సాధ్యాసాధ్యాల వివేచనతో ఏదిదారి అని ఆలోచించటం అతితీవ్ర వాదానికి అతన్ని గురిచేయకుండా అదుపులోపెట్టే కళ్లేలలో ఒకటి. అందుకనే ఉదాహరణకు మేధావి అతితీవ్రవాదపు పెడదారిలో పడకపోతే బెల్జియంలోనూ ఫ్రాన్సులోనూ యిప్పటికిపుడే యీరోజే విప్లవం సాధ్యమని అధికారం హస్తగతం కొరకు తయారవాలని అనడు.

అతితీవ్రవాదానికి లోనుకాకుండా యింకో అదుపు– ఒక కొత్తవైరుధ్యం– విమర్శ, డిసిప్లిన్‌ల మధ్య వ్యతిరేకత. మేధావి రాజకీయ సంఘంలో సభ్యుడయినాక అందరిలాగానే యింకా ఎక్కువగా కూడా డిసిప్లిన్‌కు బద్ధుడవుతాడు. కాని తనగుణం వల్ల సహజంగా విమర్శనాశీలంగా వుంటాడు. (ఇది సోషలిస్టు సమాజాల్లో కూడా మేధావికి సమస్యే).

అతితీవ్రవాదానికి లోనుకాకుండా అదుపులోవుంచే యీరెండు హంశాలవల్ల రెండుకాల వైరుధ్యాల నెదుర్కొంటాడు మేధావి. మొదటివైరుధ్యం ముందుగా మనం చెప్పుకొన్నట్లు మేధావిగా మౌలిక, తీవ్రవాదిగా తయారుచేస్తుంది. రెండవవైరుధ్యం తనపార్టీకి తన సహజప్రకృతి అయిన విశ్వజనీనతకున్నూ. విశ్వజనీనతను తనపార్టీ అనుకూలంగాపట్టి డిసిప్లిన్‌ను మేధావి అంగీకరిస్తాడు కాని ఆదేసమయంలో మితవాదానికో, దీర్ఘకాల ప్రయోజనాలను విస్మరించటానికో ఎక్కడ దారిదీస్తుందో అని నిరంతరం జాగరూకతతో నిఘాతో వుంటాడు.

తర్వాత మళ్ళీ యింకో గ్రూపురావచ్చు విశ్వసత్యానికి ప్రాతినిధ్యం వహించేది, అపుడు సీరియస్‌గా ఆలోచించాలి. సుశిక్షితంగా యోచించి మొదటిపార్టీ తప్పులో వుంది అని నిర్ధారణకు వచ్చాకనే వున్నపార్టీనించి మారి కొత్తదానికి పోవాలి.

చైనీయుల రాజకీయాలగురించి మీ పొజిషన్ ఏమిటి?

వ్యక్తిగతంగా నేను చైనాకి అనుకూలంగాదు వ్యతిరేకంగాదు. మావోయిస్టును గాను, తద్వ్యతిరేకినీకాను. కారణం ఏమీలేదు. నాకు ఆవిషయంలో సరైన నిష్పాక్షిక పరిజ్ఞానం పొందే అవకాశం కలగలేదు. ఉద్రేకపూరిత స్టేట్‌మెంట్లూ. వ్యాఖ్యానాలూ చూచానుగాని వివరమైన ఎనాలిసిస్ నాకు కనిపించలేదు. కారణం మనకు సరైన సమాచారం లభ్యం కావటంలేదు. మనకొచ్చే వ్యాఖ్యలు వార్తలు వక్రీకరణలతో వుంటున్నయ్,

షాంగ్‌హైలో ఒక పోస్టరు– "రెడ్‌గార్డు ముక్కూ చెవులను కోస్తున్నది ప్రతిపక్షం" అని పాశ్చాత్యపత్రికలు దీన్ని ఎలా అనువదించి మనకు అందించినయ్, "చైనాలో చిత్రహింసలు" అని. ఇపుడు మనకుతెలిసిన దాన్నిబట్టి ఆమాటల అర్థం రెడ్‌గార్డులను వ్యతిరేకపక్షం అవమానపరచ ప్రయత్నిస్తున్నారని. ఆ పోస్టరువల్ల మనకు తెలియాల్సింది మహా అయితే షాంగైలో పోరాటం జరిగింది అని. పోరాటం హింసాయుతంగా రక్తసహితంగానా కాదా అనే సంగతికాదు, అలాగే పోమోనో అనే ఆయన వ్యాసం ప్రారంభాన్ని యీరకంగా అనువాదంచేసింది మనం చదివాం? "నేను బురదలో దొర్లాలనుకుంటున్నాను. నాపని అంతా శుద్ధదండగది. నేను బురదలో దొర్లుతున్నాను" కాని అది సరిగా అనువాదం చేయాలంటే ఏమిటి దాని అర్థం? "యీ నావయసులో కూడా మనిషిశారీరక శ్రమచేయటం అవసరం అని నాకర్థం అవుతుంది" ఇది ఆయన మాటల సరైన అనువాదం.

ఈ పరిస్థితుల్లో పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యానాలు నాకెదురవుతున్నయ్. సోవియట్‌లో నాకు చాలామంది మిత్రులున్నారు. వారు చైనాను నిజంగా చెడుగానే భావిస్తున్నారు. ఇంకో ప్రక్క చాలా గొప్పపొగడ్తలు వ్యాఖ్యానాలు చూస్తున్నాను. ఇలా పరిస్థితి క్షుణ్ణంగా అవగాహన గానిస్థితిలో నిర్ణయాలకు రావటం తొందరపాటు అవుతుందనుకుంటాను.

రష్యన్ విప్లవంలో నిజమైన రాడికలిజం లేకపోవటంతో యీ విషయంలో విమర్శనాత్మక జాగరూకత చూపటం మేధావిబాధ్యతకాదా?

మనకు రష్యాలో రాజకీయ పరిణామాలు తెలిసినంతవరకూ మేధావి విమర్శనాత్మకంగా వుంటూ సోవియట్ విప్లవాచరణను సరిగా పరిశోధనచేయాలనే అనుకొంటాను. నావరకూ రష్యాని గురించి నాకు తెలిసిందానిబట్టి నేను యీక్రింది విధంగా నిర్ణయానికొచ్చాను. 1917 లో రష్యాలో ఒక అస్పష్ట విప్లవభావం అవతరించింది.

ఇలాటి భావం అవతరించాక బైటనుండిగాని లోనుంచిగాని పొరబాట్లు, దారి తొలగటాలు జరుగటానికి ఎప్పుడూ అవకాశం వుంటుందన్నమాటే. తొందరలోనే కొన్ని వైరుధ్యాలు పొడసూపినవి. ఉదా — కార్మికుల్లా నిర్మాణయుతం కావించబడని రైతుల్ని కార్మికలోకంలోనికి కొనిరావలసివచ్చింది త్వరగా పారిశ్రామికీకరణ జరగటానికోసం. యీవిధంగా వరసగా కార్మికవర్గం పునర్నిర్మాణం పొందుతూ వచ్చింది. మార్క్సిజం ప్రచారానికి సాధనంగా తయారుచేయబడింది. ఫలితంగా కార్మికవర్గం నియంతృత్వం సాగవీలులేకపోయింది. కార్మికవర్గం ఎప్పటికప్పుడు మారుతూవుండటమే దాని అధికారం శక్తివంతంగా సాగకుండా చేసింది. నడక సాగుతూండటానికై మార్గాంతరాలు వచ్చినయ్. ప్రయోజనాలు, బహుమతులు, రకరకాలు జీతాలు. కమ్యూను అందుక్కారణమైన సాంఘిక అసమానత ను తొలగించటమనే మొదట్లో కన్నకలకు వ్యతిరేకమైంది. సోవియట్ అనుభవ పర్యవసానం తగినంత విస్తృతిలో బురాక్రటిక్ వర్గం ఏర్పడటం. బురాక్రసీ అనేదాన్ని బట్టుకొని యీ బురాక్రటిక్‌వర్గాన్ని అస్పష్టంగా విమర్శించేస్తేకాదు యీవర్గమే కార్మికులయొక్క, అప్పటి నిర్మాణంయొక్క పరిస్థితుల, వ్యక్తులయొక్క ప్రతిరూపమే.

ఇంకోప్రక్కన యిదీనిజమే. వ్యక్తిగత ఆస్తిని అణచివేసిన దేశాల్లో రష్యా ఒకటి యివాల్టికిన్నీ- అందుకని దానితో సంబంధాలే వదలుకునేంత విమర్శనాత్మక [illegible]నం రష్యాయెడల తీసుకొనటం సాధ్యంకాదు. కావలసింది పరిస్థితిని జాగ్రత్తగా

పరిశీలించటం. మేధావి తనకు కుదిరిన చిన్నపరిధిలోనయినా ప్రగతికోసమై పరిస్థితులపై ప్రభావం కల్గించాలి. సూత్రాలను సరిగా వ్యాఖ్యానించటానికి కట్టుబడాలి. రాజకీయ నేతకంటే మేధావిభిన్నం ఎలాగంటే— మేధావి యొక్క క్రియాశీల సిద్ధాంత ఆలోచన విప్లవాచరణ పెడదారులు పట్టకుండా చూడాలి.

డిసిప్లిన్, విమర్శల యొక్క సంక్లిష్ట వైరుధ్యాలను అపసవ్యంగా పరిష్కరించటమే రష్యాలో విప్లవ పరిశుద్ధత పేరుతో తెగదెంపులు చేసుకొనటమంటే.

వ్యక్తిగత ఆస్తికి చోటులేని దేశంగావటం, శోషణానికి ప్రవేశించే దశలోనేవున్నా శోషణాన్ని గురించి ఒక భావనగానయినా కలిగినదేశం కావటం, యింకా విప్లవకర శక్తులువుండటం— యిందువల్ల రష్యాకు విశ్వాసంగా వుండటం పూర్తిగా తప్పుపనికాదు. నేను ముందుగా చెప్పిన గతితర్క విశ్వాసాన్ని నిలబెట్టాలి. (విమర్శ-నిష్ఠ, విశ్వాసం).

క్యూబా రష్యా, చైనాలకు భిన్నమైన విప్లవకేంద్రమా?

మేధావి క్యూబాకు అనుకూలుడు కాకుండటం అసాధ్యం. ఆ గంద్రగోళ విప్లవంలో కొన్నిసమయాల్లో వ్యతిరేక లక్షణా లొచ్చినయేకాని దానిమార్గం మౌలికమైన తీవ్రవాదమార్గం. లాటిన్ అమెరికాలో క్యూబా ఏర్పర్చుకోదలుస్తున్న సంబంధాలతో సంఘీభావాన్ని ప్రదర్శించకుండా వుండటమూ అసాధ్యమే. కాని క్యూబా విప్లవం నమూనా యధాతథంగా యిక్కడ వినియోగించటమూ అసాధ్యమే, లాటిన్ అమెరికన్ దేశాలకు సమర్థనీయమైన ఆ నమూనా మార్పు జరక్కుండా యిక్కడ అమలుకు పనికిరాదు.

వారి మొదటి గురికి లక్ష్యం సైన్యం: చాలామంది లాటిన్ అమెరికన్ అతివాదులు సైన్యంలో తీవ్రవాదులులాగా ప్రవేశిస్తే సైన్యాన్ని యిటు మరల్చవచ్చునని. కాని క్యూబా గొప్పతనం దూరదృష్టి సైన్యాన్ని చావుదెబ్బ గొడితేగాని ముందుకు పోలేమని. సైన్యంయొక్క నిర్బంధశక్తిని నాశనంచేసినప్పుడే సరైన ప్రభుత్వం ఏర్పడుతుంది. ఫిడెల్ నాతో అన్నాడు "మేం ఎంతమంచి వాళ్లమైనా ఏరాజీతోనో ప్రభుత్వం మా చేతుల్లోకివస్తే మేమూ అవినీతికి గురయేవాళ్ళమే."

సైన్యం గురించిన యీదృష్టి చాలా తీవ్రమయిన మౌలికమైన విషయం. రెండవది సైన్యం వెనక అమెరికన్ ప్రయోజనాలను చూడగల్గటం. కాస్ట్రో మొదట్లో

బాటిస్టా నిరంకుశానికి వ్యతిరేకంగానే బయలుదేరాడు. కాని అతని తీవ్రవాద కార్యాచరణ ద్వారా అనతికాలంలోనే గ్రహించాడు– బాటిస్టాకి వెనక సైన్యం సైన్యానికి వెనకదన్ను అమెరికా శక్తివున్నట్లు, కనకనే మౌలిక తీవ్రవాదం అంతేమరి. అదే వీట్నాములోనూ అమెరికా ఎదుర్కొంటున్నది.

క్యూబా తీవ్రవాదం పూర్తిగా రైటు. కాని మనకు యూరోపు దేశస్థులకు అది మక్కీకి మక్కీ అమలుచేయ పనికొచ్చే నమూనాకాదు ఉత్తేజంపొంది హేతువాదంతో గతితర్కంతో తీవ్రవాదమును చేపట్టటం వరకే, గువెరాడెబ్రేతో అన్నాడని కొందరంటారు. ఏమని "మీదేశం వెళ్ళి గెరిల్లాలని తయారుచేయ"మని, అది అనూహ్యం. గువెరా అలా ఎప్పుడూ చెప్పడు. పారిశ్రామిక దేశాల్లో గెరిల్లాలు తయారవటం విప్లవానికి ముందు షరతుకాదు తనగొప్ప పుస్తకంలో డెబ్రే అందుకనే యిలా అన్నాడు" అక్కడి భౌతిక భౌగోళిక పరిస్థితులకు సాయుధపోరాటానికి లాటిన్ అమెరికా దేశాలకోసం తయారయిన మార్క్సిజమే కాస్ట్రోయిజం".

ఈ విమర్శకదృష్టి ఎక్కువగా సిద్ధాంతంమీద ఆధారపడి, ఆచరణలో పాశ్చాత్య మేధావిని క్రియాశూన్యతకు నడుపుతుందేమో? పాశ్చాత్యదేశాల్లో విప్లవ మేధావి ఏంచేయగలగొచ్చు?

విమర్శనాత్మక పరిశీలన అవగాహన కలిగించాల్సిన ప్రాథమిక కార్యక్రమ అవసరం వుంది. అందుకు చాలా పద్ధతులున్నయ్. ఇవాల్టి నాగరికత శాస్త్రప్రగతి కల్గిస్తున్న భ్రమలు, అవి తయారుజేస్తున్న భౌతిక వస్తుసంపదాపేక్ష మోహాలను ఆ మోహాలమత్తును, కీట సాంఘికచట్రాన్నీ జాగ్రత్తగా వున్నదున్నట్లుగా లోతు పరిశీలనతో ప్రజలను మేల్కొలిపేట్టు మంచి వ్యాసాలో పుస్తకమో రాయాల్సిన అవసరం వుంది. ఊరికే తిట్టేయటం కాకుండా ప్రజల్ని కనువిప్పు కలిగేట్టువున్న అన్ని ప్రచార సాధనాలనూ వినియోగించుకొని సమాజ చట్రాన్ని విమర్శిస్తూ వ్యతిరేకిస్తూ ప్రచారం విరివిగా చేయాల్సుంది, అతిచిన్న వివరణలతోసహా కార్యక్రమ ప్రతిపాదనలు చేయటం మేధావి చేయగల్గిందని నేననుకోను, ఆ పని విప్లవపార్టీది. మేధావి చేయాల్సింది– యివాళ నిర్వీర్యం అయిపోయిన చాలా విప్లవ సూత్రాలను పునర్నిర్వచించి, వాటిని మళ్ళీ దేశంలో ప్రతిష్ఠించగల్గటం.

కార్యాచరణ లేకుండా యిలా సిద్ధాంతపరంగా ప్రజలమేల్కొలపటం సాధ్యమా?

కార్యాచరణ, సిద్ధాంతపరమైన ప్రజామేల్కొల్పూ ఒకటే. కార్యాచరణలో వున్న ఒకగ్రూపు పేరులోనే, ఆ కార్యాచరణతో సంబంధంగానే యీ సిద్ధాంత మేల్కొల్పూ

సాధ్యమౌతుంది, అందుకే నేననేది మేధావికి కొంతకష్టం వుందని. రాజకీయ పార్టీలు అతన్ని అంతగా హర్షించవు రాడికల్ లైనునుండి పక్కదారిబట్టే నిర్ణయాలు రాజకీయావసరాలు, ఎత్తుగడలకోసం రాజకీయపార్టీలు అప్పుడప్పుడు చేస్తుంటయ్. అందుకనే మేధావికి కష్టం. ఇటు తనలాగా విశ్వసత్యాలకోసం ముందుకొచ్చిన రాజకీయపక్షంతో ఏకత్వమూ పొందాలి రెండవ ప్రక్కన అవకాశవాద వగైరా పెడదారులు పడుతున్నపుడు తన ప్రత్యేకతనూ చూపుకోవాలి.

మరి ఏనిర్దిష్ట కార్యాచరణను మేధావి ప్రతిపాదించాలి ?

దానికే వస్తున్నాను తను ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రూపుతోకలసి అతను విప్లవాన్ని గూర్చి విప్లవభావాల్ని గూర్చి పునరాలోచించాలి. గోర్జ్ లాగా, ఇటలీ కమ్యూనిస్టు పార్టీలాగా, ఉన్న పెద్దచిక్కును గమనించాలి. ఆలోచించాలి. విప్లవం అందుకు విరుద్ధమయిన సంస్కరణ వాదం. వర్గ సామరస్యంకోసమై విప్లవానికి తిలోదకాలిచ్చే సంస్కరణ వాదంవుంది. 50, 60 సం॥ల నాటి నిర్వచనాల ప్రకారం అదేపద్ధతిలో విప్లవం నడపసాధ్యం కానట్టు కనిపిస్తూనేవుంది కనీసం మనదేశాల్లో, ఈ సందిగ్ధాన్ని బాగా ఆలోచించి అర్థం చేసుకోవాలి.

ఈదృష్టితో గోర్జ్ (Gorz) పుస్తకాలు చాలా అవుసరం. విప్లవకారుడుగా వుండేందుకు విప్లవకారుణ్ణని చెబితేచాలదు. విప్లవం అంటే ఏమిటి అనే అవగాహన వుండాలి. లక్ష్యం మనకుతెలుసు. ఇంతవరకూ ఆధిపత్యం వహిస్తున్నవర్గాల, వాటి అవశేషాలమీద శ్రామికవర్గాల నియంతృత్వం ద్వారా నేటి సమాజస్థానంలో వర్గరహిత సమాజాన్ని రూపొందించటం, అది స్పష్టమే. అందుకని మన సమస్య విప్లవం అంటే ఏమిటి అనికాదు. అందుకు పద్ధతి ఏమిటి అని విప్లవకారుని సిద్ధాంత, క్రియాసంబంధ స్థానం ఏమిటి? ఫ్రాన్సులో ఒక సమిష్టి కార్యవిధానం ఆధారంగా అతివాదుల యూనియన్ సృష్టించటం, ఇది ముఖ్యమైన పని. తీవ్రవాదం అంటే అతివాద పార్టీలన్నిట్నీ తిరస్కరించి పారేయటం అనుకొంటే పొరబాటే. పోరాడే పరిస్థితులను అవకాశాన్ని కల్గించటమే మనపని.

కాని మేధావి రాజకీయవేత్తకాదు. ఒక కార్యక్రమం కొరకు వత్తిడిచేయటం విశాలమైన రేఖామాత్రపు రూపాన్నివ్వటమే అతని పని. నిర్దిష్టమైన వివరాల జోలికి అతను పోగూడదు

విప్లవపోరాటాలకు బదులుగా ఎన్నికచేసుకొనేందుకు పనికొచ్చేట్టు అతివాదుల యూనియన్లద్వారా తగినంతగా యీ పెట్టుబడిదారీ సమాజంను మార్చ సాధ్యమా? తీవ్రవాదకార్యాచరణకూ, మారే పెట్టుబడిదారీ సమాజానికీ మధ్య మనం ఎన్నికచేసుకోవటం అవసరమా? పెట్టుబడిదారీ సమాజాన్ని మార్చే ఆశతో మనం మీరకూడని హద్దు ఏది?

నా వుద్దేశంలో ఆ హద్దును ఎప్పుడో దాటేశాం. అతివాదుల కర్తవ్యం——అ కర్తవ్యం వాళ్ళకే తెలియదు– ఓటు, సమ్మెలనే లీగల్ సాధనలద్వారానే విప్లవాత్మక పరిస్థితులను సృష్టించటం. ఫ్రెంచి అతివాదులు అధికారం అనే సమస్యమీద చేయివేశారంటే అప్పటికప్పుడే విప్లవ పరిస్థితుల్లో నిలబడి వుంటారు– ఫ్రెంచి బూర్జువావర్గానికి వ్యతిరేకంగా కాదు– అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా.

ఫ్రెంచి అతివాద రాజకీయనాయకులు బూర్జువావర్గానికి కోపం కల్గించటానికి భయపడుతున్నారు. కమ్యూనిస్టుపార్టీకిచ్చే చిన్న కన్సెషన్లకే పెద్ద యిదయిపోతున్నారు, అందుకే ఆచరణలో ఎంతోదూరం పోవటల్లేదు, పరిపాలించటానికి ప్రయత్నిస్తారు. ఎలక్షన్లలో ఓడిపోతే స్థానాలను వదిలిపెట్టి బయటకు వచ్చేస్తారు, ఇదేనా లక్ష్యం?

కాదు. నేననుకొనేది స్పష్టంగా యిది—— ఏదయినా సరైందిచేయ మొదలెట్టగానే ఘర్షణలు ప్రారంభమవుతయ్. ముందు స్థానికంగా తర్వాత అంతర్జాతీయంగా, ఇపుడు విప్లవ పరిస్థితులు ఎక్కువగా అతివాదుల వల్లకంటే మితవాదులవల్ల తయారవుతున్నయ్. ప్రజలు ఒకచిన్న శాంతియుత సంస్కరణ కోరితేనే విప్లవ ప్రతీఘాతకం ముందుకొస్తోంది. గ్రీస్ సంగతి చూడండి. గ్రీకులు పెద్దగా విప్లవకారులని నేననటంలేదు. వారు ప్రజాస్వామ్య యంత్రాంగాన్నే కోరారు. వారిలో కొంతధైర్యం కలవాళ్ళు రాజులను తొలగించి బూర్జువా ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలనుకున్నారు. అదికూడా వారికి సాధ్యంకాలేదు. కారణం వెంటనే అమెరికా జోక్యం జేసుకొని మిలిటరీ కుట్ర తీసుకొచ్చారు. గ్రీసు మనకి పెద్దదూరంలో లేదు. అక్కడలా ఇక్కడ జరగదని అనలేము. '39 లో పోలెండ్‌లో ఇపుడు వియత్నాంలో జరిగింది. కాని గ్రీసు చూశాక యిక్కడా అలానే నిజంగా జరగొచ్చు అని తెలుసుకోవచ్చు.

[ఇంటర్వ్యూ చేసినవారు జె. సి. గేరట్. బ్రసెల్స్ నుంచి వచ్చే Le Point సంపాదకుడు. ఇంగ్లీషు అనువాదం బ్రూస్‌రైస్. Ramparts నుంచి]

తెలుగు అనువాదం: అట్లూరి రంగారావు.

విరామం

తెలుగులో యుద్ధవాతావరణాన్ని చిత్రిస్తూ వచ్చిన నవలలు చాలా తక్కువను కుంటాను. పాశ్చాత్య సాహిత్యాల్లో మొదటి, రెండు ప్రపంచయుద్ధాల ఆధారంతో వందలకొద్ది నవలలు వెలువడ్డాయి. A Farewel To Arms, From Here to Eternity, Naked and the Dead లాంటి నవలలు ఎన్నో వచ్చాయి ఇందుకు కారణం పాశ్చాత్యదేశాల్లో రచయితలకు యుద్ధంతో ఒకప్రత్యక్ష సంబంధం ఉండటం- యుద్ధాన్ని వాళ్లు అనుభవించటం.

తెలుగు రచయితల్లో యుద్ధంతో ప్రత్యక్ష సంబంధం ఉన్నవాళ్ళు చాలా అరుదేమో అందుకే యుద్ధవాతావరణాన్ని చిత్రించే ప్రయత్నం తెలుగు రచయిత లెవరూ చేసినట్టూలేదు. అంగర వెంకటకృష్ణారావు రచించిన 'విరామం' అన్న నవల ఈ లోటును కొంతవరకు తీరుస్తుంది.

'విరామం' రెండో ప్రపంచయుద్ధాన్ని గూర్చిన నవల. 'ఈ సమరంలో రాజ్యాలు చూస్తుండగా పేకమేడల్లా కూలిపోయాయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయాయి. మనుషులు కుంపట్లోపడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం। వర్ణనాతీతం' అన్నాడు రచయిత ఈ నవలకు రాసిన ముందుమాటలో. ఈనవలలో వర్ణించిన ప్రదేశాలన్నీ తనకళ్ళతో చూసినవేననికూడా రచయిత చెప్పాడు కాబట్టి రచయితకు రెండోప్రపంచ యుద్ధంతో ప్రత్యక్ష సంబంధం ఉండి ఉంటుందని మనమనుకోవచ్చు.

'విరామం' నవలంతా ఓ చక్కని డాక్యుమెంటరీ చిత్రంలా సాగుతుంది. నవలలో 'నేను' అంటూ కథ చెప్పుకుపోయే హవల్దార్ రావు ప్రధానపాత్ర అతడు చూసినదృశ్యాల్ని. కలుసుకున్న వ్యక్తుల్ని యధాతథంగా వర్ణిస్తూ సాగుతుంది. ఈతరహా నవలల్లో మామూలు నవలల్లో ఉండే కథ, పాత్రలు, సెంటిమెంట్స్, డ్రామా మొదలైనవి ఉండవు. హవల్దార్ రావు చూసిన దృశ్యాల్ని, కలుసుకున్న వ్యక్తుల్ని వరుసగా

చూపించుకుంటూ వెళ్లటమే ఈ నవలలో రచయిత చేసిన పని. అందుకే ఈ నవలను ఓ కథా చిత్రంలా సాగుతుందంటున్నాను.

యుద్ధం చాలా నిర్దాక్షిణ్యమైంది. మానవుడిలోని మానవుడు హతమైపోయి దానవుడు స్వైరవిహారం చెయ్యటం యుద్ధమంటే, యుద్ధంలో తరతరాలుగా అభివృద్ధి చేసుకున్న నాగరకతా సంస్కృతులూ, మానవత్వపు విలువలూ మంటగలిసిపోతాయి. యుద్ధబీభత్సం ఒక్క యుద్ధరంగంలోనే కాదు కనిపించేది. సాంఘిక జీవనంలోని ప్రతి అంశానికి అది విస్తరిస్తుంది. యుద్ధరంగానికి కొన్నివేల మైళ్ళదూరంలో ఉన్న పసిపాప నుండి పండు ముదుసలివరకు యుద్ధం యొక్క కబంధహస్తాల్లో పడి నలిగి పోవలసిందే.

'విరామం' లో రచయిత చూపించిందిదే. యుద్ధం సాగుతున్న రోజుల్లో ఆ యుద్ధం మన దేశప్రజల్ని ఎట్లా కాల్చుకుతిన్నదో చూపిస్తుంది 'విరామం'. అనాటి సాంఘిక జీవనంమీద యుద్ధప్రభావం ఎలా పనిచేసిందో చిత్రించటానికి ఈ నవల్లో ప్రయత్నం జరిగింది.

[విరామం: నవల. రచన: అంగర వెంకటకృష్ణారావు. ప్రతులకు:విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ-2. వెల: 3/-]

హవల్దార్ రావు తనను పోషించేసిన 'సిక్స్టీండియన్ హెవీయాకాక్ వర్క్ షాపు' ను వెతుక్కుంటూ తూర్పు బెంగాల్ ప్రాంతాల్లో తిరుగుతుండగా 'విరామం' ప్రారంభమౌతుంది. చాలా కష్టాలతో రావు తనగమ్యాన్ని చేరటం, అక్కడి అతడు కలుసుకున్న వ్యక్తులూ, తన మంచితనంతో అందర్నీ తనవైపు ఆకట్టుకోవటం, చివరకు అందర్నీ విడిచి తన స్వస్థానానికి వచ్చేయటంతో 'విరామం' ముగుస్తుంది. అయితే ఈనవలలో ఈ కథగానీ, పాత్రలుగానీ కాదు ప్రధానం రచయిత గొప్పగా చూపించిన ఆ యుద్ధపురోజుల్లోని మనదేశ సాంఘిక, ఆర్థిక వాతావరణం ముఖ్యం.

యుద్ధ సమయంలో దేశంలోని సంపదంతా మిలిటరీ వాళ్ళవైపు మళ్ళించబడుతుంది. ఇది చూసుకొని వ్యాపారస్తులు ఉన్నకొద్ది సరుకుల్ని బ్లాక్‌మార్కెట్‌లోకి చేరుస్తారు. ధరలు విపరీతంగా పెరిగిపోయి మధ్యతరగతి కుటుంబంవాళ్లు, పేదవాళ్ళ

చితికిపోతారు. అన్నమో రామచంద్రా అంటూ కడుపు చేతపట్టుకొని గుక్కెడు గంజి కోసం తమను తాము అమ్ముకునే స్థితికి దిగజారిపోతారు. మిలటరీవాళ్ళు వెళ్ళే ఒక వ్యభిచార గృహంలోని స్త్రీలనుగూర్చి రచయిత ఇలా అంటాడు:

"అక్కడున్నవాళ్లల్లో నూటికి తొంభైపాళ్ళు ఆకలికి తట్టుకోలేక వ్యాపారానికి దిగినవాళ్ళే. వాళ్ల పూర్వాశ్రమంలో కిలకిల్లాడే కుటుంబాల్లో ముద్దుగా, ముచ్చటగా, మురిపెంగా, గౌరవంగా, గర్వంగావున్న భార్యలు, తల్లులు, కూతుళ్లు, అక్కలు, చెల్లెళ్ళు; రోజుల తరబడి నిట్రుపాసాలుచేసి, శరీరం తూలిపోయి, కళ్లు పచ్చబడి పోయి, స్వంతబాధకన్న, తల్లిదండ్రుల, తోబుట్టువుల, భర్తల, నోరులేని పసిపిల్లల ఆకలిచావులు చూడ్లేక, కుటుంబ జీవనం నరకంలాతోచి, భవిష్యత్ జీవితపు చీకటింటి అంధకారంలో ఒక సన్నటి వెలుగురేఖ కూడా కనిపించక గుండెలు బద్దలై అక్కడి నుంచి పారిపోయి యిక్కడకు వచ్చేరు. వీళ్ళకి సిగ్గు, సిరంలేదు తాగటానికి మద్యం, తినటానికి మాంసంతో కూడిన ఆహారం కావాలి. తాగుతూ తింటుంటే, అచ్చంగా చచ్చిపోయిన జంతువుల్లా ఉంటారు. కుళ్ళి కంపుకొడ్తున్న శవం తనమీద ఒకేసారి పది పన్నెండు రాబందులు పడి నాలుగు పక్కల్నించి పీక్కుతింటుంటే యేం ఖాతరు చేస్తుంది, వీళ్ళూ అచ్చంగా అంతే."

ఒక పక్కన లక్షలాదిమంది ప్రజలు ఆకలి చావులకు గురౌతోంటే మిలిటరీ వాళ్ళకు మాత్రం యేకొదవాలేదు. హవల్దార్ రావు అంటాడు:

"మాకు తిండికీ బట్టకీ కొదవలేదు. విలాస వస్తువులకీ, సిగిరెట్లకీ, తాగుడు పదార్థాలకీ కరువులేదు సరేకదా అవెప్పుడూ కోకొల్లలు. ధర్మరాజు రాజసూయయాగం తలపెడితే అతని నలుగురు తమ్ముళ్ళూ ఆసేతుశీతాచల పర్యంతం వున్న రాజులందర్నీ చావగొట్టి ధనకనక వస్తువాహనాల్ని మోసుకొచ్చి అన్నయ్యముందు పడేశారు. ఈ మానవ మారణయాగంలో కూడా అదేతంతు జరిగింది. రాయల్ ఇండియన్ ఆర్మీ సప్లైకోరువాళ్ల తమ కబంధ హస్తాలతో దేశాన్ని గాలించి అన్నిరకాల సరుకులు, రాసులూ, ఢేటులూ తరుగులేకుండా తెచ్చిపడేస్తున్నారు. ఉప్పుతో తొమ్మిది దినుసులు కాకుండా తొంభైతొమ్మిది దినుసులు దిమ్మాతిరగా ఉండేవి. వీటిలో మూడొంతులు అంచీ అంచీనా తిరిగి చీకటిబజార్లోకి వెళ్ళేవి".

మరోచోట "ఈ యుద్ధం సాకుతో మహమ్మారిలా కరువు ఊళ్ళకి ఊళ్ళు చుట్టబెట్టి, లక్షలాది అమాయక ప్రజల్ని గొంతుపిసికి చంపుతూంటే, కుళ్ళిపోయిన

వాళ్ళ శవాల్లోంచి కార్లు పుడుతున్నై, మేడలేస్తున్నాయి, సిల్కుచీరలు, అత్తరుసీసాలు. చిరునవ్వుల విద్విలాసాలు ఆ శవాల్ని ముట్టుకొని వెళిపోతున్నాయి. శవాల్ని యెవరూ పట్టించుకోవటం లేదు. ఎలక్ట్రీతీగను అంటుకొని వేలాడుతున్న గబ్బిలం. మునిసిపల్ చెత్తబండి చక్రం కిందపడి చచ్చిపోయిన కుక్కపిల్ల, షావుకారు కొట్టిచంపి పడేసిన ఎలక, ఆకలిచావు చచ్చిపడిన మనిషి కళేబరం అన్నీ సమానంగానే ఉన్నాయి."

అలాగే, శ్రీ సుఖంకోసం మొహంవాచి ఉన్న మిలటరీవాళ్లు ఆ చుట్టుపట్ల ఉన్న గ్రామాలమీద పడి పేదింటి ఆడవాళ్ళను చెరచటం, ఆ రోజుల్లో మిలటరీలో తెల్లవాళ్లు నల్లవాళ్ళని హీనంగా చూడటం, తెల్లవాడు చేసిన నేరాన్ని నల్లవాడిమీదికి నెట్టి వాడిని శిక్షించటం లాంటి వెన్నింటినో 'విరామం' చిత్రిస్తుంది.

హవల్దార్ రావుకు పద్మమీదున్న అవ్యాజానురాగాన్ని అతసున్నితంగా చిత్రించాడు రచయిత. నవల ప్రారంభంలోనే అతడు పద్మను కలుసుకోవటం, ఆమెతో ఒక ఆత్మీయతను పెంచుకోవటం, ఆ తర్వాత ఆమెకోసం అన్వేషించటం, కాని చివరకు ఎన్నో కష్టాలపాలైన పద్మను కలుసుకొని ఓదార్చబోతున్నాను అనుకుంటుండగా అతడు తన స్వదేశానికి తిరిగిరావలసి రావటం నవలలో చక్కని పాథోస్‌ని సృష్టించింది.

తీసుకున్న ఇతివృత్తానికి తగిన శక్తివంతమైన శైలితో 'విరామం' పాఠకున్ని ఊపిరి తీసుకోనివ్వకుండా యేకబిగిన చదివించేస్తుంది.

ఇటీవల తెలుగులో వచ్చిన మంచి నవలల్లో 'విరామం' ఒకటని నిస్సందేహంగా చెప్పవచ్చు.

— మహేంద్ర

"చీకటి నిండిన గుండెలలో ఎర్రని కాగడాలు"

యూనివర్శిటీ టౌన్‌గాక మునుపే యాత్రాస్థలంగా మతమౌఢ్యానికి పెట్టని కోటగా నిలిచిన తిరుపతిలోనుంచి గూడా "క్రొత్తనీటి వెల్లువ" మొదలైంది "నిప్పురవ్వల్లాంటి సిద్ధాంతాలు"—

కత్తితో ఖండించు కత్తిని
శక్తితో దండించు శక్తిని (ఖైజాం)
హింస ఈవ్యవస్థ వికృతశిశువు
ప్రతిహింస చేయనివాడు పత్తిపశువు. (అత్తలూరి నరసింహారావు)
దేశంలో సంభవించిన నెత్తుటివరదలో
పాతకాలం సమూలంగా కరగిపోతోంది. (రాంచందర్)

భజనకీర్తనల మధ్య, జాతరగోలల మధ్య వినవస్తున్నాయంటే, దేశ చరిత్రలో ఇప్పుడిప్పుడే మొదలౌతూన్న విప్లవానుకూల పరిస్థితినీ, దానికి సాహిత్య దోహదం చెయ్యబూనిన విప్లవ రచయితల సంఘాన్నీ అభినందించవలసి వుంటుంది. ప్రజలకు మందలక్షణమూ గుంపుగుణమూ పోగొట్టి చైతన్య "విద్యుత్తేజం" నింపారే వర్గగుణాన్ని జీవితమే కలిగిస్తూవుంది. ఆ గుణాన్ని గుణంగానే గ్రహించడం మేధావులకూ సాహిత్యోపజీవులకూ అలవాటులేని పని. మరి రాజారెడ్డి, సుభాష్, హనీఫ్, రాంచందర్, నూమన్, జ్యోతి, అత్తలూరి నరసింహారావు, ఖైజామ్, సంవర్త, అనంత వంటి కొత్తకవులు ఆపనికి పూనుకుంటున్నారు. త్రిపురనేని మధుసూదనరావు గారు విప్లవ కవిత్వం చేకూర్చుకోవలసిన రూపాన్నీ వస్తువునీ తేల్చిచూపగలిగారు.

"పల్లెల్లో రైతుకూలీలు" ఈ విప్లవ సాహిత్యానికి పాఠకులయ్యారని మధుసూదనరావుగారు అంటున్నారు. ఇది Wishful thinking లాంటిదేనని నేననుకుంటాను. ఇంకా ఆదశరాలేదు. అవశ్యం రావాలి. లేకుంటే విప్లవ సాహిత్యం కూడా సాహిత్యపరులకో మధ్యతరగతి పాఠకలోకానికో పరిమితమై విఫలమౌతుంది.

శ్రామికవర్గంతో కలిసిమెలిసి వుంటేనేతప్ప, "ప్రత్యక్ష పరిచయం"వుంటేనే తప్ప, విప్లవ కవిత్వానికి వుండవలసినంత ప్రజాస్వభావం వుండబోదనడం అబద్ధం కాదుగాని అసాధ్యమని, కనీసం ప్రస్తుతానికైనా అసాధ్యమని చెప్పనక్కర్లేదు. ఎందుకంటే, ఇంకా విప్లవ రచయితలు కూడా మధ్యతరగతి నుంచే ఎక్కువగా వస్తున్నారు. మధ్యతరగతి భావపరిధినుంచి తప్పించుకుని de-class కావడానికి ప్రయత్నిస్తున్నారు కూడా. అయితే చింత చచ్చినా, దానిపులుసు అంత త్వరగానూ చావదని నాభయం కాకుంటే, మధుసూదనరావుగా రంటున్నట్టుగా, విప్లవ రచయితలు వివిధ అంతస్థుల సామాన్యప్రజల జీవితాలను పనిగట్టుకుని అధ్యయనంచేస్తూ వారి పలుకుబడిని సొంత

పరుచుకోవలసి వుంటుంది. ఇది రోజులమీద జరిగగల పనిమాత్రం కాదు. విప్లవ సాహిత్యం కష్టజీవుల చైతన్యాన్ని పోరాటమార్గం నుంచి జారిపోకుండా అంతిమ మహా విప్లవం వైపుకి నడిపించే సంకల్పంతోటి ప్రారంభమైంది. ఎవరిని ఉపలక్షిస్తున్నామో వారికి అర్థంకాకపోతే విప్లవ సాహిత్యంకూడా నిరర్థకమే అవుతుంది కాబట్టి సుబోధకత్వం, సూటిదనం చాలా అవసరం.

ఈ సంకలనంలో సాంఘిక, సాహిత్య దృక్పథాల విషయం చూస్తే ఎక్కువమంది కవులకు సాంఘిక దృక్పథం పదునుదేరినంతగా సాహిత్య దృక్పథం పదును దేరలేదేమో ననిపిస్తున్నది. మధుసూదనరావుగారే ఇంకా "గ్రుడ్డి", "గొడ్డు", "ఎఱ్ఱని" వంటి పాత ప్రయోగాలను వదులుకో లేకున్నారు. ఒకొక్కప్పుడు ఈ ఛాదస్తం 'సింధూరం' వంటి ప్రయోగాలకు గూడా తీసుకొనిపోతుంది. 'వేలు' అనే నామవాచక శబ్దానికి 'వేళ్లు' బహువచనం కాగా, "వ్రేళ్ళు" అనేది ఇందువల్లనే ఏర్పడుతున్నది. వెనకటికి ఒక సంపాదకీయంలో నార్లవంటి రచయితకూడా ఈ పొరబాటే చేశారు. వైదీకిపిల్లిలా ప్రత్తిపంకబోవడం ముఖ్యంగా విప్లవ రచయితకు అనవసరం. తెలియని మాటల్ని వాడేప్పుడే 'సింధూరనికుంజం' 'ప్రపంచం సుందర సోపానం' లాంటివి వెలువడుతాయని గమనించాలి. మధుసూదనరావుగారు గ్రాంథిక భాషా పండితులు కాబట్టి సమాస బంధురత్వం గురించి వారికిగల మక్కువ, సుబోధగ్రాహ్యత గురించి వారికిగల కోరికను ఓడించివెయ్య గలుగుతున్నది. అలాంటి పండితులుకాని, కాగోరని, ఇతర కవులు అర్థకల్పనచెయ్యని పదబంధాల జోలికి పోగూడదని నా కోరిక.

[లే: కవితా సంకలనం, సంకలనకర్త శ్రీ టి. సుభాష్, విప్లవసాహితి తిరుపతి. పబ్లిషర్స్: శ్రీ బాలాజీ పబ్లిషర్స్. 81 బజార్ స్ట్రీట్, తిరుపతి. వెల : రు. 1-50.]

"ఊహను ఊదటంలో, భావాన్ని శబ్దించటంలో, చిత్రాన్ని గీయటంలో, లక్ష్యాన్ని నిర్దేశించటంలో నలుసులేమైనావుంటే ప్రథమ ప్రయత్నం కావటమేకారణం" అని 'కొనమాట'గా చెప్పుకున్నారు. ప్రథమ ప్రయత్నమే కావచ్చుగాక, ఇది అథమ ప్రయత్నం మాత్రంకాదు. 'తిరగబడు', 'మార్చ్', 'ఝంఝు' సంకలనాల తర్వాత ఆ మొక్కట్లతోనే పుట్టుకొచ్చిన 'లే!' సంకలనం, విప్లవకవిత్వ ప్రస్థానంలో మరో

మైలురాయి. ఇప్పటికే 'మార్చ్', 'ఝంఝ'ల మీద ప్రభుత్వం శీతకన్ను వేసింది. శ్రీశ్రీ గారన్నట్లు, "తెలుగునాటికి సంబంధించి నంతమట్టుకు ఈసరికే విప్లవరచన విజయవంత మయిందని" చెప్పవచ్చు. మన నినాదం మన విమర్శకుల నోళ్ళలో ప్రతిధ్వనిస్తున్నది. మనని చూచి మన విమర్శకులు వాతలు పెట్టుకుంటున్నారు. మన విరోధులు మన నోళ్ళను మూయజూస్తున్నారు. విప్లవ రచయితల సంఘం ఏడాది దాటకముందే సాహిత్యలోకంలో ఒకశక్తి అయేంతగా ఎదిగివచ్చింది.

'లే!' కవులు ఇస్తూన్న పిలుపు బధిరులకు మాత్రం కాదు. "విశ్వవిద్యాలయాల్లో వికసించని మనస్సీమల్లో" ఇది బదులు పలకకపోవచ్చు. అకాడెమి బుడబుక్కలవాళ్ళ చెవులకు సోకకపోవచ్చు. సీరియల్ నవలల, 'మధు' పుస్తకాల, పాఠకులకూ, ఉబుసుపోక పి నీ మా ప్రేక్షకులకూ ఎక్కక పోవచ్చు. ఇతరులకంటె ముందుగా నిద్రలేచి "ఊరికి దూరంగా కోడికూత" మొదలెట్టినవాళ్లకు వినిపిస్తే చాలు. అయితే ఆ కోడికూత ఊరిలోనే సాగితే ఇంకా మంచిది. "ఎక్కడో గలగలా రావం" ఇక్కడే సాగితే మరికావలసిం దేమిటి? అప్పుడే నిజానికి, "తుపాకి హస్తాల్లో ఒరిగిన శిఖరం విప్లవ సంతతిని" సృష్టించగలుగుతుంది. "కారడవుల్లో వేసిన క్రాంతి బాటలు" కారడవుల్లోనే అంతం కాగూడదన్నమాట. విప్లవ కవులుకూడా తమ సిద్ధాంత కవచంలోని రంధ్రాలను పూడ్చివేసుకోవలసి వుంటుంది. గమ్యమెంత ముఖ్యమో, మార్గమూ అంతే. "పెత్తందారీ శివరాత్రికి జాగారం" చేస్తూ "ఎన్నికల జాతర్లలో త్యాగపు బలి పశువు"గావున్న పరిజ మానవ చరిత్రలో ప్రథమ స్వాతంత్ర్యాధ్యాయ రచనవైపు నడిచేందుకు, భావ విప్లవాన్ని సంఘటింప జెయ్యాలి. విప్లవ రచయితల కర్తవ్యం ఏకబిగిలో విధ్వంసనాన్నీ వినిర్మాణాన్నీ సమకూర్చడమే. "అదే నేటి మహోన్నత మానవ కర్తవ్యం" అంటూన్న కవితోటి నేను గొంతు కలుపుతున్నాను.

—కె. వి. రమణారెడ్డి

సాహిత్య లేఖలు :

నిషేధాజ్ఞలు సముచితమా ?

ఆంధ్ర ప్రభుత్వం ఇటీవలే 'మార్చ్' 'ఝంఝ' అనే కవితా సంకలనాల పైన నిషేధాజ్ఞలు జారీచేసింది. ఆ పుస్తకాలు ప్రభుత్వంపై విద్రోహాన్ని పురికొల్పినట్లుగా ఆరోపించబడింది. ఆ నిషేధాజ్ఞలు యెంతవరకు వాంఛనీయమో చర్చనీయమౌతుంది

1) ఈ రోజుల్లో ప్రజాస్వామ్యం అమలులో ఉంది. ప్రతివయోజనుడూ ఓటు హక్కు వినియోగిస్తూ శాసనానికి పరిపాలనకు బాధ్యతవహించే ప్రతినిధులను బాధ్యతతో ఎన్నికచేస్తూ ఉన్నాడు. అంతేకాక, ప్రజలకు మంచీ చెడుగులను గూర్చి నిరంతరం ప్రబోధం చేస్తూన్న రాజకీయపార్టీలు, పలుప్రజాసంస్థలు, పత్రికలు, సినిమాలు, రేడియోలాటి విజ్ఞాన సాధనాలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. అలా బాహాటమైన స్వేచ్ఛాసమాజ వాతావరణం కొనసాగుతూ ఉన్నస్థితిలో'మార్చ్, ఝంఝ' లాంటి ఏవోకొన్ని పుస్తకాల రాతలవల్ల ప్రజలు దేశద్రోహానికి దిగగల ప్రమాదముంటుందని భావించడం హాస్యాస్పదం. 'మార్చ్' 'ఝంఝ' లాంటి పుస్తకాల్లోని గేయాలు చదివినంత మాత్రాన పాఠకులు అందులో చెప్పినట్లల్లా చేసేటంత అమాయకు లనుకునే తీరుకు ప్రజాస్వామ్య, స్వయంపరిపాలనా సూత్రాలలో అర్థం ఉండకపోవాల్సివస్తుంది. కనుక, అలాంటి పుస్తకాల మంచిచెడుగుల నిర్ధారణను ప్రజల స్వయం నిర్ణయానికి వదలినట్లయితే రాగల ముప్పేమిటో తోచదు ...

2) సాహిత్యరంగంలో రచయితల భావస్వాతంత్ర్యానికి విస్తృతపరిధులు ఉంటవి, కార్టూన్, గాసిప్, పారెడీ, సెటైర్, కామెడీ, ఫార్స్, లాంటి ప్రక్రియల్లో కవి, రచయితలు ఆలంకారికంగా, కాల్పనికంగా, భావస్ఫూర్తికి అవశ్యకమయ్యే విశేష స్వేచ్ఛను వినియోగిస్తారు. ఆయా రచనల ఉద్దేశం పాఠకుల్లో ఆత్మవిమర్శను, అనుభూతిని ప్రేరేపించగల 'సద్యః పరనివృత్తి' అనే లక్షణమేకాని వేరేంకాదన్న అవగాహనతోనే విస్తృతమైన సాంస్కృతిక స్వేచ్ఛా విన్యాసానికి గుర్తింపు ఇవ్వడం జరుగుతూ ఉంది. కవితకుకూడ అలాంటి కావ్య స్వేచ్ఛా రక్షణలనేవి అనుమతింపబడ్డాయి. కవులుకూడ తాము రచనల్లో వెలిబుచ్చే భావాలను ప్రజలు నిజంగా అమలుపరుస్తారని కాని, ఆ భావాలు ఆచరణలో కార్యరూపం పొందితీరాలనికాని ఉద్దేశించరు. పాఠకుల మనస్సును ఆకట్టుకొని వారిని రంజింపజేయడమే వారిప్రయోజనం ... అలాంటపుడు 'మార్చ్' 'ఝంఝ'సంకలనాల్లో రచనలుచేసిన కవులు యేమేరకు తమ సాహితీస్వేచ్ఛ పరిధులను అధిగమించారో, యేమేరకు చట్టధిక్కార నేరానికి బాధ్యత వహించగల

ఆచరణాత్మక పరిణామాలకు కారకులయ్యారో అనే సమస్యలు ఉదయిస్తాయి. పుస్తకాలను నిషేధించిన సందర్భంలో. ఈ విషయంలో, ప్రభుత్వంవారు యేయే సాహితీవేత్తల, న్యాయవేత్తల ద్వారా పరిశీలన జరిపించారో, ఆ నిపుణులు యే ఆధారంపై నిషేధానికిగాను సలహా యిచ్చారో అనేవి అగమ్యగోచరం అవుతూ ఉంది. సాహిత్యంపై నిషేధాజ్ఞలు విధించే సందర్భంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం బాధ్యతాయుతంగాను విజ్ఞతాయుతంగాను ఉందని విశ్వసించడానికిగాను కనీసనిదర్శనాలు అలభ్యం అవుతున్నాయి. అలాంటి వైఖరి అసంతృప్తికరం అనాల్సియుంటుంది.

3) నేటి నాగరిక సమాజంలో సాహిత్యంపై ప్రభుత్వాలు అదుపాజ్ఞలు, నిషేధాలువిధించే పాతకాలం పద్ధతులు సడలిపోతున్నట్లు చూడగలం. నైతిక, లైంగిక, మతమతాంతర విశ్వాస అభ్యంతరాలేకాక, రాజకీయ సిద్ధాంత సంకుచితత్వాలు కూడ రచయితలచే బాహాటంగా త్రోసివేతకు గురియౌతున్నాయి. ఫ్రాయిడ్, జంగ్, పావ్లావ్ లాంటి మనస్తత్వజ్ఞులు, మార్క్స్, ఎంగెల్స్‌లాంటి సాంఘికవేత్తలు, హక్స్లే, సార్త్రే, పికాసో, సిజేన్‌లాంటి రచయితలు కళాకారులు తెస్తున్న అపూర్వభావ విప్లవాన్ని యెలాంటి యినుప తెరలుకూడ నిరోధించలేవు. మన యువతరం అలాంటి స్వేచ్ఛావాయువులను పీల్చనంతవరకు సాంస్కృతిక పునరుజ్జీవనావశ్యకతలు నెరవేరవు. అందుకని ప్రభుత్వవిధానం స్వేచ్ఛా భావనలను, వినూత్నాభిరుచులను అధునాతన విచారధారలను అదుపుచేయగోరే వైఖరిలో పడిపోకూడదు. అందువల్ల ఆధునికీకరణ బాధ్యతలు కుంటుపడ్తాయి. ఈనాడు దేశదేశాల్లో ప్రజల విప్లవ ప్రభంజనాల తాకిడికి చీట్లపేకమేడల్లా కూలిపోతున్న నిరంకుశ ప్రభుత్వాల ఉదంతాలనుకూడ కప్పిపుచ్చాలంటే సాధ్యపడే పనికాదు. వార్తలను విశేషాలను త్రొక్కిపెట్టే పద్ధతులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోవుటకు దారితీస్తాయి. దేశంలో శాంతిభద్రతలు కొనసాగుతున్నంతమేరకు రాజ్యాంగంలో పొందుపరచబడియున్న భావప్రకటన స్వాతంత్ర్యాన్ని నిష్పక్షపాతంగా అమలుపరచవలసి యుంటుంది. కనుక, మావో భావాలకు లేదా చెగువేరా భావాలకుచెందే సాహిత్యమైనప్పటికీ దానితో వైజ్ఞానిక సహజీవనం ఆవశ్యకమే అవుతుంది. అభిప్రాయ భేదానికి, పొరపాటు ఉద్దేశాలకు కూడ స్వాతంత్ర్యం ఉండవలసి యుంటుంది. లేనిచో సాంస్కృతికంగా నూత్నప్రయోగ రూపకమైన ప్రగతి కుంటుబడిపోతుంది. అందువల్ల 'మార్చ్' 'ఝంఝ'లాంటి కవితా సంకలనాల నిషేధవైఖరి సమంజసం అనిపించుకోదు.

4) నిషిద్ధసాహిత్యం రహస్య ప్రచారం పొందడమనేది సామాన్యానుభవం. నిషేధించబడే కావ్యాలను పాఠకులు చాటుమాటుగా చదవడం ప్రారంభిస్తారు. నిషిద్ధరచనలు అదొక 'మోజు'గా తయారై వాటిని యువకులు రహస్యంగానైనా అనుక

రించడం కూడ సంభవమే. అలాంటి నేపథ్యగత పరిచారాల బెడదను అరికట్టే విషయంలో ప్రభుత్వం యేమీచేయలేని పరిస్థితి ఉంటుంది. సాంస్కృతిక రంగంలో అలాంటి బ్లాకుమార్కెట్ తత్వం భౌతికంగానేకాక నైతికంగాకూడ వాంఛనీయం కాదు. అంతేకాక, ఒకప్పుడు ప్రభుత్వ నిషేధాలకు గురియైన సాహిత్యమే అటుపిదప మహోన్నత సాంస్కృతిక ప్రాధాన్యత పొందిన అనుభవాలు అనేకం ఉన్నది సువిదితాంశమే. కనుక సాంస్కృతిక స్వేచ్ఛవిషయంలో ప్రభుత్వ ప్రమేయం యేవిధంగాను సత్ఫలితాలకు దారితీయనట్లుగా గత అనుభవాలు నిరూపిస్తాయి. 'మార్చ్'. 'ఝంఝ' కావ్య సంకలనాల నిషేధం సందర్భంలో ప్రభుత్వం రహస్య ప్రచార బెడదను, సాంస్కృతిక స్వేచ్ఛపరిగణన బాధ్యతను విస్మరించడం దురదృష్టకరం. 'మార్చ్. ఝంఝ' కవితాసంకలనాల నిషేధంవల్ల ఆ పుస్తకాలను ప్రకటించిన విప్లవ రచయితల సంఘం నిషేధానికి వ్యతిరేకంగాచేస్తూన్న విస్తృత ఆందోళన ఆ పుస్తకాలలోని రచనల ఇతోధిక ప్రచారానికి, ప్రాధాన్యతకు దారితీస్తూ ఉన్న పరిస్థితులు, సాంస్కృతిక స్వేచ్ఛ విషయంలో ప్రభుత్వ 'విధానా'న్ని గూర్చి ప్రజలలో శంకాసందేహాలకు అవకాశాలేర్పడే పరిస్థితులు ఉత్పన్నమౌతున్నది గమనార్హమౌతుంది. ఈ పరిణామాలను యెదుర్కొనే విషయంలో ప్రభుత్వం మౌనం వహించాల్సిన నిస్సహాయపరిస్థితులు మరింతగా నిషేధోద్దేశాల విఫలతకు నిదర్శనమౌతున్నాయి.

పై కారణాలవల్ల ప్రభుత్వం 'మార్చ్'-'ఝంఝ' కవితాసంకలనాల నిషేధ సమస్యను పునరాలోచన చేయాల్సి యుంటుందని అంతేకాక నిషేధాజ్ఞలను ఉపసంహరించుకొనడం సముచితం కాగలదని చెప్పవలసియుంటుంది. ఈ విషయంలో సోదర రచయితలు, సాహితీసంస్థలు తగు సమాలోచనకు పూనుకొనడం అవసరం. భావవ్యక్తీకరణను అరికట్టే ప్రభుత్వవిధానాల సమస్యను సముచితంగా పరిష్కరించుకొనుటకుగాను ప్రయత్నించడం వాంఛనీయమౌతుంది.

—వరంగల్ పౌరులు, రచయితలు

ఓ ఆంక్షా, ఓ అరస్టూ

కోట్లకొద్దీ ఓట్ల సంచుల్తో నిబ్బరంగా నిల్చున్న పెద్దలు ఓ చిన్నపిలుపుకీ ఓ చిరుకేకకీ భయపడతారని నేననుకోలేదు. కాని శ్రీ పెండ్యాల కిషన్‌రావుగార్ని అరెస్టుచేసేరు.

అంటే;

కేకలో బలం ఎక్కువైనా అయుండాలి, ప్రభుత్వంలో ధైర్యం తక్కువైనా అయుండాలి.

అలనాడు తెలంగాణా పోరాటంలో పెద్దలమీద పేదలు తిరుగుబాటు చేసేరు కాబట్టి అది రాజద్రోహం అయింది, దేశద్రోహం అయింది. అప్పుడు పెద్దలంతా ఆ పేదల్ని జంతువులకంటె హీనంగా హింసించి చిత్రవధచేసేరు ఈమధ్య జరిగిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో పెద్దలే తిరుగుబాటుచేసేరు. కాబట్టి అది రాజద్రోహం కాకపోయింది. మొన్నటి ఈ ఉద్యమంలో పెద్దవారంతా కలిసి శ్రీ కిషన్‌రావుగారు వెయ్యాని కేకలు వేసేరు. చెయ్యాని అల్లర్లుచేసేరు. పెద్దలది వర్గద్రోహంకాదు కాబట్టి వారిది రాజద్రోహంకాదు. అందువల్లనే, దేశాన్ని గాంధీగారివర్గానికి అప్పజెప్పగలిగిన బ్రిటిషువారు అలనాడు భగత్సింగుని మాత్రం ఉరికంబానికి అప్పజెప్పకుండా ఉండలేక పోయేరు.

కాబట్టి, శ్రీ కిషన్‌రావుగార్ని ప్రభువులు అరెస్టుచేసేరంటే, మనం ఆశ్చర్య పడవలసిన అవసరంలేదు. ప్రజలపక్షాన పిట్ట నిల్చున్నాసరే పెద్దలు దాని రెక్కలు విరిచి రక్తం తాక్కమానరు. అయితే, వారుచేసే పాపాలగురించి మనం నిరసన తెలియజెయ్యకపోతే దెబ్బతిన్న పిట్టలయెడల మనం పరమపాపం చేసినవాళ్లం అవుతాం.

సిండి-కేటు ముఠా అధికారంలోకివస్తే ప్రజల్లో విప్లవం చెలరేగక తప్పదని కొత్త కాంగ్రెసు పెద్దలంతా ఈమధ్య చెప్తూవచ్చేరు. ఈ ముఠాలే అధికారంలోకి వచ్చినట్లయితే, ఈ విప్లవం రావడం న్యాయం అవుతుందా, అన్యాయం అవుతుందా? ఎవరన్యాయం చేసినాసరే ఆ అన్యాయంమీద తిరుగుబాటు చెయ్యడం న్యాయమే అవుతుందని శ్రీ కిషన్‌రావుగారూ, నేనూకూడా అంటాం. తూర్పు బెంగాల్లో ప్రజలు ఓట్లతో కొండలాంటిగోడ కట్టుకున్నప్పటికీ పటమటవారి ఫిరంగులకి ఆగోడ కూలకా మిగల్లేదనీ. ఆ సంఘర్షణలో- వేడినెత్తురు ప్రవహించకా తప్పలేదనీ శ్రీ కిషన్‌రావు గారితోపాటు నేనుగూడా చేజారి చూపిస్తాను. అధర్మాన్ని హతమార్చక తప్పని పరిస్థితుల్లో శివుడి శూలంకోసం, విష్ణు చక్రంకోసం పూర్వం ఋషులంతా ప్రార్థించినట్టు ఈనాడు అటువంటి పరిస్థితుల్లో పుణ్యజనం చెలరేగాలనీ. ప్రజాశక్తి వర్ధిల్లాలనీ చిరు మాటలతోనైనా శ్రీ కిషన్‌రావుగారూ నేనూకూడా తప్పకచేస్తాం.

"మార్చ్" కూడా ఇంతకిమించి మరేమీ చెప్పలేదని నేననుకుంటున్నాను. వాణ్నెవణ్నో చాలా జుగుప్సాకరంగా భీభత్సంగా పేగులు తెంపి చంపిన నరసింహ మూర్తి గురించి వివరాలతోసహా మనం ఇప్పటివరకూ చిన్నపిల్లలక్కూడా చెప్తున్నాం కదా! మరైతే "మార్చ్"ని మాత్రం ఎందుకు నిషేధించడం? కిషన్‌రావుగార్ని ఎందుకు నిర్బంధించడం?

విశాఖపట్నం—2
20—3—'71

— రాచకొండ విశ్వనాథశాస్త్రి

స్వాధీన్ బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ నిన్ను నేను గుర్తిస్తున్నాను
వీట్నాం, లావోస్, కాంబోడియా ప్రజల
పోరాటాల్లో ప్రవహించే స్వాతంత్ర్యేచ్ఛా రక్తం
గంగానదిని పవిత్రం చేసిన రోజు
ఢాకా, చిటగాంగ్ వీధులు
స్వాధీన బంగ్లాదేశ్ కొరకు
ఎర్ర తివాచీ పరిచినట్లు హృదయాల్లోంచి నెత్తుర్లు
చిమ్మిన రోజు
నిన్ను నేను గుర్తించాను.
దోపిడీ వర్గానికి, నియంతృత్వానికి
వెతిరేకంగా పోరాడడానికి
మతం మత్తుమందునుకూడా కాలదన్ని
మానవతా పతాక ఎత్తిన నాడే నిన్ను
నేను గుర్తించాను.
నా తెలంగాణ దోపిడి దొంగలు పన్నిన
భాషా సాలెగూడును చీల్చినందుకే
శభాష్ అన్నాను నేను
నిన్ను గుర్తించకుండా ఎలా వుండగలను

దోపిడీకి మతంలేదు, దోపిడీకి కులంలేదు
దోపిడీకి భాషలేదు, దోపిడీకి జాతిలేదు
దోపిడీకి దేశం లేదు.
తిరుగుబాటుకూ, విప్లవానికీ
సరిహద్దులు లేవు, సార్వభౌమత్వాలు లేవు

సార్వజనీనత, స్వాతంత్ర్య కాంక్ష తప్ప—
అని చాటిన బంగ్లాదేశ్ నువ్వు
మేకతోలు కప్పుకున్న
తోడేలు వేషం చీల్చి చూపావు

నీళ్ళునమిలే, చేతగాని తటస్థ ఎటూగాని వాళ్ళవలె
నిన్ను నేను తూర్పుబెంగాల్ అనో, తూర్పు పాకిస్తాన్ అనో
పిలవను. నిన్ను బంగ్లాదేశ్ అంటాను
నీ బిడ్డల ఏడున్నరకోట్ల కంఠాల పిలుపు అది
నీ బిడ్డల పదిహేనుకోట్ల నయనాల్లో మెరిసే
రేపటి జెండా అది.
నీ బిడ్డల హృదయాల్లోని స్వాధీన బంగ్లా అది.
ఎవడు జోశ్యం చెప్పగలడు
రేపు పదికోట్ల ప్రజల వీరబెంగాల్ ఏర్పడి
బ్రిటిష్ కుతంత్రం చీల్చిన దేశం
ఒకటి కాదని

ప్రజలు కోరింది, ప్రజలందరూ పాల్గొన్నది
దేశద్రోహమో, జాతిద్రోహమో, భాషాద్రోహమో
అనే హక్కు నాకేమున్నది
అయితే అయింది.
దేశమూ, జాతీ, భాషా ఏదీ దోపిడీనుంచి
ప్రజల్ని రక్షించనినాడు, వాటి పేరు మీద
ప్రజలు భక్షింపబడ్డనాడు
అన్నింటినీ కాలదన్నే
ఆకలివర్గం నాది, అంతర్జాతీయ స్వర్గం నాది
అది నీది, బంగ్లాదేశ్, అది మనది.

బంగ్లాదేశ్, నీ యిటీవలి చరిత్ర నీకూ నాకూ
గుణపాఠాలు నేర్పింది.
ఓట్లతో దోపిడీని జయించవచ్చనే భ్రమ
ఇవ్వాళ బులెట్ల దెబ్బలకు తూట్లయిపోయింది.
అహింసతో తోడేలును జయిస్తానని
అమాయకంగా నమ్మిన మేక ముజిబ్
అండర్ గ్రౌండ్‌కు వెళ్తే తప్ప
అశేష ప్రజల్ని ఆహ్వానిస్తే తప్ప
ఆశయం సిద్ధించదని గ్రహించాడా?
బంగ్లాదేశ్, నీ నాయకుడు ముజిబ్
నిజంగా నీ నాయకుడే అయితే
నాయకుడు కాదు అమాయకుడు
అమాయకులను మిడుతల దండువలె
మంటల్లోకి తోసిన వాడు.

శత్రువు ట్యాంకులను ఓట్లు కాదు
గెరిల్లాలు మాత్రమే కూల్చగలరని
పాశవిక శక్తుల్ని ప్రజాసైన్యమే
ఎదురిస్తుందని తెలుసుకున్న బంగ్లాదేశ్
నీకు జేజేలు.
నీ ప్రజల అజేయమయిన
స్వాతంత్ర్యా కాంక్షకు నా జోహార్లు.

నాపాలం బాంబుకన్నా బలమైన
నారా స్వేచ్ఛ
శతుృవు ఆయుధం కన్నా బలమైంది
ప్రజా హృదయం.

—కలం వీరయ్య

SRJANA Telugu Monthly April 1971 Regd. No. 10953/67

ప్రతులకు, వివరాలకు :
సృజన
పోస్టుబాక్సు నెం. 67
వరంగల్–2 (ఆం. ప్ర.)

సంవత్సర చందా : పది రూపాయలు
అర్థ సంవత్సర చందా : ఆరు రూపాయలు
విడిప్రతి : ఒకరూపాయి

ముద్రణ :
వేంకటరమణ ముద్రణాలయము,
జె. పి. యన్. రోడ్,
వరంగల్-2

Edited Printed and Published by Varavara Rao for 'Sahithee Mithrulu'
84 Pages 100 Paise